


- ట్యాంకర్లను నిలిపేసిన ఉన్నతాధికారులు
- వైసీపీ నేతల దొంగ ట్రిప్పుల లెక్కలే కారణం
- నీరు దొరక్క గగ్గోలు పెడుతున్న జనం
- బోర్లలో అడుగంటిన భూగర్భజలాలు
- నిత్యం రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్న మహిళలు
- సమస్యను పట్టించుకోని ప్రభుత్వ పెద్దలు
- పలుచోట్ల నీటి సరఫరాకు ముందుకొచ్చిన టీడీపీ నేతలు




పెద్దనాగులవరంలో నీటి కోసం నిరీక్షిస్తున్న మహిళలు, పొదిలిలో బైకులపై నీటిని తీసుకెళ్తున్నజనం

పశ్చిమ పల్లెల్లో దాహం కేకలు

ఒంగోలు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : పశ్చిమ పల్లెల్లో దాహం కేకలు మిన్నంటుతున్నాయి. గుక్కెడు నీటి కోసం వందలాది గ్రామాలు గగ్గోలు పెడుతున్నాయి. తాగునీటికే కాక ఇతర అవసరాలకూ నీరు దొరక్క ప్రజలు తల్లడిల్లిపోతున్నారు. నీటి కోసం నిత్యం పలు చోట్ల పెద్దఎత్తున ఆందోళనలకు దిగుతూనే ఉన్నారు. నీటి సరఫరాలో స్థానిక వైసీపీ నేతల కక్కుర్తి, ఉన్నతాధికారుల బాధ్యతారాహిత్యమే ప్రస్తుత దుస్థితికి కారణం. ప్రభుత్వ పెద్దలు తమకేమీ తెలియదన్నట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో అనేక గ్రామాల్లో నీటి సమస్య తీవ్ర రూపం దాల్చగా, కొన్నిచోట్ల స్థానిక టీడీపీ నేతల చొరవ చూపి సొంత డబ్బులతో నీటి సరఫరా చేస్తున్నారు. మరికొన్నిచోట్ల ప్రజల నుంచి వస్తున్న ఒత్తిడిని తట్టుకోలేక స్థానిక ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకుంటున్నారు. ఇలాంటి చర్యలు పరిమిత గ్రామాల్లో మాత్రమే కనిపిస్తున్నాయి.



గుండంచర్లలో టీడీపీ సర్పంచ్ సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన నీటి ట్యాంకర్ వద్ద నీళ్లు పట్టుకుంటున్న గ్రామస్థులు

మార్కాపురం మండలంలోని వేముల కోట, పెద్దయాచవరం, మన్నెంవారిపల్లి, నాయుడుపల్లి, గజ్జలకొండ, తిప్పాయపాలెం, పెద్దనాగులవరంలలో నీటి ఎద్దడి అధికంగా ఉంది. పెద్దారవీడు మండలంలోనూ తాగునీటి సమస్య తీవ్ర రూపం దాల్చింది. గుండంచర్లలో ఈ నెల 1నుంచి ప్రభుత్వం నీటి ట్యాంకర్ల సరఫరాను నిలిపేసింది. ఆ రోజు నుంచి టీడీపీ సర్పంచ్ ఇండ్ల రజిత తండ్రి రామకృష్ణారెడ్డి సొంత నిధులతో నీటిని తెప్పించి ప్రజల దాహార్తి తీరుస్తున్నారు.

పొదిలికి పక్కనే ఉన్న జువ్వలేరులో నీటి కోసం ప్రజలు అల్లాడుతున్నారు. 250 కుటుంబాలున్న గ్రామంలో 365 రోజులూ నీటి ఎద్దడే. దీంతో ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తున్నారు. ఇటీవల ఉన్నఫళంగా సరఫరా నిలిపివేయడంతో పొదిలికి వచ్చి తాగునీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని ఆ గ్రామస్థులు చెప్తున్నారు.

ఎర్రగొండపాలెం మండలంలో తాగునీటి సమస్య రోజురోజుకూ పెరుగుతోంది. మండలంలో మొన్నటివరకు నిత్యం 138 ట్యాంకర్ల నీటిని వ్యవసాయ బోర్ల నుంచి సేకరించి సరఫరా చేశారు. ఈ నెల 1 నుంచి ట్యాంకర్లను నిలిపివేయడంతో జనం నీటి కోసం అల్లాడుతున్నారు.

వైసీపీ నేతలు ట్యాంకర్ల ట్రిప్పుల్లో దొంగ లెక్కల వల్ల ఈనెల 1నుంచి మంచినీటి సరఫరా ట్యాంకర్లను ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో పశ్చిమ ప్రాంతంలో నీటిఎద్దడి నెలకొంది. పలు గ్రామాల్లో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల దూరంగా ఉన్న పొలాల నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. ఇంకొన్నిచోట్ల దాతలు, టీడీపీ నేతలు సొంత ఖర్చులతో నీటిని అందిస్తున్నారు.

వైసీపీ నేతల కక్కుర్తి

కొన్నిచోట్ల నీటిని సరఫరా చేసిన కాంట్రాక్టర్లు (వైసీపీ నేతలు) కొంతమేర అవినీతికి పాల్పడ్డారు. ట్రిప్పుల లెక్కలలో తేడాలు చేశారు. సకాలంలో బిల్లులు ప్రభుత్వం నుంచి రాకపోతుండటం, నీటిని తోలే వారంతా వైసీపీ వారే కావడంతో స్థానిక అధికారులు ఏమి అనలేక ఉదాసీనంగా వ్యవహరించారు. చివరకు బిల్లుల కోసం కాంట్రాక్టర్లు రోడ్డెక్కి ఆందోళనలు చేయడం, వైపాలెం నుంచి ప్రాతినిధ్యం వహించిన మంత్రి ఆదిమూలపు సురేష్ పలుమార్లు సీఎంను కలవడం, కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రభుత్వానికి లేఖలు రాయడంతో దాదాపు రూ.70 కోట్లు విడుదలయ్యాయి. ఇంకా రూ.60 కోట్లు పెండింగ్ ఉన్నాయి. జనవరి ఆఖరు నాటికి కూడా పశ్చిమప్రాంతంలోని 12 మండలాల్లోని 82 ఆవాసాలలో ట్యాంకర్లతో నీటి సరఫరా కొనసాగింది. అందులో 43 ఆవాసాలు వైపాలెం సెగ్మెంట్‌లో, 23 ఆవాసాలు మార్కాపురం సెగ్మెంట్లో ఉండగా, దొనకొండ మండలంలో 11 గ్రామాలు ఉన్నాయి.

నిత్యం తాగునీటి సమస్యే

జిల్లాలోని అత్యధిక ప్రాంతాల్లో తాగునీటి వనరులు అంతంతమాత్రమే. వాడుకనీరు కూడా చాలా ప్రాంతాల్లో దొరకని దుస్థితి. ప్రత్యేకించి పశ్చిమ ప్రాంతంలో నీటి ఇక్కట్లు ఏడాది పొడవునా ఉంటాయి. మార్కాపురం, వైపాలెం నియోజకవర్గాల తోపాటు దర్శి, కనిగిరి, గిద్దలూరు నియోజకవర్గాల్లో కొన్నిగ్రామాల్లో భూగర్భజలాలే ఆధారం. వెయ్యి అడుగుల లోతు వరకు బోర్లు వేసి మోటార్లు (డీప్ బోర్లు) పెట్టి వాటి ద్వారా సరఫరా చేస్తుంటారు. వర్షాలు లేకపోతే అవికూడా పనిచేయవు. పొలాల్లో ఉండే లేదా ఇతర ప్రాంతాల నుంచి ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలి. ఇక వేసవిలో సమస్య తీవ్రం. పశ్చిమప్రాంతంలోని దాదాపు 400 ఆవాసాలలో ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాల్సిందే. ఏడాదికి ఇందుకోసం రూ.50 కోట్లు కూడా వెచ్చించాల్సి వస్తోంది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక నిధులు ఇవ్వకుండా నీటిని సరఫరా చేసిన వారిని ఇబ్బందులకు గురిచేసింది. అలా 2019 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు సుమారు రూ.137 కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయి.

ఉన్నతాధికారుల అనాలోచిత చర్య

తాగునీటి ఎద్దడి నెలకొన్న పరిస్థితుల్లో ప్రభుత్వ స్థాయి ఉన్నతాధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారు. వారి అతి నిర్ణయంతో కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిన చందంగా పరిస్థితి తయారైంది. నీటి సరఫరాలో అవకతవకలు జరిగినట్లు గుర్తించామని, గ్రామాల్లో నీటి సరఫరాను నిలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారి ఆదేశించారు. తదనుగుణంగా ఈనెల 1 నుంచి 82 ఆవాసాలలో ట్యాంకర్లతో నీటి సరఫరా నిలిచిపోయింది. నీటి ట్యాంకర్ల తోలకంలో అక్రమాలు వాస్తవమే. క్షేత్రస్థాయి అధికారులు, నీటిని తోలే వైసీపీ నేతలు కూడబలుక్కొని చేశారన్నది బహిరంగ సత్యం. దానికి ఏళ్ల తరబడి ప్రభుత్వం బిల్లులు ఇవ్వకపోవడం, ఎప్పుడో నిర్ణయించిన ధరలు వంటి అనేక కారణాలు ఉన్నాయి. ఉన్నతాధికారులు వాస్తవ కారణాలు గుర్తించి అవినీతి, అక్రమాలు నివారించాల్సింది పోయి ఆ పేరుతో అసలు నీటి సరఫరా నిలిపివేయించారు.

టీడీపీ ప్రజాప్రతినిధుల చొరవ

వైపాలెం నుంచి రెండుసార్లు గెలుపొంది, తాగునీటి సమస్య తీవ్రత తెలిసిన మంత్రి సురేష్ ఈసారి కొండపి రాజకీయంలో బిజీగా మారిపోయారు. ఇతర ప్రజాప్రతినిధులు అలాగే ఉన్నారు. ప్రజల్లో వస్తున్న అలజడి, ఒత్తిడిని తట్టుకోలేక పలు గ్రామాల్లో సర్పంచ్‌లు సొంత ఖర్చులతో ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారు. కొందరైతే స్వచ్ఛందంగానే నీరిస్తున్నారు. వైపాలెం మండలంలోని అమానుగుడిపాడులో టీడీపీ సర్పంచ్ రోజుకు 15 ట్యాంకర్లతో సరఫరా చేస్తుండగా, పెద్దారవీడు మండలంలోని గుండంచర్లలో సర్పంచ్ రజని తండ్రి రామకృష్ణారెడ్డి చొరవ చూపి ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారు. వైపాలెం మండలంలో మురారిపల్లి, వాదంపల్లి, అయ్యంబోట్లపల్లి గ్రామాల్లో సర్పంచ్‌లు నీరు తోలుతున్నారు. త్రిపురాంతకం మండలం రామసముద్రంలో సర్పంచ్ ఏసోబు చొరవ చూపి బోరు తవ్విస్తుండగా పలు ఇతర గ్రామాల్లో స్థానిక టీడీపీ నేతలు నీటిని సరఫరా చేస్తున్నారు. కొన్నిచోట్ల పొలాల్లోని బోర్లకు విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసి స్థానిక ప్రజాప్రజాప్రతినిధులు నీటిని ఇచ్చే ప్రయత్నం చేస్తున్నా పాలకులు స్పందించడం లేదు.

స్థానిక సంస్థలపైనే తాగునీటి సరఫరా భారం

ట్యాంకర్లతో నీటి సరఫరాను ప్రభుత్వం నిలిపివేయడంతో గగ్గోలుపెడుతున్న పశ్చిమప్రాంత ప్రజల సమస్యపై జిల్లా యంత్రాంగం దృష్టిసారించింది. అందుకు అవసరమైన చర్యలను మండల, గ్రామ పంచాయతీల్లోని 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ నిర్ణయంతో అసలే అరకొర నిధులతో అల్లాడుతున్న స్థానిక సంస్థలకు పెనుభారం కానుంది. ప్రభుత్వం నుంచి ఇప్పుడు నీటి సరఫరాపై స్పష్టత వచ్చే అవకాశం లేకపోవడం, జనం నీటి కోసం నిత్యం రోడ్డెక్కుతుండడంతో జిల్లా యంత్రాంగం ఆ మేరకు చర్యలకు నిర్ణయించినట్లు సమాచారం. అవసరమైన చోట్ల ట్యాంకర్లతోనే సరఫరా చేయాలా లేక ఇతర సౌకర్యాలు ఏమైనా ఉన్నాయా అన్నది పరిశీలించి నివేదించాలని జేసీ నేతృత్వంలో ప్రత్యేక కమిటీని కలెక్టర్ నియమించారు. ఆ కమిటీ పర్యవేక్షణలో ఆయా ప్రాంతాల్లో పరిశీలన సాగగా 82 ఆవాసాలలో 72చోట్ల రవాణా తప్ప మరో మార్గం లేదని నిర్ధారించి నివేదించారు. 70చోట్ల తక్షణం సరఫరా పునరుద్ధరించడం అవసరంగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వానికి ఆ విషయం తెలియజేసి, అక్కడి నుంచి అనుమతులు పొంది నీటి సరఫరా చేయడం అంటే చాలా సమయం పడుతుంది. దీంతో మండల, గ్రామపంచాయతీల్లోని 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. స్థానిక సంస్థలకు ఇది భారం కానుండగా ఏ మేరకు అమలుచేస్తారో చూడాల్సి ఉంది.

మూడేళ్లుగా ట్యాంకర్లకు బిల్లులు ఇవ్వలేదు

- ఇండ్ల రామకృష్ణారెడ్డి, గ్రామ సర్పంచ్ తండ్రి

గుండంచర్ల గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైనప్పటి నుంచి గ్రామంలో నీటి సరఫరా కోసం రెండు ట్రాక్టర్ల ద్వారా రోజుకు 15 ట్రిప్పులతో తాగునీటిని సరఫరా చేస్తున్నాం. మూడేళ్ల నుంచి ట్యాంకర్లకు రూపాయి బిల్లు చెల్లించలేదు. ప్రభుత్వం ఇచ్చినా, ఇవ్వకపోయినా ప్రజల తాగునీటి ఇబ్బందులను గుర్తించి సొంత నిధులతో ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నా. ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడం దారుణం.

మంచి నీటికి రోడ్డెక్కిన మహిళలు



ఖాళీ బిందెలతో రాస్తారోకో చేస్తున్న మహిళలు

తర్లుపాడు, ఫిబ్రవరి 15: మండలంలోని మేకలవారిపల్లెలో మంచినీటి సమస్య పరిష్కరించాలని కర్నూలు, ఒంగోలు జాతీయ రహదారిపై అరగంట పాటు రాస్తారోకో నిర్వహించారు. దీంతో ఇరువైపులా కిలోమీటరు మేర ట్రాఫిక్ జామ్ అయింది. ఆర్టీసీబస్‌లోని ప్రయాణికులు రాస్తారోకో చేస్తున్న మహిళల వద్దకు వచ్చి విద్యార్థులకు పరీక్షలు ఉన్నందువలన బస్సులను పోనియాలని కోరారు. దీంతో అరగంట తర్వాత మహిళలు రాస్తారోకో విరమింపజేశారు. కలుజువ్వలపాడు పంచాయతీలోని మేకలవారిపల్లెలో నెలరోజుల నుంచి తీవ్ర మంచినీటి సమస్య నెలకొంది. గ్రామంలోని బోర్లన్నీ ఒట్టిపోయాయి. గుక్కెడు మంచినీరు దొరక్క ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో విధిలేని పరిస్థితుల్లో మినరల్ వాటర్ కొనుక్కొని తాగాల్సిన పరిస్థితి నెలకొంది. పశువులకు కూడా నీరు దొరకడం లేదు.

ఉద్యోగుల ఆందోళన

- జేఏసీ ఇచ్చిన పిలుపుమేరకు
- జిల్లావ్యాప్తంగా నిరసనలు
- కలెక్టరేట్ ఎదుట డిమాండ్లు
- పరిష్కరించాలంటూ నినాదాలు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 15: తమ ఆర్థిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయులు జిల్లావ్యాప్తంగా ఆందోళనలు చేపట్టారు. ఏపీ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా గురువారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జిలు ధరించి నిరసనలు తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు ఒక చోటకు చేరి ప్రధాన డిమాండ్లను పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. జేఏసీ జిల్లా చైర్మన్ కూచిపూడి శరత్ బాబు నాయకత్వంలో కలెక్టరేట్ ఎదుట వందలాది మంది ఉద్యోగులు నిరసన తెలిపారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత డీఏలు, సరెండర్ లీవ్‌లు, ఏపీజీఎల్ఐ, జీపీఎఫ్ రుణాలు రాక ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వం ఇదే విధానాలను అవలంభిస్తే రానున్న రోజుల్లో ఉద్యమాన్ని ఉధృతం చేయాల్సి వస్తోందని హెచ్చరించారు. కాగా ఆయా ఉద్యోగ సంఘాల నాయకులు తమ తమ కార్యాలయాల నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు తరలివచ్చారు. కార్యక్రమంలో కొత్తపల్లి మంజేష్, శివకుమార్, ఏడుకొండలు, కిషోర్, షరీఫ్, మాధవి, కోటేశ్వరమ్మ, విజయ్. సునీల్, లక్ష్మీనారాయణ, అమ్మయ్య, సాగర్‌రెడ్డి, పెన్షనర్ల సంఘం నాయకుడు అంకిరెడ్డి తదితరులు ఉన్నారు.



కలెక్టరేట్‌లో ప్రదర్శన చేస్తున్న ఉద్యోగులు

'రాజధాని ఫైల్స్' నిలిపివేత



రాజధాని ఫైల్స్ సినిమాపై రాష్ట్ర ప్రభుత్వం తన అక్కసు వెళ్లగక్కింది. థియేటర్లలో తొలి ఆట మొదలైన కొద్దిసేపటికే కోర్టు ఉత్తర్వులంటూ ప్రదర్శనను అడ్డుకుంది. సినిమాలో ప్రభుత్వ తీరును ఎత్తిచూపుతూ అమరావతి రాజధాని రైతుల కష్టాలు, వారి ఆవేదనను తెలియజేస్తూ తెరకెక్కించిన ఆ సినిమాను అర్ధంతరంగా అధికారం అండతో ఆపేయించింది. గురువారం జిల్లాలోని పలు థియేటర్లలో సినిమా విడుదలైంది. మొదటి ప్రదర్శనకే విశేష స్పందన లభించింది. ఒంగోలులోని గోపి థియేటర్‌లో ప్రదర్శనను పోలీసులు, రెవెన్యూ అధికారులు ఆపివేయించడంతో ప్రేక్షకులు జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

-ఒంగోలు

వైసీపీకి షాక్

- బాబును కలిసిన గరటయ్య, చైతన్య
- దర్శి నుంచి పోటీకి అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి
- కష్టపడి పనిచేసినా వైసీపీ మోసం చేసిందని ఆవేదన
- మంచి జరుగుతుంది, ధైర్యంగా ఉండండి: బాబు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే డాక్టరు బాచిన చెంచుగరటయ్య, ఆయన కుమారుడు శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్యలు గురువారం రాత్రి టీడీపీ అధినేత చంద్రబాబును కలిశారు. వైసీపీ అధినేత, సీఎం జగన్ తమను మోసం చేశాడని తీవ్ర అసంతృప్తితో ఉన్న వారు టీడీపీ అధినేతను కలవటం విశేషం. గురువారం సాయంత్రం ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుతో కలిసి వెళ్లి వారు భేటీ అయ్యారు. గతం నుంచి ఉన్న పరిచయంతో చంద్రబాబు వారిని సాదరంగా ఆహ్వానించారు. ఆ వెంటనే గరటయ్య వైసీపీలో చాలా కష్టపడి పనిచేశామని, నాలుగున్నరేళ్లుగా తన కుమారుడు చైతన్య నియోజకవర్గంలో విస్తృతంగా తిరుగుతూ పార్టీ కోసం, ప్రజల కోసం పనిచేయగా చివరికి జగన్ మోసం చేశాడని వాపోయినట్లు తెలిసింది. కష్టపడిన వారిని కాదు పొమ్మన్నారని చెప్పి చైతన్యను పరిచయం చేశారు. మీరు అవకాశం ఇస్తే పార్టీలో చేరి దర్శి నుంచి పోటీ చేయటానికి సిద్ధంగా ఉన్నామని చెప్పినట్లు సమాచారం. చంద్రబాబు కూడా సానుకూలంగా స్పందించి మీకు వైసీపీలో జరిగిన మోసం తెలిసింది, టీడీపీలో చేరాలని చెప్పినట్లు తెలిసింది. చైతన్యకు న్యాయం జరుగుతుందని అభయమిచ్చి జనసేనతో పొత్తును ప్రస్తావిస్తూ దర్శిని జనసేనకు కేటాయించే అవకాశం ఉందని, అన్ని విషయాలను పరిగణనలోకి తీసుకుని సహకారం అందిస్తానని చెప్పినట్లు సమాచారం. ప్రజాసేవ చేయాలంటే టీడీపీ, జనసేన కూటమి వల్లే సాధ్యమని, మీరు ఈ కూటమిలోకి రావాలని కోరినట్లుగా చెబుతున్నారు. ఆ తర్వాత వారు ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌ను కూడా కలిసి మాట్లాడినట్లు సమాచారం. తొలుత నియోజకవర్గంలోని సంతమాగులూరు మండలానికి చెందిన వైసీపీ రాష్ట్ర నాయకుడు అట్ల చినవెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. తర్వాత తన గదిలో అచ్చెన్నాయుడు సమక్షంలో గరటయ్య, చైతన్యలతో చంద్రబాబు చర్చించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు వారి గురించి చెప్పబోగా తనకు సుపరిచితులేనని బాబు చెప్పినట్లు తెలిసింది. అయితే కూటమిలో ఏపక్షం నుంచి వీరు తెరపైకి రానున్నారనేది చర్చనీయాంశమైంది. కాగా గరటయ్య, చైతన్యలను వైసీపీ అధిష్ఠానం సస్పెండ్ చేసింది. బాబును కలిసిన కొద్దిసేపటికే ఆ పార్టీ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.



బాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్నచైతన్య, పక్కన గరటయ్య

నేడు గ్రామీణ భారత్ బంద్

వామపక్షాల మద్దతు, ఒంగోలులో భారీ ర్యాలీ

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 15: కేంద్రంలోని ప్రధానమంత్రి మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా శుక్రవారం గ్రామీణ భారత్‌బంద్, పారిశ్రామిక సమ్మె నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా, కార్మికసంఘాల ఐక్యవేదికల ఆధ్వర్యంలో ఒంగోలులో భారీ ప్రదర్శనను నిర్వహించనున్నారు. రైతాంగం పట్ల కేంద్రం అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ చేపట్టిన గ్రామీణ బంద్‌కు వామపక్షాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. దీంతో జిల్లావ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించేందుకు ఆయా సంఘాల నాయకులు ఏర్పాట్లు చేశారు. ఒంగోలులో స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద నుంచి భారీ ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శన ఆర్టీసీ బస్టాండు, అద్దంకి బస్టాండు, బాపూజీ కాంప్లెక్స్, ట్రంకురోడ్డు మీదుగా కలెక్టరేట్ వరకు నిర్వహించనున్నారు. అనంతరం అక్కడ సభ నిర్వహించనున్నారు. ఈ గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెలో అన్నివర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు చుండూరి రంగారావు కోరారు.

ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా డాక్టర్ పద్మజ

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 15 : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఇన్‌చార్జి అధికారిగా డీఐవో డాక్టర్ పద్మజను నియమించారు. ఇక్కడ డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్న డాక్టర్ రాజ్యలక్ష్మి అనారోగ్య సమస్యలతో ఈనెల 26వ తేదీ వరకు సెలవు పెట్టారు. ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా డాక్టర్ పద్మజను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులిచ్చారు. ఈ నెల 27న డాక్టర్ రాజ్యలక్ష్మి తిరిగి విధుల్లో చేరనున్నారు.

టీడీపీలో చేరిన వలంటీర్

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 15 : కంభం మండలం లింగాపురం గ్రామంలో వలంటీర్‌గా పనిచేస్తున్న మిట్టా విద్యాసాగర్ వైసీపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా గురువారం తన పోస్టుకు రాజీనామా చేసి టీడీపీ ఇన్‌చార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. విద్యాసాగర్‌కు అశోక్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. గిద్దలూరు టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మిట్టా ప్రసాద్, దూదేకుల ఖాశింసాహెబ్, జె.కేశవులు, ఎ.శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



వలంటీర్ పోస్టుకు రాజీనామా చేసి ముత్తుముల సమక్షంలో టీడీపీలో చేరిన విద్యాసాగర్

కనుమళ్ల చెరువులో గ్రావెల్ దందా

నేషనల్ హైవే మరమ్మతుల పేరిట అనుమతి ● నిబంధనలు ఉల్లంఘించి లేఅవుట్లకు తరలింపు ● టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్థులు

సింగరాయకొండ, ఫిబ్రవరి 15: సింగరాయకొండ మండలంలోని కనుమళ్ల పంటచెరువులో అక్రమార్కులు యథేచ్ఛగా గ్రావెల్‌ను కొల్లగొడుతున్నారు. జాతీయ రహదారి మరమ్మతుల నిమిత్తం అంటూ ఇరిగేషన్ అధికారుల నుంచి తాత్కాలిక అనుమతులు తీసుకొని దాని మాటున స్థానిక ప్రైవేట్ లేఅవుట్లకు మట్టిని తరలిస్తూ లక్షలు గడిస్తున్నారు. వీటిని అడ్డుకోవాల్సిన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు చోద్యం చూస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దీంతో గ్రామస్థులే రంగప్రవేశం చేసి గురువారం కనుమళ్ల చెరువు నుంచి అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న ఐదు టిప్పర్లను, ఎక్స్‌కవేటర్‌ను నిలిపివేశారు. వివరాలోకి వెళ్తే.. నెల్లూరు జిల్లా కావలి చెందిన కె.నితీష్ టంగుటూరు నుంచి కావలి మధ్య ఉన్న జాతీయరహదారి మరమ్మతుల నిమిత్తం అవసరమైన గ్రావెల్‌కు ఇరిగేషన్ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. ఒంగోలు ఇరిగేషన్ ఈఈ సింగరాయకొండ మండలంలోని కనుమళ్ల చెరువు, మూలగుంటపాడులోని జువ్వలగుంట చెరువుల్లో నిబంధనలను పాటిస్తూ ఒక్కో చెరువు నుంచి 1000 క్యూబిక్ మీటర్లు తవ్వుకోవడానికి అనుమతులు మంజూరు చేశారు. నిబంధనలు ఉల్లంఘించి చెరువులో మట్టిని టిప్పర్ల ద్వారా అక్రమంగా తరలించడంపై గ్రామస్థులు మండిపడుతున్నారు. పంటచెరువులో పెద్ద ఎత్తున గోతులు పెడుతున్నారని, వర్షపు నీటితో నిండినపుడు వాటి నుంచి పంటపొలాలకు మోటార్లు పెట్టి తరలించుకోవడం ఇబ్బందిగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోజుకి ఎనిమిది టిప్పర్ల ద్వారా అక్రంగా తరలింపు

దాదాపు వారం రోజుల నుంచి 8 టిప్పర్ల ద్వారా గ్రావెల్‌ను అక్రమంగా లేఅవుట్లకు తరలిస్తున్నారు. ఒక్కొక్క టిప్పర్‌కు రూ. 5వేలు వరకూ వసూలు చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. కేవలం చెరువులో 1000 క్యూబిక్ మీటర్లకు అనుమతి తీసుకొని అంతకుమించి వేలల్లో తరలించడంపై రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ అధికారులు మడుపులు అందడంతోనే అక్రమార్కులకు అడ్డుకోవాల్సిన అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.


గ్రావెల్ టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్థులు

పరిశీలించి చర్యలు తీసుకుంటాం
- చిరియన్, ఇరిగేషన్ డీఈ

చెరువులో అక్రమంగా మట్టి తరలిస్తున్నట్లు మాదృష్టికి వచ్చింది. శుక్రవారం పరిశీలించి నిబంధనలు ఉల్లంఘించినట్లయితే ఇచ్చిన అనుమతులు రద్దుచేసి చర్యలు తీసుకుంటాం.

రథసప్తమికి ఏర్పాట్లు పూర్తి


కలశం స్థాపన చేస్తున్న అర్చకులు, అధికారులు

ఒంగోలు(కల్చరల్), ఫిబ్రవరి 15: ఒంగోలులోని శ్రీప్రసన్నచెన్నకేశవస్వామి రథసప్తమికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం రథసప్తమి సందర్భంగా జరిగే రథోత్సవానికి గురువారం కలశం స్థాపన, వాస్తు హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. 70 ఏళ్ళ తర్వాత ఒంగోలు నగరంలో స్వామి వారు రథంపై భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఈ రథం ఏర్పాటుకు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి తన సొంత నిధులతో తయారు చేయించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ ఈదుపల్లి గురునాథం మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 6.30గంటల నుంచి ప్రసన్న చెన్నకేశవస్వామి సప్తవాహనంపై నగరోత్సవం జరుగుతుందని తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు మాగుంట రాఘవరెడ్డి తయారు చేయించిన రథాన్ని బహూకరించనున్నారు. ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. స్వామి వారి రథోత్సవంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మాగుంట కార్యాలయ ప్రతినిధి బద్రిరెడ్డి, ఈవో డి.రజనికుమారి, అర్చక స్వాములు ఎం.శ్రీనివాసదీక్షితులు, రమణాచార్యులు, కేవీఎల్.శర్మవధాని, నాగార్జున, శ్రీధర్, రాంబాబు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ సైనికుల సేవలు అనిర్వచనీయం


వేడుకల్లో పాల్గొన్న మాజీ సైనికులు

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి15: త్రివిధ దళ సైనిక విభాగాల్లో కోర్ ఆఫ్ సిగ్నల్స్ ఎంతో ప్రాముఖ్యమైనదని, అందులో పని చేసిన సైనికుల సేవలు అమూల్యమైనవని మాజీ సైనికుల జాతీయ సమన్వయ కమిటీ అధ్యక్షుడు నెప్పల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఒంగోలు నగరం హోటల్ సింధూరలో గురువారం కోర్ ఆఫ్ సిగ్నల్స్ 114వ రైజింగ్ డే కార్యక్రమాలను కల్నల్ శ్రీనివాసాచారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ యుద్ధ సమయంలో సిగ్నల్స్ విభాగం ఎంతో కీలకంగా వ్యవహరిస్తుందన్నారు. అనంతరంలో పని చేసిన మాజీ సైనికులు తమ అనుభవాలను వివరించారు. అనంతరం మాజీ సైనికుల దంపతులను శాలువాలతోను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు ఆలపాటి వెంకటేశ్వర్లు, కార్యదర్శి పాశం వెంకటరెడ్డి, మాజీ సైనికులు చుండూరి శ్రీరామూర్తి, వెంకటేశ్వర్లు, రాజేష్‌ఖన్నా, పి.వెంకటేశ్వర్లు, క్యాంటీన్ మేనేజర్ గుమ్మడి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో పోలీసుల తనిఖీలు


తనిఖీలు చేస్తున్న డీఎస్పీ కిషోర్‌బాబు

ఒంగోలు(క్రైం), ఫిబ్రవరి 15 : రానున్న ఎన్నికల దృష్ట్యా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. గురువారం ఒంగోలు నగరంలో అనేక ప్రాంతాలలో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో కారు, ఆటో డ్రైవర్ల లైసెన్సులు పరిశీలించడంతో పాటుగా వారితో డీఎస్పీ కిషోర్‌బాబు మాట్లాడారు. గంజాయి, మద్యం అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం అద్దంకి బస్టాండ్, జయరామ్ సెంటర్, లాయర్‌పేట రంగారాయుడు చెరువు ప్రాంతాలలో ఆటోలు, అద్దెకు తిరిగే కార్లను ఆపి తనిఖీలు చేశారు. ఎన్నికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అసాంఘీక కార్యాకలపాల సమాచారం పోలీసులకు ఇవ్వాలని కోరారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ఒంగోలు(క్రైం), ఫిబ్రవరి15 : పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన ఒంగోలులోని ఆర్టీసీ డిపో సమీపంలోని శ్మశానవాటిక వద్ద జరిగింది. సంతనూతలపాడు మండలం చిలకపాడుకు చెందిన నల్లూరి రవిచంద్ర (45)గా పోలీసులు గుర్తించారు. అనారోగ్యంతో బాధపడుతున్న రవిచంద్ర పురుగు మందు తాగి మృతి చెందినట్లు మృతిడి కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహం వద్ద పురుగుమందు డబ్బాతోపాటు శీతలపానియం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వన్‌టౌన్ సీఐ లక్ష్మణ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా న్యాయాధికారిని కలిసిన ఎస్పీ

ఒంగోలు(క్రైం), ఫిబ్రవరి 15: నూతనంగా జిల్లా ఎస్పీగా బాధ్యతలు తీసుకున్న పి.పరమేశ్వరరెడ్డి గురువారం ఒంగోలులో జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎ.భారతిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొకే అందజేశారు. బాధితులకు సత్వరన్యాయం కలిగే విధంగా న్యాయశాఖతో సమన్వయంతో పనిచేసేందుకు పోలీసుశాఖ కృషి చేస్తుందని ఎస్పీ పేర్కొన్నారు.

ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలి

● కలెక్టర్ దినేష్‌కుమార్


ఈవీఎం గురించి అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 15: ఓటుహక్కును వినియోగించుకోవడం ప్రతి ఒక్క పౌరుని బాధ్యతని కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని స్పందనహాలులో గురువారం జరిగిన సిస్టమాటిక్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోల్ పార్టిసిపేషన్(ఎస్‌వీఈఈపీ) కార్యక్రమంలో భాగంగా ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ కో ఆర్డినేటర్స్ క్యాంపస్ అంబాసిడర్లకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచంలోనే మన దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ అతి పెద్దదన్నారు. ఓటు హక్కు అనేది వజ్రాయుధమని, ప్రజలు ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండా వినియోగించుకొని ఉత్తమ నాయకత్వాన్ని ఎన్నుకోవాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ హక్కులతో పాటు తమ బాధ్యతలను కూడా తెలుసుకోవాలన్నారు. ఓటు వేసేందుకు పోలింగ్‌స్టేషన్‌కు రాలేని, కదలేని పరిస్థితిలో ఉన్న వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు తమ ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పిస్తూ ఎన్నికల కమిషన్ కొత్తగా నిర్ణయం తీసుకుందన్నారు. రానున్న ఎన్నికల్లో అన్ని ప్రాంతాల్లో ఓటింగ్ శాతాన్ని పెంచి ప్రజల స్వేచ్ఛాయుత వాతావరణంలో, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. అందులో భాగంగానే జిల్లాలోని ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్స్, కో ఆర్డినేటర్లకు, క్యాంపస్ అంబాసిడర్లకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఓటర్లు ప్రశాతంగా, సజావుగా తమ ఓటుహక్కును వినియోగించుకోనేలా స్వీప్ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారులు రవి, జ్యోతి, నాగేశ్వరరావు, డీఈవో సుభద్ర, ట్రిపుల్ ఐటీ ఓఎస్‌డీ డాక్టర్ నారపరెడ్డి పాల్గొన్నారు. కాగా శిక్షణ తరగతులకు హాజరైన వారితో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వారికి ఈ వీఎంపై అవగాహన కల్పించారు.

'రాజధాని ఫైల్స్'ను అడ్డుకున్న పోలీసులు

సినిమా ప్రదర్శించిన 40 నిమిషాలకే నిలిపివేత
ఆగ్రహించిన ప్రేక్షకులు

ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 15 : అధికారం అడ్డుపెట్టుకుని వైసీపీ ప్రభుత్వం ప్రశ్నించే వారిని అణగదొక్కే ప్రయత్నాలు చేపడుతోంది. ఒకవైపు ప్రతిపక్షాలు ప్రభుత్వ తీరును ప్రశ్నిస్తుండగా, పోలీసు కేసులతో బెదిరింపులకు పాల్పడుతుండగా, మరోవైపు ప్రభుత్వ యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకుని అరాచకాలు చేయడంపై ప్రజలు మండిపడుతున్నారు. అందులో భాగంగా ప్రభుత్వ తీరును ఎత్తిచూపుతూ అమరావతి రాజధాని రైతుల కష్టాలు, రాజధాని రైతుల గోడు, ఆవేదనను తెలియజేస్తూ తెరకెక్కించిన రాజధాని ఫైల్ సినిమా ప్రదర్శనను అర్థాంతరంగా ఆపేశారు. రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిస్థితులు, రాజధాని రైతులకు జరిగిన అన్యాయంపై ప్రజలకు కళ్ళకు కట్టినట్లుగా చిత్రీకరించిన ఈ సినిమాను వీక్షించేందుకు ప్రేక్షకులు ఎంతో ఆసక్తి చూపారు. అయితే గురువారం ఈ సినిమా విడుదల కాగా, జిల్లాలో పలు థియేటర్లలో మొదటి షోకే విశేష స్పందన రావడంతో హౌస్‌ఫుల్ అయ్యాయి. అయితే సినిమా ప్రదర్శిస్తున్న సమయంలోనే పోలీసులు, రెవెన్యూ అధికారులు ఆయా థియేటర్ల వద్దకు చేరుకుని సినిమా ప్రదర్శన నిలిపివేశారు. అయితే అధికారులు కోర్టు ఉత్వర్వులు మేరకు ప్రదర్శన నిలిపివేస్తున్నట్లు చెబుతున్నారు.


ఒంగోలులోని గోపీ థియేటర్


టంగుటూరులో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్సై నాగేశ్వరరావు

ప్రేక్షకుల మండిపాటు

ప్రభుత్వ వైఫల్యాలు సినిమాలో వివరంగా చూపడంతో అధికార వైసీపీ ఈ సినిమాపై ఆంక్షలు విధించి షో నిలిపివేశారు. అంతేగాకుండా రాజధాని ఫైల్ సినిమాకు సంబంధించిన పోస్టర్లను ఆగమేఘాలపై తొలగించారు. వాటిపై వేరే సినిమా పోస్టర్‌ను అంటించారు. షో ప్రారంభమైన అరగంటకే సినిమా నిలిపివేయడంపై ప్రేక్షకులు అధికారులను తప్పు పట్టారు. దీంతో దాదాపు గంటకుపై పోలీసులతో ప్రేక్షకులు వాదనకు దిగారు. వందల రూపాయలు పెట్టి టికెట్ కొని సినిమా చూస్తుంటే ఎలా అడ్డుకుంటారని ప్రశ్నించారు. ఈ సందర్భంగా సినిమా ప్రదర్శించిన ఒంగోలులోని గోపీ థియేటర్ వద్ద జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అధికారులు కోర్టు ఉత్వర్వులు చూపించగా, థియేటర్ యజమానులు సైతం సినిమా ప్రదర్శనను నిలిపివేశారు.

టంగుటూరులో..

టంగుటూరు: స్థానిక శ్రీనివాస థియేటర్‌లో ప్రదర్శిస్తున్న రాజధాని ఫైల్స్ సినిమాను గురువారం ఉదయం అర్థంతరంగా పోలీసులు నిలిపివేశారు. అమరావతి రాజధాని రైతుల ఆందోళనలు, వారి కష్టాలు, వేదనలు, రోదనలు, ప్రభుత్వం మూడు రాజధానుల ప్రతిపాదన ఇతివృత్తంగా ఈ సినిమాను నిర్మించారు. ఉదయం 11 గంటలకు సినిమాను ప్రారంభించారు. హాలు ప్రేక్షకులతో కిక్కిరిసింది. 40 నిమిషాలు గడిచాక హాల్ నిర్వాహకులకు పోలీసులు ఫోన్ చేశారు. ప్రభుత్వ ఆదేశానుసారం సినిమా ప్రదర్శన నిలిపివేయాలని ఆదేశించారు. దీంతో ప్రదర్శనను నిలిపివేశారు.హుటాహుటిన హాల్ వద్దకు వచ్చిన ఎస్సై నాగేశ్వరరావు సినిమా ప్రదర్శన నిలిపివేయాలని ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాలను హాల్ యాజమాన్యానికి చూపించారు.

గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించాలి

● ఎంపీపీ స్వప్నకుమారి

కొండపి, ఫిబ్రవరి 15 : అధికారులు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంపీపీ కొండశింగు స్వప్నకుమారి చెప్పారు. స్థానిక మండల పరిషత్ సమావేశం హాలులో గురువారం మధ్యాహ్నం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో జడ్పీటీసీ సభ్యురాలు మారెడ్డి అరుణకుమారి మాట్లాడారు. సర్పంచ్‌లు తమ గ్రామ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎంఈవో పి. రామారావు మాట్లాడుతూ దేవిరెడ్డిపాలెంలోని ఎంపీ స్కూల్ ఆవరణలో తాగునీటికి బోరు ఏర్పాటు చేయాలని కోరారు. వేసవి దృష్ట్యా ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది గ్రామాల్లో పర్యటించి మూలనపడిన బోర్లకు మరమ్మతులు చేయాలని పెదకండ్లగుంట సర్పంచ్ విజ్ఞప్తి చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో రిజిస్టర్ పెట్టామని, బోర్లు చెడిపోతే ప్రజాప్రతినిధులు కాని, ఆయా గ్రామాల వారు కాని అందులో బోరు వివరాలు నమోదు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాయబ్ రసూల్ కోరారు. పీఆర్ ఏఈ బి.ప్రసాదరావు, ఏవో విజయకుమార్, పీహెచ్‌సీ డాక్టర్ ప్రియాంక, ఏపీఎం కె.రాజ్యలక్ష్మి, ఏపీవో మహాలక్ష్మి, హౌసింగ్ ఏఈ భూపతి, ఐసీడీఎస్ సీడీపీవో మాధవీలత తమశాఖల కార్యకలాపాలను వివరించారు. సమావేశాన్ని ఎంపీడీవో నాగమణి సమన్వయం చేశారు. ఆర్‌అండ్‌బీ ఏఈ లక్ష్మీదీప్తి, ఎంఈవో-2 కె.సురేఖ, సర్పంచ్‌లు షేక్ వన్నూరు, ఆరితోటి ఝాన్సీరాణి, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పెరిగిన ధరలతో రోడ్డున పడుతున్న పేదలు

● వైసీపీ పాలనపై జనసేన ధ్వజం

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 15: రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక నిత్యావసర ధరలు పెరిగిపోతుండటంతో సామాన్య ప్రజానీకం రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని జనసేన పార్టీ నాయకులు ఆరోపించారు. జనచైతన్య యాత్రలో భాగంగా గురువారం సాయంత్రం జనసేన పార్టీ నాయకులు ఒంగోలు నగరం జక్రయ్యహాస్పటల్ ప్రాంతంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముందుగా ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకొని జనసేన పార్టీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు నేతలు మాట్లాడుతూ ఒక వైపు నిత్యావసర ధరలు పెరుగుదల, మరో వైపు విద్యుత్, గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో సామాన్యులు రోడ్డున పడ్డారన్నారు. గత ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక అన్ని వర్గాల ప్రజలపై పెనుభారాలు మోపారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించాలని పిలుపునిచ్చారు. డివిజన్ అధ్యక్షుడు పునుపులేటి మురళీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు ముత్యాల కల్యాణ్, రాఘవ, ఆకుపాటి ఉష, షేక్ సుభాని, ఉంగరాల వాసు, నరేష్, కోట సుధీర్, మర్రిపూడి ఉదయ్, గలగల పవన్, అనూష, మర్రిపూడి మాధవి, అవినాష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

యాజమాన్య పద్ధతులు పాటించాలి

జరుగుమల్లి (కొండపి), ఫిబ్రవరి 15 : పొగాకు పంటలో ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని బోర్డు ఒంగోలు ఎస్‌బీఎస్ ప్రాంతీయ అధికారి ఎం. లక్ష్మణరావు చెప్పారు. గురువారం మండలంలోని పాలేటిపాడు గ్రామంలో టంగుటూరు వేలం కేంద్రం అధికారుల ఆధ్వర్యంలో పొగాకు సాగులో ఉత్తమ యాజమాన్య పద్ధతులపై అవగాహన సదస్సు నిర్వహించారు. వేలం నిర్వహణాధికారి ఎ. శ్రీనివాసరావు, ఎస్‌జీవో జి. సిద్ధరాజు, ఐటీసీ శాస్త్రవేత్త పి. వెంకటేశ్వరరావు, ఐటీసీ ప్రతినిధి జి.వెంకటరావు, జీపీఐ ప్రతినిధి శ్రీనివాసరావు, పీఎస్ఎస్ ప్రతినిధి ఎ.రామాంజనేయులు, తూమాడు, సాధువారిపాలెం, కె.ఉప్పలపాడు రైతులు పాల్గొన్నారు.

ఓటు హక్కు కోసం ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి

కొండపి, ఫిబ్రవరి 15 : అర్హత ఉన్న కొత్త ఓటర్లు తాము దరఖాస్తు వచ్చాక వారంలోపు సంబంధిత బీఎల్వోలకు తమ ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని నియోజకవర్గ ఈఆర్వో బీఎల్ఎన్ రాజకుమారి కోరారు. గురువారం మధ్యాహ్నం కొండపిలోని తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులు, తహసీల్దార్లు, ఎన్నికల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత సమావేశంలో రామాయపాలెంలోని బూత్ నంబరు 14ను తమకు అనుకూలమైన చోటకు మార్చాలని గ్రామంలోని ఎస్సీలు కోరారని, దాన్ని మార్చారా? అని సీపీఎం నాయకుడు కేజీ మస్తాన్ ఆర్వోని అడిగారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో ఓట్లు ఉండి, మన రాష్ట్రంలో కూడా ఓటర్లుగా నమోదైన వారి వివరాలు తమకు ఇవ్వాలని టీడీపీ మండల ఎస్సీసెల్ కన్వీనర్ యనమద్ని వెంకటేశ్వర్లు (పెద్దోడు) కోరారు. సమావేశంలో తహసీల్దార్లు ఎంవీకే సుధాకర్, ఎం. భవానీశంకర్, టంగుటూరు సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రావు, కొండపి తహసీల్దార్ కార్యాలయ డీటీ సుజాత, ఎన్నికల సిబ్బంది నాగరాజు, హనుమంతరావు పాల్గొన్నారు.

నేడే గ్రామీణ భారత్‌బంద్


రైతు కూలీ సంఘం వారి ప్రదర్శన

టంగుటూరు, ఫిబ్రవరి 15 : గ్రామీణ భారత్ బంద్, పారిశ్రామిక సమ్మె శుక్రవారం జరుగుతుందని రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు, ఉపకార్యదర్శి వేజండ్ల రామారావు, పరిటాల కోటేశ్వరరావు గురువారం కోరారు. టంగుటూరులో ఆయన మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలి, భూహక్కుల చట్టాని రద్దు చేయాలని తదితర 16 డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

అవీ..ఇవీ..

9మంది డీఎస్సీ-2008 అభ్యర్థులకు ఉద్యోగాలు

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 15 : జిల్లాలో తొమ్మిదిమంది డీఎస్సీ-2008 అభ్యర్థులకు సెకండరీ గ్రేడ్ టీచర్లుగా ఉద్యోగాలు ఇస్తూ పాఠశాల విద్యా కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లో 54 మందికి కొత్తగా ఉద్యోగాలు ఇవ్వగా మన జిల్లాలో తొమ్మిది మందికి అవకాశం లభించింది. డీఎస్సీ-2008 అర్హుల జాబితాలో మొత్తం 4,567 మంది అభ్యర్థులు ఉండగా వీరిలో 2,193 మందిని సెకండరీ గ్రేడ్ టీచర్లుగా కాంట్రాక్టు పద్ధతిలో మినిమం టైం స్కేలుతో నియమించారు. జిల్లాలో నిర్మల, షేక్ నజీమాపర్వీన్, బొమ్మిరెడ్డి లలితరాణి, పి.భారతి, గొర్రెపాటి అచ్చయ్య, కాల్వ భాగ్యలక్ష్మి, గుడిసె విజయభాస్కర్, శిఖా అరుణకుమారి, స్వర్ణ రమాదేవిలను సెకండరీ గ్రేడ్ టీచర్లుగా కాంట్రాక్టు విధానంలో మినిమం టైం స్కేలుతో నియమించనున్నారు. వీరి నియామకాలు వారం రోజుల్లో పూర్తి చేసి తమ కార్యాలయానికి నివేదించాలని కమిషనర్ డీఈవోను ఆదేశించారు.

బకాయిలు విడుదల చేయాలి

మద్దిపాడు, ఫిబ్రవరి 15: ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని జేఏసీ చీమకుర్తి తాలుకా నాయకుడు కె.బాలకోటయ్య డిమాండ్ చేశారు. గురువారం మద్దిపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద జేఏసీ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల బకాయిలను విడుదలలో ప్రభుత్వం జాప్యం చేస్తుందన్నారు. కార్యక్రమంలో జయరాజ్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బాలినేని

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 15 : కొత్తపట్నం మండలం ఈతముక్కల గ్రామానికి చెందిన బాధిత కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి స్థానిక లాయర్‌పేటలోని తన నివాసంలో గురువారం అందజేశారు. గత ఏడాది ఈతముక్కల ఎస్సీ కాలనీకి చెందిన బందెల మేరిరత్నం, బందెల ప్రవీణ్‌కుమార్, మేళం దిలీప్‌కుమార్‌లు ఎం. నిడమానూరు నుంచి గ్రామానికి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. ఆ సమయంలో మృతుల కుటుంబాలను బాలినేని పరామర్శించి బాధిత కుటుంబాన్ని అదుకుంటానని హామీ ఇచ్చారు. ఈక్రమంలో చనిపోయిన ఒక్కొక్కరికి రూ.3లక్షల చొప్పున సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయగా ఆ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కొత్తపట్నం మండల సచివాలయ కన్వీనర్ ఆళ్ల రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మద్దిపాడు, ఫిబ్రవరి 15: ఆటో, మోటారుసైకిల్ ఢీకొని యువకుడికి గాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం గుండ్లాపల్లి గ్రోత్‌సెంటర్ సమీపంలో జరిగింది. స్థానికుల సమాచారం మేరకు, మేదరమెట్ల వైపు నుంచి ఒంగోలు వెళుతున్న ఆటో గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్ వద్దకు రాగానే కారును అధిగమించబోయి మోటారుసైకిల్‌ను ఢీకొంది. ఈప్రమాదంలో గ్రోత్‌సెంటర్‌లో పనిచేసే కార్మికుడు ప్రభుదాస్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

అరాచక ప్రభుత్వాన్ని సాగనంపాలి : టీడీపీ

మద్దిపాడు, ఫిబ్రవరి 15: సీఎం జగన్మోహన్‌రెడ్డి అరాచకాలను ఓటు అనే ఆయుధంతో తిప్పికొట్టాలని టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు కోరారు. గురువారం నాగన్నపాలెం గ్రామంలో మన ఊరు-మన తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జయంత్‌బాబు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ఆరు గ్యారెంటీలతో భరోసా కల్పిస్తున్నట్లు చెప్పారు. వైసీపీ నాయకులు ఇసుక, గ్రావెల్ తవ్వకాలు చేపట్టి జేబులు నింపుకుంటున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కాకర్ల విజయకుమార్, చెరుకూరి వాసుబాబు, దేవబత్తిన ప్రసాద్, మండవ గోపిచంద్, ముల్లూరి మురళి, పి.అజయ్‌బాబు, రెబ్బవరపు ప్రభాకర్ పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం


వెంకటేశ్వరరావు

మద్దిపాడు, ఫిబ్రవరి 15: మద్దిపాడుకు చెందిన ఆడపాల వెంకటేశ్వరరావుకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. రసాయనశాస్త్రానికి సంబంధించి థర్మోడైనమిక్ ప్రాపర్టీస్ ఆఫ్ బైనరీ లిక్విడ్ మిక్చర్స్ అనే అంశంపై ప్రొఫెసర్ రామచంద్రన్ ఆధ్వర్యంలో వెంకటేశ్వరరావు చేసిన పరిశోధన డాక్యుమెంట్‌ను యూనివర్సిటీకి అందజేశారు. యూనివర్సిటీ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ పి.ర వీంద్రారెడ్డి చేతుల మీదుగా వెంకటేశ్వరరావు డాక్టరేట్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా గురువారం మాజీ ఉప సర్పంచ్ గంగిశెట్టి నరసింహారావు తదితరులు అభినందించారు.

రైతులపై లాఠీచార్జి దారుణం

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 15: రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని, ఎంఎస్‌పీ చట్టం చేయాలని, గతంలో మోదీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ రైతాంగం చేపట్టిన నిరసన ప్రదర్శనపై పోలీసులు లాఠీచార్జి చేయడమే కాకుండా సోనిక్ ఆయుధాలను ప్రయోగించడాన్ని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో ఖండించారు. రోడ్లపై భారీ గోతులను తవ్వించి ట్రాక్టర్లు రాకుండా ఎన్ని నిర్బంధాలు ప్రయోగించినా రైతులు ఢిల్లీ సరిహద్దులకు చేరుకున్నారని తెలిపారు. అటువంటి రైతులపై పోలీసులు లాఠీచారిజ చేయడం దుర్మార్గంగా ఉందన్నారు. ప్రధాని మోదీ ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కేంద్ర ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించాల్సి వస్తోందని ఆయన హెచ్చరించారు.

రేపటితో పరీక్ష ఫీజు చెల్లింపు ఆఖరు

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 15: హెచ్ఎం అకౌంట్ టెస్ట్‌కు హాజరయ్యే వారు ఈ నెల 17లోపు పరీక్ష ఫీజు చెల్లించాలని ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ కె.శివకుమార్ గురువారం తెలిపారు. ఈ పరీక్ష రెండు పేపర్లకు అయితే రూ.150, ఒక పేపర్‌కు రూ.100 పరీక్ష ఫీజు చెల్లించాలి. రూ.60 రుసుంతో ఈనెల 22 వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో సమర్పించాలి. పూరించిన దరఖాస్తు కాపీని డీఈవో కార్యాలయంలో సమర్పించాలని ఆయన కోరారు.

అక్రమ కేసులు పెట్టడం దారుణం

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 15: భారత చైతన్య యువజన పార్టీ జాతీయ అధ్యక్షుడు రామచంద్రయాదవ్‌పై పుంగనూరు పోలీసులు మంత్రి రామచంద్రారెడ్డి ఆదేశాలతో అక్రమకేసులు పెట్టడం దారుణంగా ఉందని ఆ పార్టీ రాష్ట్ర సమన్వయ సారథి మిరియం శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో ఖండించారు. పుంగనూరులో ప్రతిపక్షం అనేది లేకుండా చేయాలనే ఉద్దేశంతోనే మంత్రి పోలీసులతో అక్రమంగా కేసులు నమోదు చేయించారన్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి వెంటనే అక్రమ కేసులు నమోదు చేసిన పోలీస్ అధికారులపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

రైజ్‌లో అవగాహన సదస్సు


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అతిథులు

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 15: ఒంగోలులోని రైజ్ కృష్ణసాయి గ్రూప్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం రహదారి భద్రత, ట్రామా అనే అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా రోడ్డు ట్రాన్స్‌పోర్టు అథారిటీ, రైజ్ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఎంవీఐ ఎస్.జగదీష్ మాట్లాడుతూ విద్యార్థులు రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. బైక్ నడిపే సమయంలో తప్పక హెల్మెట్ ధరించాలని చెప్పారు. ట్రిపుల్ రైడింగ్ చేయకూడదన్నారు. రిమ్స్ హాస్పటల్ డాక్టర్ నామినేని కిరణ్‌కుమార్ మాట్లాడుతూ 62శాతం రోడ్డుప్రమాదాల్లో 45 సంవత్సరాల లోపు వారివే జరుగుతున్నాయన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, మాదక ద్రవ్యాలు సేవించి వాహనాలు నడపటం, హెల్మెట్ లేకపోవడం, సీట్ బెల్ట్ పెట్టుకోకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ శిద్దా హనుమంతరావు, డైరెక్టర్ ఏవీ.భాస్కరరావు, ప్రిన్సిపాల్ కేవీ.సుబ్రహ్మణ్యం, ఎస్.సంపత్‌కుమార్, ఎ.మోహన్‌రావు పాల్గొన్నారు.

నేడు కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం

ఒంగోలు (కార్పొరేషన్), ఫిబ్రవరి 15 : ఒంగోలు నగరపాలక సంస్థ పాలకవర్గ సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు కార్పొరేషన్ సమావేశం హాలులో జరగనుంది. కాగా సమావేశంలో 2024-2025 వార్షిక బడ్జెట్ అజెండా అంశంగా పేర్కొన్నారు. ఈ ఏడాదికి మార్చికి బడ్జెట్ పొందుపరచాల్సి ఉండగా, అందుకు అనుగుణంగా కౌన్సిల్ ఆమోదం తెలియజేయనుంది.

నేడు ఒంగోలులో
3వేల మందితో మహాసూర్యవందనం
● ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్


ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 16 : ఒంగోలులోని పోలీస్‌పెరేడ్‌గ్రౌండ్‌లో శుక్రవారం 3 వేల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో మహాసూర్యవందనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్, భారత్ వరల్డ్ రికార్డ్ నమోదులో భాగంగా యోగా పట్ల అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. గురువారం స్థానిక పోలీస్‌పెరేడ్ గ్రౌండ్‌లో ఎస్పీ పరమేశ్వరరెడ్డి, ప్రణవ్ సంకల్ప యోగా సమితి వ్యవస్థాపకులు పతంజలి శ్రీనివాస్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి వస్తున్న విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీరు, భోజన వసతుల ఏర్పాటు చేపట్టాలన్నారు. వైద్య సిబ్బందితో మెడికల్ క్యాంపును ఏర్పాటు చేయడంతో పాటు అంబులెన్స్‌ను కూడా అందుబాటులో ఉంచాలని సూచించారు. జాతీయ స్థాయి యోగా ప్రముఖులను ఆహ్వానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఈవో సుభద్ర, డీటీసీ సుశీల, స్టెప్ మేనేజర్ శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వరమ్మకు మంత్రి సురేష్ నివాళి


వరమ్మకు నివాళులర్పిస్తున్న మంత్రి సురేష్

టంగుటూరు, ఫిబ్రవరి 15 : ఇన్‌కంట్యాక్స్ అసిస్టెంట్ కమీషనర్ కురుగుంట్ల సిల్వన్‌రాజు తల్లి వరమ్మ(75) తీవ్ర అనారోగ్యంతో బుధవారం రాత్రి టంగుటూరులోని స్వగృహంలో మృతి చెందింది. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖమాత్యులు డాక్టర్ ఆదిమూలపు సురేష్ గురువారం వరమ్మ పార్థివదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళ్లులర్పించారు. అలాగే నివాళ్లులర్పించిన వారిలో వైసీపీ కొండపి మాజీ సమన్వయకర్త డాక్టర్ వెంకయ్య, ఇన్‌కాంట్యాక్స్ అసిస్టెంట్ కమీషనర్ బొడ్డు వెంకటేశ్వరరావు, జిల్లా గొర్రెల పెంపకం దారుల యూనియన్ చైర్మన్ బొట్లా రామారావు, కమ్మ కార్పోరేషన్ డైరెక్టర్ బొడ్డపాటి అరుణ, ఎంపీటీసీ ప్రభుదాస్ ఉన్నారు.

ప్రజల మంచి కోసమే ప్రతిష్ఠా కార్యక్రమాలు


మాట్లాడుతున్న మంత్రి నాగార్జున

సంతనూతలపాడు, ఫిబ్రవరి 15: గ్రామాల్లో ప్రజల మంచి కోసమే బొడ్డురాయి, ధ్వజస్తంభ ప్రతిష్ఠా కార్యక్రమాలు జరుగుతుంటాయని, ఇందులో తాను కూడా భాగమైనందుకు సంతోషంగా ఉందని మంత్రి, నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ మేరుగ నాగార్జున పేర్కొన్నారు. సంతనూతలపాడులో బుధవారం జరిగిన బొడ్డురాయి, ధ్వజస్తంభ ప్రతిష్ఠా కార్యక్రమాల్లో భాగంగా ఆదేరోజు రాత్రి సమయంలో విద్యుత్ ప్రభపై ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలుకు మంత్రి నాగార్జున ముఖ్యఅతిథిగా హాజరై ప్రజలతో మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.విజయ, జడ్పీటీసీ డి.రమణమ్మ, సర్పంచ్ డి.నాగమణి, వైస్ఎంపీపీ టి.రాగమ్మ, చెంచిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటోలో మహిళ నుంచి బంగారం చోరీ

కురిచేడు, ఫిబ్రవరి 15 : కురిచేడు మండలం ఆవులమంద పంచాయతీ ముష్టగంగవరం గ్రామానికి చెందిన ఉన్నగిరి సౌందర్య ఆటోలో ప్రయాణిస్తుండగా ఆమె వద్ద నుంచి గుర్తు తెలియని మహిళలు బంగారు ఆభరణాలను దొంగతనం చేశారు. సౌందర్య గురువారం మధ్యాహ్నం దర్శి మండలం రాజంపల్లి గ్రామం నుంచి కురిచేడు వరకు బస్‌లో వచ్చి కురిచేడు నుంచి స్వగ్రామం ముష్టగంగవరం గ్రామానికి ఆటోలో వెళ్లింది. బస్ దిగిన సౌందర్య, ఆమె తండ్రి ఆటో ఎక్కారు. అప్పటికే ఆటోలో ముగ్గురు మహిళలు ఉన్నారు. వారితో పాటు సౌందర్య కూర్చొన్నారు. ఆటో వారి గ్రామానికి వెళ్లకుండా వేరే దారిలో వెళ్తుంటే సౌందర్య తండ్రి అలా వెళ్తున్నావేంటి అని అడిగి దారి చెప్తే ఆ విధంగా ఆటో వెళ్లింది. ఇంటి వద్ద దిగాక ఆటో వెళ్లిపోయింది. సాయంత్రం బ్యాగు చూసుకుంటే దానిలోని బంగారం కనపడలేదు. లబోదిబో అంటూ కురిచేడకు వచ్చి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా సౌందర్య వద్ద ఆటోలో దొంగతనం చేసింది పాత నేరస్తుల పనేనని స్థానికుల అభిప్రాయ పడుతున్నారు. సౌందర్యను దొంగలు ఆమె బయలు దేరిన స్థలం నుంచే వెంబడిస్తున్నట్లు సమాచారం. ఆటోలో వారిని మాటల్లో పెట్టి బ్యాగులోని ఆభరణాలను దొంగిలించారు. కురిచేడులోని ప్రధాన వీధుల్లోని షాపుల వద్ద ఉన్న సీసీ కెమెరాలలో ఆటోను గుర్తించారు. మహిళలను కూడా గుర్తించినట్లు సమాచారం. వారు పాత నేరస్తులే అని తెలుస్తున్నది.

ఆగమేఘాలపై ఇళ్లపట్టాలు ఆన్‌లైన్!
నేటి నుంచి లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ప్రారంభం ● కోర్టులో పిటిషన్‌పై వైసీపీ నేతల హడావుడి


ఇళ్ల పట్టాల ఆన్‌లైన్‌ను ప్రారంభిస్తున్న మేయర్ సుజాత

ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 15: జగనన్న ఇళ్ళ పట్టాల పంపిణీపై కోర్టులో పిటిషన్ వేయడంపై అధికారులు హడావుడి చర్యలు చేపట్టారు. పేదల ఇళ్ళ పట్టాల పంపిణీకి గుర్తించిన లబ్ధిదారుల్లో అర్హులైన వారికి అన్యాయం జరిగిందంటూ వైసీపీ నేతల శింగరాజు రాంబాబు హైకోర్టులో పిటిషన్ వేసిన విషయం విదితమే. అయితే ఆ పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరగనుండగా, ఎలాంటి కోర్టు అడ్డంకులు రాకుండా ఉండేందుకు అధికార పార్టీ నేతలు మరో అడుగు ముందుకు వేశారు. ఈ మేరకు ఇప్పటివరకు గుర్తించిన 20,840లబ్ధిదారుల జాబితాను ప్రత్యేకంగా రూపొందించిన డీఐసీ సాఫ్ట్‌వేర్ ద్వారా ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. ఈ కార్యక్రమాన్ని గురువారం ఒంగోలు కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ గంగాడ సుజాత ప్రారంభించారు. అంతేగాకుండా ఇప్పటివరకు స్థలాలు పంపిణీ చేసే, ఎన్.అగ్రహారం, మల్లేశ్వరపురం, వెంగముక్కలపాలెంలో కొనుగోలు చేసిన స్థలాలను బాగు చేసి, హద్దురాళ్ళు వేసే పనులు వేగవంతంగా జరుగుతుండగా, పట్టాలు పంపిణీకి ముందే లబ్ధిదారులకు వారికి కేటాయించిన స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసే పనులు మొదలు పెట్టారు. అయితే ఆన్‌లైన్‌లో లబ్ధిదారులు జాబితా పొందుపరిచినప్పటికీ పూర్తి స్థాయిలో జాబితా అప్‌లోడ్ చేయలేదని సమాచారం. అంతేగాకుండా ఇందుకు సంబంధించిన అనుమతుల కోసం సీసీఎల్ఐకి పంపించినట్లు తెలిసింది. ఇదిలా ఉంచితే ఇప్పటి వరకు ఎంపిక చేసిన లబ్ధిదారులకు మొదటి దశగా కొంతమందికి వారి పేరున ఇళ్ల పట్టాలు రిజిస్ట్రేషన్ చేసేందుకు అధికారులు చర్యలు వేగవంతం చేశారు. ఒకవైపు ఇళ్ళ పట్టాలపై పేదలకు అన్యాయం జరిగిందని వైసీపీ నేత శింగరాజు రాంబాబు హైకోర్టులో పిటీషన్ వేయగా, దానిపై విచారణ శుక్రవారం లేదా సోమవారం జరగవచ్చని సమాచారం. అయితే పట్టాల తమకు వస్తాయా.. రావా అనే సందిగ్ధంలో లబ్ధిదారులు ఉండగా, అధికార పార్టీ వైసీపీ నేతలు శుక్రవారం నుంచి కొంతమందికి రిజిస్ట్రేషన్ చేసే పనిలో నిమగ్నమయ్యారు.

అయోమయంలో లబ్ధిదారులు..

అయితే జగనన్న ఇళ్ల పట్టాల పంపిణీ వ్యవహారంపై ప్రజల్లో అయోమయం నెలకొంది. పట్టాలను లబ్ధిదారులకు త్వరితగతిన ఇచ్చేందుకు వైసీపీ నేతలు టెండర్లు తెరవకుండానే పనులు జరుగుతుండగా, మరోవైపు అదేపార్టీకి చెందిన నాయకుడు దీనిపై కోర్టును ఆశ్రయించడంపై ప్రజల్లో అయోమయం నెలకొంది. ఎలాగైనా ఇచ్చిన మాట ప్రకారం పేదలకు ఇళ్ళ పట్టాలు ఇస్తామని ఆ పార్టీ నేతలు చెబుతుంగా, మరోవైపు కోర్టులో పిటీషన్ వేయడం, దానిపై ఇంతవరకు విచారణ జరిగకపోవడం, కోర్టు ఏ విధమైన తీర్పు ఇస్తుందన్న అయోమయం ప్రజల్లో నెలకొంది. గత రెండు రోజులుగా ఇళ్ళ పట్టాల పంపిణీపై ప్రజల్లో చర్చనీయాంశమైంది.

రా..కదలిరా సభను విజయవంతం చేయండి
● నియోజకవర్గ ఇన్‌చార్జి బీఎన్ పిలుపు


సంతనూతలపాడులో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

సంతనూతలపాడు, ఫిబ్రవరి 15: బాపట్ల జిల్లా ఇంకొల్లులో ఈనెల 17వ తేదీన జరగబోయే చంద్రబాబునాయుడు పాల్గొనబోతున్న రా..కదలిరా సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బీఎన్.విజయ్‌కుమార్ తెలిపారు. గురువారం సంతనూతలపాడులోని టీడీపీ కార్యాలయంలో జరిగిన మండల సమావేశంలో బీఎన్ మాట్లాడుతూ రా..కదలిరా సభకు పెద్ద సంఖ్యలో శ్రేణులు హాజరైయ్యేలా మండల నాయకులు, కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు చౌట శ్రీనివాసులు, రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు, మండల పరిశీలకులు మంత్రి శ్రీనివాసులు, మండల అధ్యక్షులు మద్దినేని హరిబాబు, నాయకులు తన్నీరు శ్రీను, నరసింహారావు, కొండసింగ్‌రాజు, మాదవి, గోపీ తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో..

చీమకుర్తి: ఇంకొల్లులో జరిగే చంద్రబాబునాయుడు పాల్గొనే రా..కదలిరా సభను విజయవంతం చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ కోరారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు గొల్లపూడి సుబ్బారావు అధ్యక్షతన చీమకుర్తిలో జరిగిన సమావేశంలో విజయ్‌కుమార్ ప్రసంగించారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతి కార్యకర్త స్వచ్ఛందంగా సభకు తరలిరావాలని ఆయన కోరారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ గెలుపునకు అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పరిశీలకులు వైవీ.సుబ్బారావు, రాష్ట్ర కార్యదర్శి అడకా స్వాములు, నాయకులు గొట్టిపాటి రాఘవరావు, వేల్పుల శ్రీనివాసరావు, అవనిగడ్డ శేషయ్య, రావిపాటి రాంబాబు, యడ్లపల్లి రామబ్రహ్మం, అత్యాల ఏసోబు, కాట్రగడ్డ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలతో ప్రజల చెంతకు సంక్షేమ సేవలు
● మంత్రి నాగార్జున


గోడౌన్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి నాగార్జున, ఎమ్మెల్యే బాలినేని, చైర్‌పర్సన్ వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి

చీమకుర్తి, ఫిబ్రవరి 15 : సచివాలయాలతో ప్రజలకు అందాల్సిన సేవలు మరింత చేరువయ్యాయని మంత్రి మేరుగ నాగార్జున, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి తెలిపారు. చీమకుర్తి మండలపరిధిలోని కూనంనేనివారిపాలెం, గోనుగుంట, రామచంద్రాపురం, గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాలు, ఆర్‌బీకే,హెల్త్‌క్లినిక్‌లను వారు ముఖ్యఅతిథులుగా విచ్చేసి ప్రారంభించారు. కేవీపాలెంలో పొగాకు ఉత్పత్తిదారుల సమాఖ్య ఎరువుల గోడౌన్ కు శంకుస్థాపన నిర్వహించారు. మండలపరిషత్ నిధులతో రామచంద్రాపురం వద్ద నిర్మించిన బ్రిడ్జి, రహదారిని నాయకుల చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభల్లో మంత్రి నాగార్జున మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి తాను కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే బాలినేని మాట్లాడుతూ సంతనూతలపాడు నియోజకవర్గంలో మంత్రి నాగార్జున గెలుపు బాధ్యతలను బూచేపల్లి వెంకాయమ్మ చేపట్టాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, వైసీపీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, జడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, వసంతరావు, మోహన్, నారాయణరావు, యలమందయ్య, ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా ఖోఖో పోటీ విజేత 'ఎంఎన్ఎం'


విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

కనిగిరి, ఫిబ్రవరి 15: విద్యారంగంలోనే కాకుండా క్రీడారంగంలోనూ ఎంఎన్ఎం విద్యార్థులు తనదైన సత్తాచాటుతూ ఆడుదాంఆంధ్రా ఖోఖో పోటీల్లో రాష్ట్ర స్థాయి విన్నర్ టీంగా గెలుపొందారు. కనిగిరిలోని ఎంఎన్ఎం కళాశాల ఆవరణంలో గురువారం ఆయా టీం విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ ఏలూరి సుబ్బారావు ఘనంగా సత్కరించి అభినందించారు. ప్రభుత్వం నిర్వహించిన ఆడుదాంఆంధ్రా క్రీడాపోటీల్లో భాగంగా ఎంఎన్ఎం విద్యార్థులు ఖోఖో పోటీల్లో పాల్గొన్నారు. మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి ఆ తర్వాత రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో ప్రకాశం జిల్లా నుంచి పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన ఖోఖో పోటీల్లో విశాఖ జిల్లాతో తలపడిన జిల్లా టీమ్‌లో అందరూ ఎంఎన్ఎం విద్యార్థులు కావడం విశేషం. విశాఖ జిల్లా టీ మ్‌తో జరిగిన ఖోఖో పోటీల్లో గెలుపొంది విన్నర్ షీల్డ్‌ను సొంతం చేసుకోవడంతో పాటు రూ.5లక్షల నగదు బహుమతిని కైవసం చేసుకుని కనిగిరి ప్రాంతానికే వన్నె తెచ్చారు. కళాశాల ఆవరణలో అధ్యాపక బృందం క్రీడాకారులను అభినందించింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీ రాజవర్దన్, కోచ్‌లు విశ్వనాథరెడ్డి, శివారెడ్డి, విజేత కళాశాల కరస్పాండెంట్ పసుపులేటి అరుణోదర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో విజేతలు

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొన్న ప్రకాశం జిల్లా జట్టు ఎంఎన్ఎం విద్యార్థుల్లో మద్దులూరి దివ్య కెప్టెన్‌గా, వైస్ కెప్టెన్‌గా బొమ్మల శిరీష, అశ్విని, శివనాగలక్ష్మి, భవాని, హైమావతి, ఉష, సఖియా, మధులత, నాగమల్లేశ్వరి, వెంకటలక్ష్మి, అనూరాధ, అహల్య, శశికళ, సోనా ఉన్నారు.

కుట్రతో సభను అడ్డుకోవాలని ప్రయత్నిస్తున్నారు !
● టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరు, ఫిబ్రవరి 15: ఇంకొల్లులో ఈ నెల 17 న రా కదలిరా చంద్రబాబు సభను కుట్రపూరితంగా అడ్డుకోవాలని సైకో ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నదని టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆరోపించారు. ఇంకొల్లులో చంద్రబాబు పాల్గొనే బహిరంగ సభా ప్రాంగణంలో పార్టీ కార్యకర్తలు చేస్తున్న సభా పనులను బుధవారం రాత్రి పోలీసులు అడ్డగించారు. ఈ నేపథ్యంలో గురువారం మండలంలోని ఇసుక దర్శి ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇంకొల్లులో వెంకట నారాయణ అనే రైతు కౌలుకు తీసుకున్న దేవాలయ భూమి 376-1 సర్వేనంబరు లోని 18 ఎకరాలలో చంద్రబాబు సభను నిర్వహించడానికి ఆయన దగ్గర అనుమతి తీసుకున్నామన్నారు. ఈ విషయమై ఈ నెల 13 వతేదీన కలెక్టర్, ఎస్పీ, డీఎస్పీలకు అనుమతి కోసం దరఖాస్తు చేశామన్నారు. శాంతియుతంగా సభను నిర్వహించడానికి వారి అనుమతి కోరామన్నారు. కాని వారు ఈ విషయాన్ని తేల్చకపోగా, సభా ప్రాంగణం వద్ద జరుగుతున్న పనులను అడ్డగించడానికి ప్రయత్నించడం దారుణ మన్నారు. దేవదాయశాఖకు చెందిన అధికారితో బుధవారం ఇంకొల్లు స్టేషన్‌లో ఫిర్యాదు చేయించి, ఈ నెపంతో సభను నిర్వహించకుండా పోలీసులు ఆపే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పోలీసులను, వ్యవస్థలను నీరుగారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేసే రాజకీయ క్రీడలో పోలీసులు పావులుగా మారవద్దన్నారు. చంద్రబాబు సభ ముగిసిన తర్వాత యథావిధిగా పొలాన్ని బాగు చేసి ఇస్తామని రైతు అనుమతితో ఈ స్థలంలో సభ నిర్వహణ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. చట్టాన్ని ఉల్లంఘించకుండా, ప్రజాస్వామ్య పద్ధతులతో పార్లమెంట్ పరిధిలోని ప్రజానీకం, పార్టీ కార్యకర్తలు, నాయకులతో 17 వతేదీన చంద్రబాబు సభను నిర్వహిస్తామని ఏలూరి స్పష్టం చేశారు.

డీఎస్సీ నోటిఫికేషన్‌లో ఉర్దూ పోస్టులు నిల్

కంభం, ఫిబ్రవరి 15 : రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన డీఎస్సీ-2024 నోటిఫికేషన్‌లో జిల్లాలో ఉర్దూ మాధ్యమం పోస్టులు చూపించకపోవడం అన్యాయమని ఆల్ ఇండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ మహమ్మద్‌రఫి, జిల్లా కార్యదర్శి పఠాన్ మహమ్మద్ ఆసిఫ్‌ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఉర్దూ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ పోస్టులు 23, స్కూల్ అసిస్టెంట్ ఉర్దూ 4, పీఎస్ 1, సోషల్ 2, గణితం 2 ఖాళీగా ఉన్నప్పటికీ డీఎస్సీలో అవి ఏవీ చూపించకపోవడం దారుణమన్నారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ
యువకుడు మృతి ● మరో ఇద్దరికి గాయాలు


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ దుర్గారావు

చీమకుర్తి, ఫిబ్రవరి 15 : ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో యువకుడు మృతి చెందగా మరో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం రాత్రి పొద్దుపోయిన తర్వాత జరిగింది. వివరాల్లోకి వస్తే.. మండలంలోని పాటిమీదపాలెంకు చెందిన దారా అభిషేక్‌రాజు, ప్రవీణ్‌కుమార్‌లు చీమకుర్తి నుంచి తమ ఊరుకి బైక్‌పై వెళ్తుండగా భీంపల్లి వాగు సమీపంలో ఎదురుగా వివరాలు తెలియరాని యువకుడు నడుపుతున్న మరో బైక్ ఢీకొంది. దీంతో గాయపడిన అభిషేక్‌రాజు,ప్రవీణ్‌కుమార్‌లను చీమకుర్తి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందతూఊ అభిషేక్‌రాజు(18) మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని సీఐ దుర్గారావు సందర్శించారు. కేసు నమోదు చేశారు.

డాక్టరేట్ ప్రదానం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ దుర్గారావు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 15 : సోషల్‌వర్క్ విభాగంలో పరిశోధక విద్యార్థి కర్రా హానోక్ బెంజిమన్‌కు ఆచార్య నాగార్జున యూనివర్శిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఆంధ్ర కేసరి విశ్వ విద్యాలయంలో సోషల్ వర్క్‌విభాగంలో సహాయ ఆచార్యులుగా పనిచేస్తున్న డాక్టర్ మండే హర్షప్రీతమ్ దేవ్‌కుమార్ పర్యవేక్షణలో ది ప్రాబ్లమ్స్ ఆఫ్ దళిత్ క్రిస్టియన్స్ ఇన్ గుంటూరు డిస్ట్రిక్ అనే అంశంపై పరిశోధన చేసినందుకు గాను బెంజిమెన్‌కు డాక్టరేట్‌ను అందజేశారు. స్థానిక ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో గురువారం బెంజిమెన్‌ను వీసీ అంజిరెడ్డి, పి.వెంకటరావు, ఆర్.శ్రీనివాసులు అభినందించారు.

రేపటి నుంచి పలు రైళ్లు రద్దు

దొనకొండ, ఫిబ్రవరి 15 : గుంటూరు-గుంతకల్లు రైలుమార్గంలో దొనకొండ మీదుగా ప్రయాణించే పలు రైళ్లను రైల్వే డబ్లింగ్ లైను పనుల కారణంగా ఈనెల 17వ తేదీ నుంచి తాత్కాలికంగా రద్దు చేసినట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. 17329 హుబ్లీ-విజయవాడ రైలు ఈనెల 17 నుంచి 28వ తేదీ వరకు, 17330 విజయవాడ-హుబ్లీ రైలు ఈనెల 18 నుంచి 29 వరకు, 17253 గుంటూరు- సికింద్రాబాద్ రైలు ఈనెల 18 నుంచి 29 వరకు, 17254 సికింద్రాబాద్-గుంటూరు రైలు ఈనెల 18 నుంచి 29 వరకు, 17261 గుంటూరు-తిరుపతి రైలు ఈనెల 17 నుంచి 28 వరకు, 17262 తిరుపతి-గుంటూరు రైలు ఈనెల 18 నుంచి 29 వరకు, 17251 గుంటూరు-కాచిగూడ రైలు ఈనెల 17 నుంచి 28 వరకు, 17252 కాచిగూడ- గుంటూరు రైలు ఈనెల 18 నుంచి 29 వరకు 17228 గుంటూరు-డోన్‌రైలు మార్చి 31 వరకు, 17227 డోన్-గుంటూరు రైలు ఏప్రిల్ 1వ తేదీ వరకు తాత్కాలికంగా రద్దు చేసినట్లు రైల్వే అధికారులు వారి ప్రకటనలో తెలిపారు. రైలు ప్రయాణికులు ఈ అసౌకర్యాన్ని గుర్తించి సహకరించాలని కోరారు.

బ్రెయిన్ స్ట్రోక్‌తో సచివాలయ ఉద్యోగి మృతి

ముండ్లమూరు, ఫిబ్రవరి 15 : మండలంలోని పోలవరం గ్రామ సచివాలయంలో ఎనర్జీ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ముండ్లమూరు గ్రామానికి చెందిన కొండ్రు వీరాంజనేయులు (33) బ్రెయిన్ స్ట్రోక్‌తో గురువారం మృతి చెందారు. వీరాంజనేయులు ఇంటి నుంచి సచివాలయానికి వెళ్లేందుకు సిద్ధమవ్వగా ఒక్కసారిగా బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యారు. వెంటనే కుటుంబ సభ్యులు గ్రామంలోని ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లగా వైద్య పరీక్షలు చేసి హైబీపీగా నిర్ధారించి ఒంగోలులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. కొద్ది సేపటికే చికిత్స పొందుతూ మృతి చెందారు. వీరాంజనేయులు భార్య విజయలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరాంజనేయులు తండ్రి చినతిరుపాలు దివ్యాంగుడు కావడం, కుమారుడు మరణించారనే విషయం తెలిసిన వెంటనే కుప్ప కూలి పోయారు. భార్య విజయలక్ష్మి, పిల్లలు ఏడుస్తున్న తీరు చూపరులను సైతం కంట తడి పెట్టించింది. బ్రెయిన్ స్ట్రోక్‌తో అకస్మాత్తుగా మృతి చెందిన వీరాంజనేయులు మృతదేహానికి దర్శి డివిజన్ ఏడీఈ పిచ్చయ్య, లైన్ ఇన్‌స్పెక్టర్ సాంబయ్య, లైన్‌మెన్‌లు పీఎస్ఆర్ ఆంజనేయులు, మస్తాన్, నాయక్, కోటేశ్వరరావుతో పాటు మండలంలో ఎనర్జీ అసిస్టెంట్‌లు నివాళులర్పించారు.

సర్వే నంబర్ల తేడాతో నిలిచిన రిజిస్ట్రేషన్లు

పొదిలి, ఫిబ్రవరి 15: పొదిలి మండలంలో ఏర్పాటు చేసిన జగనన్న లే-అవుట్ లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్లు చేసే ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది. అయితే సర్వే నెంబరు తేడా ఉండడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. ఎంతో ప్రతిష్టాత్మకంగా పేదల సొంతింటి కళ నేరవేరుస్తున్నామని చెప్పుకుంటున్న ప్రభుత్వ పెద్దలు ఇంతపెద్ద లే-అవుట్‌లో తప్పులను ఇంతవరకు గమనించకపోవడం ఏమిటని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. నెలరోజులుగా రిజిస్ట్రేషన్లు చేయించుకోనేందుకు లబ్ధిదారులను సచివాలయాల చుట్టూ తిరుగుతున్నా సర్వర్లు మొరాయిస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. దీంతో సర్వేనంబరులో తేడా ఉన్నాయని చెప్పలేదని వారు వాపోతున్నారు. లే-అవుట్ సర్వేనెంబర్ 1177 సరైనదని అయితే 1195-2, 1195-3 చూపిస్తుండటంతో ప్రక్రియలో అంతరాయం కలిగిందని అధికారులు చెబుతున్నారు. ఈ సమస్యపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని రెవెన్యూ అధికారులు తెలిపారు. ఆ సమస్యను పరిష్కరిస్తేగాని జగనన్న లేఅవుట్‌లోని ఇళ్ల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేయడానికి వీలుకాదని తెలియడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో మొత్తం 2350 ఇళ్లకు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టారు. అయితే కేవలం పట్టణంలో 17, గ్రామీణ ప్రాంతాల్లో 363 మందికి మాత్రమే రిజిస్ట్రేషన్లు జరిగాయి. సర్వే నెంబర్లను సరిచేసే వరకు రిజిస్ట్రేషన్‌లకు బ్రేక పడినట్లేనని అధికారులు చెబుతున్నారు.

సమస్యలు పరిష్కరించలేని పాలకులెందుకు..?
● జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు రియాజ్

పామూరు, ఫిబ్రవరి 15 : ఒక్కచాన్స్ పేరుతో 151 సీట్లు గెలుచుకొని అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యలను పట్టించుకోవడంలేదని, అలాంటి పాలకులు ఎందుకని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు రియాజ్ ప్రశ్నించారు. పామూరులోని అంకాళమ్మవీధి వడ్డెపాలెంలో జనసేన జెండా ఆవిష్కరణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముందుగా బైక్ ర్యాలీ చేపట్టారు. అనంతరం మండల అధ్యక్షుడు దరిశి ఏడుకొండలు అధ్యక్షతన జరిగిన సభలో రియాజ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల బంగారు భవిష్యత్ కోసం టీడీపీతో జనసేన కలిసి ఎన్నికల్లో పోటీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

మొదటి ఓటు చంద్రబాబుకే

● తెలుగుయువత అధ్యక్షుడు శేషాద్రి



విలేకర్లతో మాట్లాడుతున్న శేషాద్రి

ఎర్రగొండపాలెం, ఫిబ్రవరి 15 : నియోజకవర్గంలో 'మొదటి ఓటు చంద్రబాబుకే' కార్యక్రమాన్ని త్వరలోనే శ్రీకారం చుట్టనున్నట్లు వై.పాలెం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు దొడ్డాశేషాద్రి తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎర్రగొండపాలెంలో మొట్టమొదటిసారి ఓటు వేయనున్న యువతి, యువకులు, మహిళలకు 'నా ఓటు చంద్రబాబుకే క్యాంపెయిన్' ఏర్పాటు చేసి ఓటర్లలో చైతన్యం తీసుకు వస్తామన్నారు. రేపటి భవిష్యత్ కోసం యువత ఆలోచించి ఓట్లు వేయాలని అన్నారు. యువత భవిష్యత్తు ఉన్నతంగా ఉండాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని అన్నారు. నిరుద్యోగ యువతీ, యువకులకు నెలకు 3 వేల నిరుద్యోగ భృతి ఉద్యోగం వచ్చే దాకా నిరుద్యోగులకు టీడీపీ ప్రభుత్వం అధికారంలోని రాగానే చెల్లిస్తామన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారం చేపట్టగానే వివిధ రంగాలలో 20 లక్షలు ఉద్యోగాల కల్పన నిరుద్యోగులకు కల్పిస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం 2024లో చంద్రబాబుకు ఓటువేసి గెలిపిద్దామని యువతి, యువకులకు పిలుపునిచ్చారు. రాష్ట్ర తెలుగుయువత కార్యవర్గ సభ్యులు పోట్ల గోవింద్, సోషల్‌మీడియా కో-ఆర్డినేటరు షేక్ అజహర్, తెలుగు యువత మండల అధ్యక్షులు కొత్త భాస్కర్, కార్యనిర్వాహక కార్యదర్శి చేదూరి కిశోర్, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు వి.నాగరాజు, మహిళా అధ్యక్షురాలు వి.రమణమ్మ, తెలుగు యువత సభ్యులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉంటా.. ఆశీర్వదించండి

● గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి ● టీడీపీలో పలు కుటుంబాల చేరికలు

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 15 : నిత్యం స్థానికంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. గురువారం రాచర్ల మండలం చినగానిపల్లి, అచ్చంపేట గ్రామాలకు చెందిన 45 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వీరికి ముత్తుముల అశోక్‌రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ తాను ఎమ్మెల్యే గా ఉన్న సమయంలో నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను తీర్చడంతోపాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుత వైసీపీ పాలనలో పేదల నడ్డివిరుస్తున్నారన్నారు. తనకు మరోసారి ఎమ్మెల్యేగా అవకాశం కల్పించాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో తరిపిరెడ్డి శివారెడ్డి, కంబాల రమణ, కైపా రామిరెడ్డి, దోశెట్టి సుబ్బరత్నం, షేక్ ఖాశింవలి, జేమ్స్, పి.అరుణ్‌కుమార్, పి.చెన్నకేశవులు, పి.దేవరాజ్, ఆర్.రమణ, పి.దానం, చంద్రపాల్, మహమ్మద్‌ఖాశిం, కె.నారాయణరెడ్డి, పెద్దసుబ్బరాయుడు తదితరులున్నారు. వీరితో పాటు టీడీపీ అధ్యక్షులు కటికె యోగానంద్, గోపిరెడ్డి జీవన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు. భవిష్యత్తులో అశోక్‌రెడ్డి వెంటే ఉంటామని పార్టీలో చేరిన కార్యకర్తలు తెలిపారు.



టీడీపీలో చేరిన కార్యకర్తలతో అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 15 : 'ఏ సమస్య వచ్చినా పరిష్కరించడానికి మీ అందరికి అండగా ఉంటానని, ఆదరించాలని' టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. గిద్దలూరు మండలం కంచుపల్లె గ్రామంలో 'బాబు ష్యూరిటి భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ కంచుపల్లె అభివృద్ధికి తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నిధులు కేటాయించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో మరోసారి అభివృద్ధి కోసం తనను గెలిపించాలని కోరారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దప్పిలి శ్రీనివాసరెడ్డి, వైసీపీ కీలక నేత దప్పిలి రమణరెడ్డితోపాటు 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వీరికి టీడీపీ ఇన్‌చార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో గోతం శేఖర్, వైస్‌సర్పంచ్ షేక్ బికారి, కాకర్ల నారాయణ, రంగనాయకులు, మండలపార్టీ అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్‌యాదవ్, మాజీ సర్పంచ్ దప్పిలి భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పాలుగుళ్ల ప్రతాపరెడ్డి, టీడీపీ నాయకులు దుత్తా బాలీశ్వరయ్య, గోపాలకృష్ణ, మహనందియాదవ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బాండ్లు అందజేస్తున్న విఘ్నేష్‌రెడ్డి

గోగులదిన్నెలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

మార్కాపురం రూరల్ : మండ లంలోని గోగులదిన్నె గ్రామంలో గురువారం సాయంత్రం 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కుమారుడు విఘ్నేష్‌రెడ్డి కార్యకర్తలతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి రానున్న ఎన్నికల్లో టీడీపీనిఇ గెలిపించాలని కోరారు. యువతకు ఉద్యోగాలు రావాలన్నా, రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలన్నా టీడీపీ-జనసేన ప్రభుత్వం రావాలని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు జవ్వాజి రామానుజులరెడ్డి, గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

సర్వేనంబర్ల తేడాతో నిలిచిన రిజిస్ట్రేషన్లు

పొదిలి. ఫిబ్రవరి 15 : మండలంలో ఏర్పాటు చేసిన జగనన్న లే-అవుట్ లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్లు చేసే ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది. అయితే సర్వేనెంబరు తేడా ఉండడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. ఎంతో ప్రతిష్టాత్మకంగా పేదల సొంతింటి కళ నేరవేరుస్తున్నామని చెప్పుకుంటున్న ప్రభుత్వ పెద్దలు ఇంతపెద్ద లే-అవుట్‌లో తప్పులను ఇంతవరకు గమనించకపోవడం ఏమిటని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. నెలరోజులుగా రిజిస్ట్రేషన్లు చేయించుకొనేందుకు లబ్ధిదారులను సచివాలయాల చూట్టూ తిరుగుతున్నా సర్వర్లు మొరాయిస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. దీంతో సర్వేనంబరులో తేడా ఉన్నాయని చెప్పలేదని వారు వాపోతున్నారు. లే-అవుట్ సర్వేనెంబర్ 1177 సరైనదని అయితే 1195-2, 1195-3 చూపిస్తుండటంతో ప్రక్రియలో అంతరాయం కలిగిందని అధికారులు చెబుతున్నారు. ఈ సమస్యపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని రెవెన్యూ అధికారులు తెలిపారు. ఆ సమస్యను పరిష్కరిస్తేగాని జగనన్న లేఅవుట్‌లోని ఇళ్ల లబ్దిదారులకు రిజిస్ట్రేషన్ చేయడానికి వీలుకాదని తెలియడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో మొత్తం 2350 ఇళ్లకు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టారు. అయితే కేవలం పట్టణంలో 17, గ్రామీణ ప్రాంతాల్లో 363 మందికి మాత్రమే రిజిస్ట్రేషన్లు జరిగాయి. సర్వే నెంబర్లను సరిచేసేంత వరకు రిజిస్ట్రేషన్‌లకు బ్రేకు పడినట్లేనని అధికారులు చెబుతున్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

పెద్ద దోర్నాల,ఫిబ్రవరి 15: మండలంలోని బోడేనాయక్ తాండా వద్ద శ్రీ ఆంజనేయస్వామి పంచ లోహ విగ్రహం, ధ్వజస్తంభం, నూతన శిఖర కళశ, కీర్తి ప్రతిష్ఠ మహోత్సవ వేడుకలు గురువారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య గణపతిహోమం, పూర్ణాహుతి వంటి క్రతువులు నిర్వహించిన అనంతరం ధ్వజస్తంభ స్థాపన, శిఖర కలశం స్థాపన చేశారు. గ్రామప్రజలతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు విశేషంగా పాల్గొని 'జై శ్రీరాం' అంటూ నినాదాలు చేశారు. అనంతరం అన్నసంతర్పణ చేశారు.



ధ్వజస్తంభ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు, ఆంజనేయస్వామి (ఇన్‌సెట్)

నేడు సైన్స్ కళాజాత

గిద్దలూరు, ఫిబ్రవరి 15 : పట్టణంలోని సూర్యవిద్యానికేతన్ ఆవరణలో 16వ తేదీన శుక్రవారం మధ్యాహ్నం 1.30 గంటలకు సైన్స్ కళాజాత కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు పి.స్వరూపారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సాంస్కృతిక కళాప్రదర్శనలు, బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

అన్నదాన కార్యక్రమానికి విరాళం

బేస్తవారపేట, ఫిబ్రవరి 15 : బేస్తవారపేట శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయానికి శాశ్వత అన్నదానానికి చెక్క చిన్నయ్య భార్య కాంతమ్మ జ్ఞాపకార్థం వారి కుమార్తె అల్లుడు మునగనూరి శేషగిరిరావు, లక్ష్మీకుమారి గురువారం కన్యకాపరమేశ్వరి ఆలయానికి శాశ్వత అన్నదాన కార్యక్రమంలో భాగంగా రూ.1,00,116 విరాళం అందజేశారు. కార్యక్రమంలో జక్కా కుమార్, కమిటి సభ్యులు పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న శేషగిరిరావు

పొగాకు బ్యారన్ దగ్ధం

పొదిలి, ఫిబ్రవరి 15 : పొగాకు బ్యారన్ దగ్ధమైన ఘటన అన్నవరంలో బుధవారం రాత్రి చోటుచేసుకొంది. వివరాల్లోకి వెళితే.., గ్రామంలోని ఎర్రంరెడ్డి పెద్ద చెన్నయ్య అనే రైతు ఎప్పటిలాగానే బ్యారన్‌లో సుమారుగా 1300ల కర్రను లోడు చేసి కాల్చుచేస్తున్నారు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో పొగాకు పూర్తిగా కాలిపోయిందని రైతు తెలిపారు. ఈ అగ్ని ప్రమాదంలో రెండు లక్షలకు పైగా ఆస్తి నష్టం కలిగినట్లు చెప్పారు. రేయింబవళ్ళు రెక్కల కష్టంతో పండించిన పంట అగ్నిపాలు కావడంతో రైతు చెన్నయ్య దిగాలయ్యారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతు పెద్దచెన్నయ్య వేడుకున్నారు. ఈ ప్రమాదంపై వేలం నిర్వహణాధికారి మాట్లాడుతూ ప్రమాదం జరిగినా జరగకపోయినా, తప్పనిసరిగా బ్యారన్‌కు ఇన్సూరెన్స్ కట్టుకోవాలని ఆయన రైతులను కోరారు.



దగ్ధమౌతున్న బ్యారన్

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబు అజెండా

టీడీపీ నాయకుడు కందుల విఘ్నేష్‌రెడ్డి

పొదిలి, ఫిబ్రవరి 15 : రాష్ట్రాభివృద్ధి చంద్రబాబు అజెండా అని దీంతో పాటు విలువలతో కూడిన రాజకీయం చేయడం ఆయన సొంతమని కందుల నారాయణరెడ్డి కుమారుడు కందుల విఘ్నేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని నాలుగో వార్డులో గురువారం 'బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రం ఉన్న పరిస్థితులను చక్కదిద్దాలంటే తప్పనిసరిగా టీడీపీని అధికారంలోకి తీసుకొచ్చి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన కలయికతో విజయం సాధించనున్నట్లు తెలిపారు. రాష్ట్రాభివృద్ధిని ప్రజాసంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని పాలన చేసే వ్యక్తి చంద్రబాబు నాయుడని గుర్తు చేశారు. ముందుచూపుతో తమలాంటి యువతకు ఎన్నో ఉపాధి అవకాశాలు కల్పించిన ఘనత ఆయనకే దుక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో రాజధానిలేని రాష్ట్రంగా మిగిలిన రాష్ట్రాన్ని తిరిగి చరిత్ర పుటల్లో నిలపాలంటే తిరిగి టీడీపీ అధికారంలోకి వచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు. ఎప్పుడు ఎవరు కల్పించని విధంగా టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు అదించనున్నట్లు తెలిపారు. వైసీపీ పాలనలో నిత్యావసరాలు, గ్యాస్, డీజిల్, పెట్రోల్ తదితర ప్రజాఅవరాలను ఎన్నిరెట్లు పెంచాడో ప్రజలు గమనించాలన్నారు. వైసీపీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు టీడీపీ నాయకులు నడుంబిగించాలని పిలుపునిచ్చారు. అదే విధంగా కందుల నారాయణరెడ్డిని మార్కాపురం నియోజకవర్గానికి చేసిన మంచిపనులను గుర్తుంచుకొని ఆయన్ను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు కార్యకర్తలు, బూత్‌కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 15 : రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గిద్దలూరు పోలీసుస్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లుగా నమోదైన వారికి అర్బన్ సీఐ వీరసోమయ్య గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారి మీద చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికైనా పద్ధతులు మార్చుకుని సమాజంలో మంచి నడవడికతో ఉండాలని తెలిపారు.

దాడి పట్ల ఖండన

గిద్దలూరు, ఫిబ్రవరి 15 : అమరావతిలో ఓ పత్రికలో విలేకరిగా పనిచేస్తున్న పరమేశ్వర్‌రావుపై ఇసుక బకాసురులు దాడి చేయడాన్ని స్థానిక బీజేపీ నాయకులు ఖండించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన ప్రభుత్వమే నిందితులను ప్రోత్సహిస్తుండడం శోచనీయమన్నారు. అక్రమాలను ప్రశ్నించే విలేకరులను భయభ్రాంతులకు గురి చేయడాన్ని ఖండించారు. స్థానిక రెవిన్యూ అధికారులకు ఆమేరకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పిడతల రమేష్‌రెడ్డి, మండలశాఖ అధ్యక్షులు జయప్రకాశ్, అసెంబ్లీ కోకన్వీనర్ గుమ్మా రాముడు, బీజేపీ రూరల్ అధ్యక్షులు తిరుపాల్‌రెడ్డి, పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ధ్వజమెత్తిన వైసీపీ కౌన్సిలర్లు

సొంత సభ్యులకు సమాధానం చెప్పుకున్న చైర్మన్

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 15: పట్టణలో ప్రజాసమస్యలపై వైసీపీ కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. దీంతో సొంత సభ్యులకు సమాధానం చెప్పుకోవాల్సిన పరిస్థితి చైర్మన్‌కు వచ్చింది. మార్కాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం గురువారం చైర్మన్ బాలమురళీకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. బడ్జెట్, అత్యవసర, టేబుల్ సమావేశాలు జరిగాయి. బడ్జెట్‌పై చర్చలో వైసీపీ కౌన్సిలర్లు సమస్యలపై ధ్వజమెత్తారు. వైస్‌చైర్మన్ షేక్ ఇస్మాయిల్ మాట్లాడుతూ బడ్జెట్‌లో ప్రజారోగ్యం కోసం ఎక్కువ నిధులు కేటాయించాలన్నారు. స్మశనాలకు నిధులు కేటాయిస్తున్నప్పటికీ, ఖర్చు పెట్టడం లేదన్నారు. ఒక్కొక్క ఇంటికి రెండు ఇంటి నెంబర్లు ఉన్నా యని ప్రజలు తికమక పడుతున్నారన్నారు. పట్టణంలో బెడదగా మారిన కుక్కలను ఏరివేయాలన్నారు. ఈ సందర్భంగా చైర్మన్, కమిషనర్‌లు మాట్లాడుతూ కుక్కలు పట్టుకోవడంలో బ్లూ క్రాస్ సంస్థ అభ్యంతరం పెడుతోందన్నారు. తమపై కేసులు కూడా పెడుతుందన్నారు. ఈ నేపథ్యంలో కుక్కలకు కుటుంబ నియంత్రణ చేయిస్తామన్నారు. వైసీపీ కౌన్సిలర్ కశ్శెట్టి నగేష్ మాట్లాడుతూ కుటుంబ నియంత్రణ చేస్తే కుక్కలు కరవటం మానివేస్తా యా..? అని ప్రశ్నించారు. మరో వైసీపీ కౌన్సిలర్ డా.చెప్పల్లి కనకదుర్గ మాట్లాడుతూ మనుషులకు లేని భద్రత జంతువులకు కల్పిస్తున్నారా అన్నారు. ఆవులను గోశాలకు తరలించాలని టీడీపీ కౌన్సిలర్ రమ్య స్వాతి, వైసీపీ కౌన్సిలర్ కనకదుర్గ కోరారు. తమ వార్డులో అభివృద్ధి జరగలేదని, రానున్న ఎన్నికల్లో ఏ విధంగా వార్డులలోకి వెళ్లాలన్నారు. అధికార పార్టీ కౌన్సిలర్ అయిన మీరు సమావేశాల్లో సమస్యలు ప్రస్తావిస్తే ఎలా తమను చాంబర్‌లో కలిసి సమస్యలు చెప్పాలని చైర్మన్ బాలమురళీకృష్ణ అన్నారు. టీడీపీ కౌన్సిలర్ కొండయ్య మాట్లాడుతూ బాలికల ఉన్నత పాఠశాల వద్ద కల్వర్టు కూలి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే నిర్మించాలన్నారు. వైసీపీ కౌన్సిలర్ కనకదుర్గ మాట్లాడుతూ తమ వార్డులోని అక్కమ్మ బావి స్థలం ఆక్రమణలకు గురి కాకుండా ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలన్నారు. పలు సమస్యలపై కౌన్సిలర్లు ప్రస్తావించారు. ఈ సమావేశంలో కమిషనర్ రవీంద్ర, డీఈ సుభానీ, మేనేజర్ శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.



సమస్యలపై ప్రశ్నిస్తున్న కౌన్సిలర్లు

ఉర్దూ పోస్టులకు నోచుకోని ప్రకాశం జిల్లా

కంభం, ఫిబ్రవరి 15 : రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 12న జారీ చేసిన డీఎస్సీ-2024 నోటిఫికేషన్‌లో ప్రకాశం జిల్లా ఉర్దూ మాధ్యమం పోస్టులు చూపించకపోవడం అన్యాయమని ప్రకాశం ఆల్ ఇండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ మహమ్మద్‌రఫీ, జిల్లా కార్యదర్శి పఠాన్ మహమ్మద్ ఆసిఫ్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఉర్దూ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ పోస్టులు 23, స్కూల్ అసిస్టెంట్ ఉర్దూ 4, పీఎస్ 1, సోషల్ 2, గణితం 2 ఖాళీగా ఉన్నప్పటికీ డీఎస్సీలో అవి ఏవీ చూపించకపోవడం దారుణమన్నారు. ఉర్దూ విద్యార్థులకు అన్యాయం జరుగకుండా ఈ పోస్టులను జతచేయాలని కోరారు.

వైభవంగా వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ

మార్కాపురం వన్ టౌన్, ఫిబ్రవరి 15: స్థానిక తర్లుపాడు రోడ్డులోని కరెంట్ ఆఫీస్ వద్ద వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు, వేద పండితులు వాల్మీకి విగ్రహానికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. తొలుత పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకి విగ్రహనికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

వాహనదారులు నిబంధనలు పాటించాలి

రాచర్ల, ఫిబ్రవరి 14 : వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలను పాటించాలని సీఐ దాసరిప్రసాద్ అన్నారు. రాచర్ల ఫారం వద్ద హైవే రోడ్డుపై గురువారం పలు వాహనాలను తనిఖీ చేశారు. లైసెన్సు లేని వాహనాలు, ఇద్దరి కంటే ఎక్కువ మందితో వెళుతున్న వాహనాలను, హెల్మెట్ పెట్టుకోకుండా వెళ్లే వారికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సీఐ

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 15: సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని కెనరా బ్యాంకు మేనేజర్ బాలక్‌రామ్ అన్నారు. ఏసీబీసీ కాలనీలో సెంటర్ ఫర్ ఫైనాన్స్ ఫర్ ఎడ్యుకేషన్ కేంద్రం గురువారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకుఖాతాలు, ప్రమాదపు బీమా, జీవిత బీమా, పొదుపు సంఘాలు, డెబిట్‌కార్డు సేవలు గురించి వివరించారు.

మార్కాపురాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి

ఎమ్మెల్యే అన్నా రాంబాబు

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 15: మార్కాపురం నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని గిద్దలూరు ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త అన్నా రాంబాబు అన్నారు. పట్టణంలోని కాలేజీ రోడ్డులోని సెవెన్ హిల్స్ లాడ్జిలోని ఫంక్షన్ హాల్‌లో గురువారం విలేకర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు 15 సంవత్సరముల నుంచి గిద్దలూరు నియోజకవర్గ ప్రజలకు సేవ చేసినట్లు తెలిపారు. 15 సంవత్సరాల క్రితమే నా తల్లిదండ్రుల పేరుతో ట్రస్టు ఏర్పాటు చేసి మార్కాపురంలో నీటి సమస్య తీర్చడం కోసం ట్యాంకర్ల ద్వారా ప్రజలకు నీటి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. అంబులెన్స్‌ను ఏర్పాటు చేసి ఈ ప్రాంత ప్రజలకు తమ వంతు సహాయాన్ని చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్‌చైర్మన్ బాలమురళీకృష్ణ, మార్కెట్ యార్డు చైర్మన్ షంషీర్ అలీబేగ్, వైసీపీ పట్టణ కన్వీనర్, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, వైసీపీ నాయకులు చాతరాజుపల్లి శ్రీనివాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాంబాబు

విశ్రాంత సివిల్ ఇంజనీర్ మృతి

పొదిలి, ఫిబ్రవరి 15 : విశ్రాంత సివిల్ ఇంజనీర్ మద్దుల వెంకటనరసయ్య (87)మృతి చెందాడు. 1939లో కాటూరివారిపాలెంలో జన్మించిన ఆయన పలు ప్రభుత్వ శాఖల్లో పనిచేశారు. 1954లో విశాఖపట్టణంలో సాంకేతిక విద్యను అభ్యసించి 1959లో పొదిలి ప్రభుత్వశాఖలో జేఈగా ఉద్యోగం ప్రారంభించారు. తదుపరి ఉద్యోగోన్నతిపై విశాఖ, నెల్లూరు జిల్లాలతోపాటు అనేక జిల్లాల్లో పనిచేశారు. ఈయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసిస్టెంట్ ఇంజనీర్ల సంఘానికి రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. చివరగా 1981 నుండి 1997 వరకు శ్రీశైలం ప్రాజెక్టులో పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందారు.

అక్రమ కేసులు పెట్టడం దారుణం

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 15: భారత చైతన్య యువజన పార్టీ జాతీయ అధ్యక్షుడు రామచంద్రయాదవ్‌పై పుంగనూరు పోలీసులు మంత్రి రామచంద్రా రెడ్డి ఆదేశాలతో అక్రమకేసులు పెట్టడం దారుణంగా ఉందని ఆ పార్టీ రాష్ట్ర సమ న్వయ సారథి మిరియం శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో ఖండించారు. పుంగనూరులో ప్రతిపక్షం అనేది లేకుండా చేయాలనే ఉద్దేశంతోనే మంత్రి పోలీ సులతో అక్రమంగా కేసులు నమోదు చేయించారన్నారు. దీనిపై ఉన్నతాధికారు లు స్పందించి వెంటనే అక్రమ కేసులు నమోదు చేసిన పోలీస్ అధికారులపై ఎ న్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

రైతులపై లాఠీచార్జి దారుణం

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 15: రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని, ఎంఎస్‌పీ చట్టం చేయాలని, గతంలో మోదీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ రైతాంగం చేపట్టిన నిరసన ప్రదర్శనపై పోలీసులు లాఠీచార్జి చేయడమే కాకుండా సోనిక్ ఆయుధాలను ప్రయోగించడాన్ని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యద ర్శి చిట్టిపాటి వెంక టేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో ఖండించారు. రోడ్లపై భారీ గోతులను తవ్విం చి ట్రాక్టర్లు రాకుండా ఎన్ని నిర్బంధాలు ప్రయోగించినా రైతులు ఢిల్లీ సరిహద్దు లకు చేరుకున్నారని తెలిపారు. అటువంటి రైతులపై పోలీసులు లాఠీచార్జి చేయడం దుర్మార్గంగా ఉందన్నారు.

గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయండి



బైకుర్యాలి నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

పొదిలి, ఫిబ్రవరి 15 : పారిశ్రామికసమ్మె, గ్రామీణ భారత్‌బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయు ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక సంఘాలు కిసాన్‌మోర్చ పిలుపు మేరకు ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా సమ్మెకు పిలుపునిచ్చారు. అందులో భాగంగా పట్టణంలో చిన్నబస్టాండ్ నుంచి విశ్వనాథపురం కళాశాల రోడ్డు వరకు బైకుర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు.

జేఏసీ ఆధ్వర్యంలో నిరసన



వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 15: ఏపీ జేఏసీ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు మార్కాపురం తాలుకా యూనిట్ ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏవోకు మెమొ రాండం అందజేశారు. కార్యక్రమంలో తాలుకా యూనిట్ అధ్యక్షులు శ్రీనివాసశాస్త్రి, కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు రమేష్ రెడ్డి, కోశాధికారి రవికిరణ్, రాష్ట్ర సభ్యులు నాగేంద్రరెడ్డి, నాయకులు పద్మనాభరెడ్డి, విజయకుమారి, రవిచంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని సచివాలయ సిబ్బంది

ఇబ్బందులు పడుతున్న అర్జీదారులు

తర్లుపాడు, ఫిబ్రవరి 15: మండలంలోని కలుజువ్వలపాడు సచివాలయం గురువారం ఉదయం 11:30 గంటలు దాటినా తలుపులు తెరుచుకోలేదు. వివిధ పనులపై వచ్చిన అర్జీదారులు సచివాలయం వద్దకు రాగానే తలుపులు వేసి ఉండడంతో అధికారుల కోసం అక్కడే పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. 11:35 గంటలకు ఒక పారిశుధ్య కార్మికుడు వచ్చి సచివాలయ తలుపులు తెరిచారు. సచివాలయంలో ఆరుగురు సిబ్బంది ఉన్నప్పటికీ సమయపాలన పాటించకుండా తమ ఇష్టానుసారంగా వస్తున్నారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయం వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామని ఉన్నతాధికారులు చెపుతున్నప్పటికీ సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహ రించడంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. ఇప్పటికైనా ఉన్న తాధికారులు స్పందించి సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి మెరుగైన సేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

బీఎల్‌వో విధులకు వెళ్లాం

కలుజువ్వలపాడు సచివాలయంలో పని చేస్తున్న నలుగురు సిబ్బంది బీఎల్‌వో విధులకు తర్లపాడు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. మిగిలిన ఇద్దరు కొంచెం ఆలస్యంగా విధులకు వచ్చారు.

శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి



కలుజువ్వలపాడు సచివాలయం

రేపటి నుంచి పలు రైళ్లు రద్దు

దొనకొండ, ఫిబ్రవరి 15 : గుంటూరు-గుంతకల్లు రైలు మార్గంలో దొనకొండ మీదుగా ప్రయాణించే పలు రైళ్లను రైల్వే డబ్లింగ్ లైను పనుల కారణంగా ఈనెల 17వ తేదీ నుంచి తాత్కాలికంగా రద్దు చేసినట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. 17329 నెంబర్ హుబ్లీ-విజయవాడ రైలు ఈనెల 17 నుంచి 28వ తేదీ వరకు, 17330 నెంబరు గల విజయవాడ - హుబ్లీ రైలు ఈనెల 18 నుంచి 29 వరకు, 17253 నెంబరు గల గుంటూరు - సి కింద్రాబాద్ రైలు ఈనెల 18 నుంచి 29 వరకు, 17254 నెంబరు గల సికింద్రాబాద్ - గుంటూరు రైలు ఈనెల 18 నుంచి 29 వరకు, 17261 నెంబరు గల గుంటూరు -తిరుపతి రైలు ఈనెల 17 నుంచి 28 వరకు, 17262 నెంబరు గల తిరుపతి - గుంటూరు రైలు ఈనెల 18 నుంచి 29 వరకు, 17251 నెంబరుగల గుంటూరు - కాచిగూడ రైలు ఈనెల 17 నుంచి 28 వరకు, 17252 నెంబరు గల కాచిగూడ - గుంటూరు రైలు ఈనెల 18 నుంచి 29 వరకు 17228 నెంబరు గల గుంటూరు - డోన్‌రైలు మార్చి 31 వరకు, 17227 నెంబరు గల డోన్ - గుంటూరు రైలు ఏప్రిల్ 1వ తేదీ వరకు తాత్కాలికంగా రద్దు చేసినట్లు రైల్వే అధికారులు వారి ప్రకటనలో తెలిపారు. రైలు ప్రయాణికులు ఈ అసౌకర్యాన్ని గుర్తించి సహకరించాలని కోరారు.

నేడు పూరిమెట్లలో బీసీ సదస్సు

ముండ్లమూరు, ఫిబ్రవరి 15 : మండలంలోని పూరిమెట్లలో జయహో బీసీ సదస్సు జరుగుతున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా టీడీపీ ఒం గోలు పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని బాలాజీ, దర్శి మాజీ ఎమ్మెల్యే నారపశెట్టి పాపారావు, మండల స్థాయి నాయకులు హాజరవుతారని తెలిపారు. బీసీలందరూ హాజరు కావాలని కోరారు.

టీడీపీ ప్రభంజనం ఖాయం

- మాజీ ఎమ్మెల్యే, ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర
- పార్టీలోకి వలసల వెల్లువ
- వారం రోజుల్లో 250 కుటుంబాల చేరిక
- వైసీపీని వీడిన పాపిరెడ్డిపల్లి వాసులు


ఉగ్ర సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరిన పాపిరెడ్డిపల్లి గ్రామస్థులు

కనిగిరి, ఫిబ్రవరి 15: కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి రోజు రోజుకు తెలుగుదేశం పార్టీలో చేరికలు వెల్లువలా కొనసాగుతున్నాయి. ఇటీవల వారం రోజులుగా వైసీపీని వీడిన 250 కుటుంబాలు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్ చార్జి డాక్టర్ ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరారు. గురువారం హనుమంతునిపాడు మండలంలోని పాపిరెడ్డి పల్లి గ్రామంలోని వైసీపీకి చెందిన 35 కుటుంబాలు మండల పార్టీ అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. ఉగ్ర కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో జరిగిన చేరికల కార్యక్రమంలో ఉగ్ర మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో 1983 నాటి ప్రభంజనాన్ని తలదన్నేలా తెలుగుదేశం పార్టీ వి జయం ఉంటుందన్నారు. వైసీపీ పాలనలో ప్రజలు అన్ని విధాలా ఇబ్బందుల పడ్డారన్నారు. పథకాలంటూ బటన్ నొక్కుతూ రవాణా, నిత్యావసర వస్తువులు, ఆయిల్, కరెంట్ చార్జీలు, ఇంటి, చెత్త పన్నుల పేరుతో పేదలను బాదేస్తున్నారన్నారు. ఐదేళ్లు కావస్తున్నా ఏ ప్రాంతంలోనూ అభివృద్ధి చేయని వ్యక్తి జగన్ ఒక్కరే అన్నారు. ఇలాంటి వ్యక్తికి మళ్లీ ఓటేస్తే ఆంధ్రా పరిస్థితి దయనీయంగా మారుతుందని ప్రజలు ఆందోళన చెందు తున్నారన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు పాలనలో అభివృద్ధి ఫలాలు ప్రజలు అందుకున్నారన్నారు. మళ్లీ ఆయన సీఎంగా వస్తేనే రాష్ట్రం బాగుపడుతుందని, మా బతుకులు చక్కబడతాయని ప్రజలు గట్టిగా నమ్ముతున్నారన్నారు. వైసీపీ పాలనతో విసిగిపోయిన ఎంతో మంది చంద్రబాబును నమ్మి తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారన్నారు. అందుకు కనిగిరి నియోజకవర్గంలో చేరికలే నిదర్శనమన్నారు. తన గెలుపునకు మీరంతా కష్టపడి పనిచేయాలని ఉగ్ర విజ్ఞప్తి చేశారు. టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలతోపాటు, కనిగిరి అభివృద్ధికి తాను రూపొందించిన ప్రణాళికే ప్రజలకు వివరించాలని ఉగ్ర కోరారు. కార్యక్రమంలో హనుమంతునిపాడు మండల నాయకులు గాయం తిరుపతిరెడ్డి, గాయం రామిరెడ్డి, చీకటి వెంకటసుబ్బయ్య, సానికొమ్ము బ్రహ్మారెడ్డి, బూచి రామకోటిరెడ్డి, ఉడుముల వెంకటసుబ్బారెడ్డి, పాపిరెడ్డిపల్లి టీడీపీ నాయకులు కావేటి నారాయణ, పెంచికల రామకృష్ణ, ఆకుపాటి శ్రీనివాసులు, మురహరి శ్రీనివాసులు పాలొన్నారు.

ఎస్ఐను కలిసిన టీడీపీ శ్రేణులు

పామూరు, ఫిబ్రవరి 15 : పామూరు ఎస్ఐ సైదుబాబును కంభాలదిన్నె టీడీపీ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు, ఈ సందర్భంగా ఎస్ఐని శాలువతో సన్మానించి పరిచయం చేసుకొన్నారు. కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త, అచ్చమాంబ పేరంటాల దేవస్థాన చైర్మన్ అడుసుమల్లి నరసింహులు, తెలుగు రైతు మండల కమిటీ అధ్యక్షుడు మన్నం రమణయ్య, గోళ్ల భాస్కర్‌రావు, ఎస్.వెంకటేశ్వర్లు, బూత్ కమిటీ ఇన్‌చార్జి గోళ్ల వీరబాబు, ఉన్నారు, కాగా టీడీపీ పట్టణ నాయకులు షేక్ ఖాజారహంతుల్లా, ఎస్ఐ సైదుబాబును కలిసి పరిచయం చేసుకొని శాలువాతో సత్కరించారు.

రాజధాని ఫైల్స్ చిత్ర ప్రదర్శన నిలిపివేత

పామూరు, ఫిబ్రవరి 15 : రాజధాని ఫైల్స్ చిత్ర ప్రదర్శనను రెవెన్యూ, అధికారులు అర్థంతరంగా నిలపివేశారు. గురువారం విడుదలైనరాజధాని ఫైల్స్ సినిమా పామూరులోని కేటీ సినిమ్యాక్స్ థియేటర్‌లో వేశారు. మార్నింగ్ షోకు ప్రేక్షకులు టికెట్లు కొని సినిమా చూస్తుండగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బీ మల్లికార్జునరావు, వీఆర్వో షేక్ రఫీ వచ్చి సినిమా నిలివేయాలని ఆదేశించారు. దీంతో థియేటర్ నిర్వాహకులు సినిమాని ఆపేశారు. టికెట్లు కొన్న ప్రేక్షకులు నిలదీయగా వారికి డబ్బులు ఇచ్చి పంపించేశారు. ఈ సినిమాపై వైసీపీకి చెందిన కొందరు హైకోర్టును ఆశ్రయించారు. స్టేతో ప్రదర్శనను అడ్డుకున్నారు.

బ్రెయిన్ స్ట్రోక్‌తో సచివాలయ ఉద్యోగి మృతి



ముండ్లమూరు, ఫిబ్రవరి 15 : మండలంలోని పోలవరం గ్రామ సచివాలయంలో ఎనర్జీ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ముండ్లమూరు గ్రామానికి చెందిన కొండ్రు వీరాంజనేయులు (33) బ్రెయిన్ స్ట్రోక్‌తో గురువారం మృతి చెందారు. వీరాంజనేయులు ఇంటి నుంచి సచివాలయానికి వెళ్లేందుకు సిద్ధమవ్వగా ఒ క్కసారిగా బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యారు. వెంటనే కుటుంబ సభ్యులు గ్రా మంలోని ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లగా వైద్య పరీక్షలు చేసి హైబీపీగా నిర్ధారిం చి ఒంగోలులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించా రు. కొద్ది సేపటికే చి కిత్స పొందుతూ మృతి చెందారు. వీరాంజనేయులు భా ర్య విజయలక్ష్మి, కు మారుడు, కుమార్తె ఉన్నారు. వీరాంజనేయులు తండ్రి చిన తిరుపాలు దివ్యాంగుడు కావడం, కుమారుడు మరణించారనే విషయం తెలిసిన వెంటనే కుప్ప కూలి పోయారు. భార్య విజయలక్ష్మి, పిల్లలు ఏడుస్తున్న తీరు చూపరులను సైతం కంట తడి పెట్టించింది. బ్రెయిన్ స్ట్రోక్‌తో అకస్మాత్తుగా మృతి చెందిన విరాంజనేయులు మృత దేహానికి దర్శి డివిజన్ ఏడీఈ పిచ్చయ్య, లైన్ ఇన్‌స్పెక్టర్ సాంబయ్య, లైన్‌మెన్‌లు పీఎస్ఆర్ ఆంజనేయులు, మస్తాన్, నాయక్, కోటేశ్వరరావుతో పాటు మండలంలో ఎనర్జీ అసిస్టెంట్‌లు నివాళులర్పించారు.

రౌడీషీటర్ల కదలికలపై దృష్టి

ముండ్లమూరు, ఫిబ్రవరి 15 : సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మండలంలో ఉన్న రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎస్ఐ యూ వెంకట కృష్ణయ్య అన్నారు. ఆయన గురువారం మండలంలోని బసవాపురం, పెద ఉల్లగల్లు, ఈదర, మారెళ్ల, పూరిమెట్ల, పోలవరం గ్రామాల్లో ఉన్న పాత కేసుల్లో నేరస్తుల ఇళ్లకు వెళ్లారు. ప్రస్తుతం రౌడీషీటర్‌గా ఉన్న వ్యక్తి ఎలా ఉన్నాడని? అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సందర్భంగా ప్రశాంతంగా జీవనం గడపాలన్నారు. అనవసరంగా కేసుల్లో తలదూరిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ బీ పవన్ కుమార్, వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఎస్ఐ

ముండ్లమూరు, ఫిబ్రవరి 15 : మండలంలోని శంకరాపురం, పోలవరం, పెద ఉల్లగల్లు, పసుపుగల్లు, పులిపాడు గ్రామాల్లో రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్ఐ యూ వెంకట కృష్ణయ్య గురువారం పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా హెచ్ఎంలు, బీఎల్‌వోలతో పోలింగ్ కేంద్రాల్లో ఉన్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా ఓటర్లకు సౌకర్యంగా ఉండేందుకు ర్యాంపుతో పాటు తాగు నీరు, మరుగు దొడ్లు గురించి సమీక్ష చేశారు. పోలింగ్ కేంద్రాల్లో కిటికీలు, తలుపులకు మరమ్మతులు చేయించారన్నారు. ఓటరుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. ఆయన వెంట హెచ్ఎంలు అరుణ కుమారి, బీఎల్‌వోలు, సిబ్బంది ఉన్నారు.

సుభానీ కుటుంబానికి ఆర్థిక సాయం

పామూరు, ఫిబ్రవరి 15 : తిమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన షేక్ సుభానీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆ కటుంబానికి మానవత సంస్థ తరుపున దాతల సహకారంతో రూ.27,500 అందచేశారు. సంస్థ తరుపున రూ.5వేలు, దాతల స హకారంతో రూ.22వేలను అందచేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు పీ తిరుపతిరెడ్డి, కన్వీనర్ వీడీ వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షుడు బాషామోహిద్దీన్, కాకు నాగేశ్వరరావు, మితికల నారాయణ, మాల్యాచలం, హుసేన్, చాంద్‌బాషా, ఎం.తిరుపతిరెడ్డి, వై.వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం

కురిచేడు, ఫిబ్రవరి 15: వైసీపీ అధికారంలోకి వచ్చాక వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయని తెలుగుదేశం పార్టీ జిల్లా మాజీ లీగల్ సెల్ అధ్యక్షుడు పరిటాల సురేష్ అన్నారు. పల్లె పల్లెకు ప్రజాయాత్ర పేరుతో సురష్ గ్రామాలు తిరుగుతూ వైసీపీ ప్రభుత్వ అరాచకాలను ఎండగడుతున్నారు. రాష్ట్రాన్ని సర్వనాశం చేసిన జగన్‌ను ఓడించి చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఉమ్మడి ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. టీడీపీ ప్రజల పార్టీ అన్నారు. మన రాజధాని అమరావతి నిర్మాణం కోసం చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించాలన్నారు. కార్యక్రమంలో సుబ్బారావు, బాబు, యోగేశ్వరరావు, పురుషోత్తం పాల్గొన్నారు.

కాపు సంక్షేమ సంఘం అధ్యక్షురాలిగా లక్ష్మి

కురిచేడు, ఫిబ్రవరి 15: దర్శి నియోజకవర్గ కాపు సంఘం అధ్యక్షురాలిగా కురిచేడు మండలం నాంచారపురం గ్రామానికి చెందిన కాల్వ లక్ష్మిని నియమించారు. ఆమెను దర్శి నియోజక వర్గ జనసేన నాయకుడు గరికపాటి వెంకట్ దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు. కాపుల ఐక్యతకు, వారి అభివృద్ధికి కృషి చేయాలని ఆమెకె సూచించారు. వెంకట్ వెంట స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు కమతం నాగిరెడ్డి, జనసేన నాయకులు ఉన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న ఏలూరి, అధ్యాపకులు

క్రీడారంగంలోనూ సత్తాచాటిన ఎంఎస్ఎం

విన్నర్ షీల్డ్‌తో పాటు రూ.5లక్షల బహుమతి సాధించిన విద్యార్థులు

కనిగిరి, ఫిబ్రవరి 15 : విద్యారంగంలోనే కాకుండా క్రీడారంగంలోనూ ఎంఎస్ఎం విద్యార్థులు తనదైన సత్తాచాటుతూ ఆడుదాంఆంధ్రా ఖోఖో పోటీల్లో రాష్ట్ర స్థాయి విన్నర్ టీంగా గెలుపొందారు. స్థానిక ఎంఎస్ఎం కళాశాల ఆవరణలో గురువారం ఆయా టీం విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ ఏలూరి సుబ్బారావు ఘనంగా సత్కరించి అభినందించారు. ప్రభుత్వం నిర్వహించిన ఆడుదాంఆంధ్రా క్రీడాపోటీల్లో భాగంగా ఎంఎస్ఎం విద్యార్థులు ఖోఖో పోటీల్లో పాల్గొన్నారు. మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి ఆ తర్వాత రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో ప్రకాశం జిల్లా నుంచి పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన ఖోఖో పోటీల్లో విశాఖ జిల్లాతో తలపడిన ప్రకాశం జిల్లా టీమ్‌లో అందరూ ఎంఎస్ఎం విద్యార్థులు కావడం విశేషం. విశాఖ జిల్లా టీమ్‌తో జరిగిన ఖోఖో పోటీల్లో గెలుపొంది విన్నర్ షీల్డ్‌ను సొంతం చేసుకోవడంతో పాటు రూ.5లక్షల నగదు బహుమతిని కైవసం చేసుకుని కనిగిరి ప్రాంతానికే వన్నె తెచ్చారు. కళాశాల ఆవరణలో అధ్యాపక బృందం క్రీడాకారులను అభినందించింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీ రాజవర్ధన్, కోచ్‌లు విశ్వనాథరెడ్డి, శివారెడ్డి, విజేత కళాశాల కరస్పాండెంట్ పసుపులేటి అరుణోదర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో విజేతలు

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొన్న ప్రకాశం జిల్లా జట్టు ఎంఎస్ఎం విద్యార్థుల్లో మద్దులూరి దివ్య కెప్టెన్‌గా, వైస్ కెప్టెన్‌గా బొమ్మల శిరీష, అశ్విని, శివనాగలక్ష్మి, భవాని, హైమావతి, ఉష, సభియా, మధులత, నాగమల్లేశ్వరి, వెంకటలక్ష్మి, అనూరాధ, అహల్య, శశికళ, సోనా ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యత పెంపొందించుకోవాలి


కరపత్రాల్ని విడుదల చేస్తున్న బ్యాంక్ మేనేజర్లు

దొనకొండ, ఫిబ్రవరి 15 : గ్రామీణ ప్రజలు ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించుకొని బ్యాంకులు ప్రజలకు అందించే సేవలను వినియోగించుకొని జీవనోపాధి మెరుగుపర్చుకోవాలని కెనరా బ్యాంక్ మేనేజర్ టీ అశోక్ సూచించారు. నాల్గురోడ్ల కూడలిలో ఏర్పాటు చేసిన ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని కెనరా, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకుల మేనేజర్లు అశోక్, చిన్ననాయక్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేనేజర్ అశోక్ మాట్లాడుతూ ఆర్థిక మోసాలు జరిగితే రిజర్వు బ్యాంక్ అఫ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్‌మెన్‌ద్వారా పరిష్కారం పొందవచ్చని తెలిపారు. రిజర్వుబ్యాంక్ డిపాజిట్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్, కెనరా బ్యాంక్ సౌజన్యంతో సొసైటీ ఫర్ సోషల్ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఆంజనేయులు ఆధ్వర్యంలో ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కేంద్రం దొనకొండ, కురిచేడు, కొనకనమిట్ల మండలాల ప్రజలకు సేవలను అందిస్తుందన్నారు. సైబర్ క్రైమ్స్, డిజిటల్ చెల్లింపులు, సామాజిక భద్రత పథకాల గురించి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ చిన్ననాయక్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కంభం సీఎఫ్ఎల్ కౌన్సిలర్ రాజకుమార్, దొనకొండ సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు శ్యామ్‌బాబు, షేక్ హసీనా, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

యాజమాన్య సాగుతో దిగుబడులు

తాళ్లూరు, ఫిబ్రవరి 15 : మొక్క సాగు చేపట్టిన రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సా ధించ వచ్చునని మండల వ్యవయాయాధికారి బి.ప్రసాదరావు అన్నారు. నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ మిషన్ కార్యక్రమంలో మొక్కజొన్న సాగు చేసే విధానంపై తాళ్లూరులో మొక్కజొన్న రైతులకు గురువారం శిక్షణ నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ మొక్కజొన్న పంట ఏనుగు పంట అనగా ఎక్కువ నీటిని పోషకాలను వినియోగించుకుటుందన్నారు. నీటి యాజమాన్యపద్ధతిలో భాగంగా పూతకు ముందు పూత దశలో, గింజ పాలు పోసుకునే దశలో నీరు పెట్టడం అవసరమన్నారు. లేత పైరుకు అధిక నీరు హానికరమన్నారు. దీర్ఘకాలి క రకాలను 10 తడులు, మకాలిక రకాలను 8 తడులు నీరు అవసరమన్నారు. వేడి వాతావరణ పరిస్థితులను బ ట్టి చర్యలు చేపట్టాలన్నారు. ఎరువు ల యాజమాన్యంలో భాగంగా 5 బస్తాల యూరియా, 4 బస్తాల పాస్పేట్, 2 బస్తాల పొటాష్ హైబ్రీడ్ రకాలకు, 10-35-35 అవసరమవుయాన్నారు. వీటిని 4 దఫాలుగా మొక్కకు అందించాలన్నారు. మొక్కజొన్న రైతులు యాజమాన్య పద్ధతులు పాటించిఅధిక దిగుబడులు సాధించాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ నాయక్, వెంకట్రావు, రైతులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించలేని పాలకులెందుకు..?


జెండాను ఆవిష్కరిస్తున్న రియాజ్

పామూరు, ఫిబ్రవరి 15 : ఒక్కచాన్స్ పేరుతో 151 సీట్లు గెలుచుకొని అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యలను పట్టించుకోవడంలేదని, అలాంటి పాలకులు ఎందుకని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు రియాజ్ ప్రశ్నించారు. పామూరు పట్టణంలోని అంకాళమ్మవీధి వడ్డెపాలెంలో జనసేన జెండా ఆవిష్కరణ కార్యక్రమం గురువారం సాయంత్రం నిర్వహించారు. ముందుగా మమ్మీడాడి సెంటర్ నుంచి బైక్ ర్యాలీ చేపట్టారు. అనంతరం మండల కమిటీ అధ్యక్షుడు దరిశి ఏడుకొండలు అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రియాజ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల బంగారు భవిష్యత్ కోసం టీడీపీతో జనసేన కలిసి ఎన్నికల్లో పోటీ చేస్తుందన్నారు. అడ్డదారుల్లో, దొంగ ఓట్లతో మళ్లీ అధికారంలోకి వ చ్చేందుకు జగన్‌రెడ్డి కుట్రలు పన్నుతున్నారని, ప్రజలంతా ఏకమై తిప్పికొట్టాలన్నారు. కనిగిరి ఇన్‌చార్జి వరికూటి నాగరాజు మాట్లాడుతూ జగన్ అవినీతి పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి వై.రహీముల్లా, రాయిని రమేష్, ఏ రవి, ఉపాధ్యక్షుడు సీ హెచ్ ప్రసాద్, ప్రోగ్రాం కమిటీ కన్వీనర్ రామిశెట్టి సునీల్, గుత్తి మహి, గోస్తు సునీల్, టీడీపీ ఎంపీటీసీ సభ్యుడు బొల్లా నరసింహారావు, జిల్లా నాయకులు, సయ్యద్ అమీర్‌బాబు, షేక్ ఖాజారహంతుల్లా, పట్టణ ఫోర్‌మెన్ కమిటీ సభ్యులు, ఇర్రి కోటిరెడ్డి, వందిటి హరీష్, తడికమళ్ల సుబ్బారావు, బాబూరావు, నాగేశ్వరరావు, చిరంజీవి, సునీల్‌తో పాటు జనసేన పార్టీ మండల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న చైర్మన్ గఫార్

రిజిస్ట్రేషన్‌లలో అవకతవకలు జరిగితే ఉపేక్షించం

మున్సిపల్ చైర్మన్ గఫార్

కనిగిరి, ఫిబ్రవరి 15 : పేదల ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రకియలో అవకతవకలు జరిగితే ఉపేక్షించేది లేదని మున్సిపల్ చైర్మన్ గఫార్ అన్నారు. పట్టణంలోని వివిధ సచివాలయాల్లో ప్రభుత్వ లేఅవుట్లలో ఇచ్చిన ఇళ్ల పట్టాలను రిజిస్ట్రేషన్ చేయించే ప్రక్రియను గురువారం చైర్మన్ పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది, అధికారులతో చైర్మన్ మాట్లాడుతూ ఇంటి స్థలాలకు పూర్తి భద్రతను కల్పించాలని సంకల్పంతో ప్రభుత్వం వాటిని రిజిస్ట్రేషన్ చేయిస్తుందన్నారు. లబ్ధిదారులకు భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడడంతో పాటు అవసరానికి వాటిని విక్రయించుకునేందుకు ఈ రిజిస్ట్రేషన్ ఉపకరిస్తుందన్నారు. ఎలాంటి అవకతవకలు జరుగకుండా చూడాలని సచివాలయ సిబ్బంది, అధికారులకు సూచించారు. ఈ రిజిస్ట్రేషన్ ద్వారా బ్యాంకుల్లో కూడా రుణాలు పొందే అవకాశం ఉందన్నారు. చైర్మన్ వెంట సచివాలయ అడ్మిన్ అశోక్, వీఆర్ నాగరాజు, బ్రహ్మారెడ్డి, రామాంజనేయులు, నాయకులు రామనబోయిన శ్రీనివాసులుయాదవ్, కన్వీనర్ జానీ ఉన్నారు.

ప్రశాంతంగా ఓటు వేయండి

పామూరు, ఫిబ్రవరి 15 : సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ప్రశంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సీఐ రామానాయక్ సూచించారు, మండలంలోని బొట్లగూడూరు గ్రామంలో గురువారం పర్యటించారు, ఎలాంటి వత్తిళ్లకు లొంగకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని, అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సమ్మెను జయప్రదం చేయండి

దర్శి, ఫిబ్రవరి 15 : దేశవ్యాప్తంగా ఈనెల 16వ తేదీన జరిగే సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి టీ రంగారావు, సీపీఐ దర్శి నియోజకవర్గ కార్యదర్శి మాదపాకుల రమేష్ పిలుపునిచ్చారు. బీజేపీ అనుసరిస్తున్న ప్రజా, కార్మిక విధానాలకు నిరసనగా సమ్మె చేయనున్నట్లు తెలిపారు. సమ్మె విజయవంతానికి ప్రజలను సంసిద్ధం చేసేందుకు వామపక్ష నాయకులు గ్రామాల్లో పర్యటిస్తున్నా రు. నిత్యావసర వస్తువులు, డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెంచి పెనుప్ర జలపై భార మోపారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు సీపీఐ, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

ఆటోలో మహిళ నుంచి బంగారం చోరీ

కురిచేడు, ఫిబ్రవరి 15 : కురిచేడు మండలం ఆవులమంద పంచాయతీ ముష్టగంగవరం గ్రామానికి చెందిన ఉన్నగిరి సౌందర్య ఆటోలో ప్రయాణిస్తుండగా ఆమె వద్ద నుంచి గుర్తు తెలియని మహిళలు బంగారు ఆభరణాలను దొంగతనం చేశారు. సౌందర్య గురువారం మధ్యాహ్నం దర్శి మండలం రాజంపల్లి గ్రామం నుంచి కురిచేడు వరకు బస్‌లో వచ్చి కురిచేడు నుంచి స్వగ్రామం ముష్టగంగవరం గ్రామానికి ఆటోలో వెళ్లింది. బస్ దిగిన సౌందర్య, ఆమె తండ్రి ఆటో ఎక్కారు. అప్పటికే ఆటోలో ముగ్గురు మహిళలు ఉన్నారు. వారితో పాటు సౌందర్య కూర్చొన్నారు. ఆటో వారి గ్రామానికి వెళ్లకుండా వేరే దారిలో వెళ్తుంటే సౌందర్య తండ్రి అలా వెళ్తున్నావేంటి అని అడిగి దారి చెప్తే ఆ విధంగా ఆటో వెళ్లింది. ఇంటి వద్ద దిగాక ఆటో వెళ్లిపోయింది. సాయంత్రం బ్యాగు చూసుకుంటే దానిలోని బంగారం కనపడలేదు. లబోదిబో అంటూ కురిచేడుకు వచ్చి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సౌందర్య వద్ద ఆటోలో దొంగతనం చేసింది పాత నేరస్తుల పనేనని స్థానికుల అభిప్రాయ పడుతున్నారు. సౌందర్యను దొంగలు ఆమె బయలు దేరిన స్థలం నుంచే వెంబడిస్తున్నట్లు సమాచారం. ఆటోలో వారిని మాటల్లో పెట్టి బ్యాగులోని ఆభరణాలను దొంగిలించారు. కురిచేడులోని ప్రధాన వీధుల్లోని షాపుల వద్ద ఉన్న సీసీ కెమెరాలలో ఆటోను గుర్తించారు. మహిళలను కూడా గుర్తించినట్లు సమాచారం. వారు పాత నేరస్తులే అని తెలుస్తున్నది.

మండల సమావేశానికి మొహం చాటేసిన వైసీపీ సభ్యులు

- 10 మంది ఎంపీటీసీలకు గాను ఐదుగురే హాజరు
- మధ్యలో సభ్యులను తీసుకొచ్చి
- సంతకాలు చేయించిన నాయకులు


11.20 గంటల సమయంలో ఎంపీటీసీలు రాక ఖాళీగా ఉన్న కుర్చీలు


బయట రిజిస్టరులో సంతకం చేస్తున్న ఎంపీటీసీ

పీసీపల్లి, ఫిబ్రవరి 15 : కనిగిరి నియోజకవర్గంలో వైసీపీ ఇన్‌చార్జి మార్పు ఆ పార్టీలోని ప్రజా ప్రతినిధులలో మంటలను రేపుతోందా..? మండల సర్వసభ్య సమావేశానికి అధికార పార్టీకి చెందిన ఎంపీటీసీలు రెండు వర్గాలుగా విడిపోయారా..? అంటే అవుననే చెప్పేటందుకు గురువారం పీసీపల్లి మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశం ఉదాహరణగా నిలుస్తోంది. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశపు మందిరంలో ఎంపీపీ అత్యాల జఘన్య అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు ఎంపీడీవో కార్యాలయం నుంచి ముందుగానే సమాచారం పంపించారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం జరుగుతుందని సమాచారం ఇచ్చినా 11.30గంటలకు నేరేడుపల్లి (టీడీపీ), పెదయిర్లపాడు, లక్ష్మక్కపల్లి(ఎంపీపీ), చింతగుంపల్లి ఎంపీటీసీలు మాత్రమే కార్యాలయానికి వచ్చారు. మండల పరిషత్‌లో 10మంది వైసీపీ ఎంపీటీసీ సభ్యులు ఉన్నప్పటికీ సమావేశం మొదలయ్యే సమయానికి ముగ్గురు ఎంపీటీసీ సభ్యులు మాత్రమే వచ్చారు. సమయం మించిపోతుండడంతో ఇన్‌చార్జి ఎంపీడీవో ఎంపీపీతో సమావేశాన్ని ప్రారంభించారు. అయితే అధికార పార్టీకి చెందిన ఎంపీటీసీలందరూ రాకపోవడంతో అప్పటికప్పుడు తత్తరపాటుకు గురైన వైసీపీ నాయకులు పీసీపల్లి, ముద్దపాడు, ఎంపీటీసీ సభ్యులను 12గంటల సమయంలో కార్యాలయానికి తీసుకువచ్చి ఆరోగ్యం బాగాలేదన్న కారణంతో బయటనే రిజిస్టరులో సంతకాలు చేయించారు. ఇదిలావుండగా ఎమ్మెల్యే బుర్రా వర్గానికి చెందిన ఎంపీటీసీలుగా ముద్రపడిన మురుగుమ్మి, పెదఅలవలపాడు, గుదేవారిపాలెం, ప్రాదేశికాలకు చెందిన వైసీపీ ఎంపీటీసీ సభ్యులు ఈ సమావేశానికి హాజరు కాలేదు. సార్వత్రిక ఎన్నికలు మరో రెండు నెలల్లో జరగనున్న తరుణంలో ప్రభుత్వం మారితే మండల పరిషత్ నిధులు వాళ్లు అనుకున్న విధంగా ఖర్చు చేయలేరేమోనని భావించారేమో తెలియదు గానీ కొంతమంది మండల స్థాయి వైసీపీ నాయకులు హడావుడిగా ఈ సమావేశాన్ని నిర్వహించడంపై ప్రతిపక్ష పార్టీలు అధికారుల వ్యవహార శైలిని తప్పుపడుతున్నారు. నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి మార్పుతో ఎంపీటీసీ సభ్యులు, రెండు వర్గాలుగా విడిపోయారని ప్రచారం సాగుతోంది. ఆతరుణంలో కోరమ్ సరిపడదనే కారణంతో మండలంలోని ఓ ప్రాదేశిక ఎంపీటీసీ తాను ఎన్నికైన తరువాత ఒకటి రెండు సమావేశాలు మినహా మండల సర్వసభ్య సమావేశాలలో పాల్గొనని ఓ ఎంపీటీసీకి అన్నివిదాలా మీకు అండగా ఉంటామంటూ హామీ ఇచ్చి ఈ సమావేశానికి తీసుకువచ్చినట్లు ప్రచారం.

సమస్యలు పరిష్కరించని మీటింగ్‌లెందుకు..?

ఈ సమావేశంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు ఆయా శాఖల ప్రగతిని వివరిస్తుండగా మండల కో ఆప్షన్ అబ్దుల్ ఖరీమ్ కలుగజేసుకుని చౌటగోగులపల్లి గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, తాగునీటి సమస్య అధికంగా ఉందని పంచాయతీ అధికారులు సమస్యలు పరిష్కరించడంలేదంటూ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. గతంలో జరిగిన సమావేశాల్లో గ్రామంలోని పలు సమస్యలు సమావేశం దృష్టికి తీసుకువచ్చినా ఇప్పటి వరకు పరిష్కారం కాలేదన్నారు. గ్రామంలోని సమస్యలను పరిష్కరించనప్పుడు సమావేశం నిర్వహించి తమను ఎందుకు ఆహ్వానిస్తున్నారంటూ ప్రశ్నించారు. అందుకేగా సర్పంచ్‌లు కూడా హాజరు కాలేదన్నారు. దీంతో ఎంపీపీ జ ఘన్య కలగజేసుకుని సర్పంచ్‌ల గురించి నీకెందుకు నీ సమస్య ఏమిటో చెప్పు అన్నారు. సమస్యలు చెప్పడమే తప్పయితే మేమెందుకు రావడమంటూ కో ఆప్షన్ ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో రమణారెడ్డి, తహసీల్దార్ పద్మావతి, జడ్పీటీసీ సభ్యుడు లక్ష్మీకాంతం, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



తెనాలి: భారీగా నిలిచిపోయిన ట్రాఫిక్



సీఎం సభకు బస్సులు వెళ్లడంతో నిర్మానుష్యంగా ఉన్న రేపల్లె డిపో

సీఎం సభంటే.. వణికే



వైసీపీ జెండాలతో వెళ్లున్న బాపట్ల ఆర్టీసీ డిపో బస్సు

వస్తావా.. చస్తావా

గుంటూరు సిటీ, పిడుగురాళ్ల: 'ఎంత్రా ఓవర్ యాక్షన్ చేస్తున్నావ్. బస్సు వచ్చి ఎంత సేపైంది.. నువ్వేమన్న కలెక్టర్‌వా.. గంటలు గంటలు బస్సు ఆగడానికి.. మర్యాదగా వచ్చి బస్సెక్కు.. పిచ్చి పిచ్చి కలలు పడ్డావంటే ఉన్న ఉద్యోగం పోతుంది.. గంజాయి కేసులో పెట్టిస్తా నా కొ..' అంటూ వలంటీర్‌పై అధికార పార్టీ నేత బూతు పురాణమిది. గురువారం ఫిరంగిపురంలో జరిగే వలంటీర్ల అభినందన సభకు వలంటీర్ల తరలింపులో అధికార పార్టీ నేతలు అవలంబించిన తీరికిదో నిదర్శనం. వలంటీర్లందరూ రావాల్సిందే. సభకు ఏ ఒక్క వలంటీర్ కూడా మిస్‌కాకూడదు.. అంటూ వాట్సాప్ గ్రూపుల్లో మెసేజ్‌లు, ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ చేయగా, వైసీపీ నేతలు ఎలాగైనా వారిని తీసుకెళ్లేందుకు చేయని ప్రయత్నం లేదు. జ్వరంతో బాధపడుతున్నా, సొంతింట్లో శుభకార్యం ఉందని చెప్పినా సరే ఎట్టి పరిస్థితుల్లోనూ సభకు రావాల్సిందేనంటూ హుకుం జారీ చేశారు. సీఎం జగన్ సభకు తప్పనిసరిగా రావాలని వలంటీర్లపై అధికార పార్టీ నేతలు నానా రకాలుగా ఒత్తిడి చేశారు. వలంటీర్లను తీసుకువచ్చే బాధ్యతను సచివాలయ కార్యదర్శికి అధికారులు అప్పగించారు. ఎవరు కార్యక్రమానికి వస్తున్నారు.. ఎవరు వెనకడుగు వేస్తున్నారు.. అన్న దానిపై సచివాలయ కార్యదర్శులు వివరాలు సేకరించారు. అయినా చాలామంది పెద్దగా ఆసక్తి ప్రదర్శించలేదు. ఈ పరిస్థితుల్లో వలంటీర్లను సీఎం సభకు తరలించే బాధ్యత ను ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, అధికార పార్టీ నేతలు నెత్తికి ఎత్తుకున్నారు. మొదట నయాన, భయాన చెప్పి చూసినా వలంటీర్లు వెళ్లేందుకు ససేమిరా అనడంతో నేతలు బూతుల పంచాంగంతో బెదిరింపు లకు దిగారు. సభకి రాకపోతే ఉద్యోగం పోతుంది.. అంతటితో ఆగము.. ఇంకా చాలా జరుగుతాయి అంటూ పలు ప్రాంతాల్లో బెదిరించారు. ప్రత్తిపాడు, బాపట్ల, తెనాలి, వేమూరు, పొన్నూరు, గుంటూరు-2, సత్తెనపల్లి, పెదకూరపాడు, నరసరావుపేట, గురజాల తదితర నియోజకవర్గాల్లో ఎక్కువ మంది వలంటీర్లు సభలో పాల్గొనేందుకు వెనకడుగు వేసినట్లు తెలుస్తోంది. ఉదయం 7 గంటలకే ఆయా ప్రాంతాలకు బస్సులు వెళ్లాయి. అయినా ఉదయం 11 గంటలు దాటినా చాలామంది వలంటీర్లు బస్సులు ఎక్కక పోవడంతో స్థానిక వైసీపీ నేతలు బూతుపురాణాలు లంకించుకున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో వలంటీర్లను తరలించే కార్యక్రమాన్ని నేరుగా ఎమ్మెల్యేలు పర్యవేక్షించారు. కొందరితో ఎమ్మెల్యేలే ఫోన్‌లో మాట్లాడి సభకు వెళ్లాలని చెప్పినట్లు తెలుస్తోంది.

ఎంత బెదిరించినా సగమే హాజరు

సీఎం సభకు రావాలని వైసీపీ నేతలు చేసిన ప్రయత్నాలు, బెదిరింపులను చాలా మంది పెద్దగా పట్టించుకోలేదు. సగానికి తక్కువ మందే సీఎం సభకు వెళ్లినట్లు తెలుస్తోంది. చాలా మంది తాము బయట ఉన్నామంటూ డుమ్మా కొట్టారు. నేతల ఒత్తిడి తాళలేక ఫిరంగిపురం వచ్చినా చాలామంది బస్సుల్లోనే కూర్చుండిపోయారు.

సచివాలయం మూత

పేరుకు వలంటీర్లుకు వందన కార్యక్రమం అయినా ఉమ్మడి గుంటూరు జిల్లాలోని సచివాలయాలన్నీ మూత పడ్డాయి. సచివాలయంలోని ఉద్యోగులందరూ సీఎం సభకు రావాలని అధికారులు ఆదేశించారు. దీంతో సచివాలయాలకు తాళాలు పడ్డాయి. ఊర్లకు వచ్చిన బస్సులు ఖాళీగా వెళ్లకుండా సచివాలయ ఉద్యోగులతో మీటింగ్ ప్రదేశానికి చేరుకున్నాయి.

- బస్సులన్నీ జగన్ సభ కేటాయింపు
- సర్వీసులు లేక ప్రయాణాలకు ఇక్కట్లు
- అన్ని డిపోల నుంచి ఫిరంగిపురానికి తరలింపు
- ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి 400 కేటాయింపు
- బస్సులను దారిమళ్లించి అదనపు చార్జీ వసూళ్లపై గగ్గోలు
- తెనాలి - గుంటూరు రోడ్డుపై ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం
- బెదిరించి ఫిరంగిపురం సభకు తరలింపుపై వలంటీర్ల ఆవేదన

గుంటూరు, బాపట్ల, రేపల్లె, ఫిబ్రవరి 15: ముఖ్యమంత్రి జగన్ సభ అంటే ప్రజలు వణికిపోయే పరిస్థితి వస్తోంది. సామాన్యులను గమ్యస్థానాలకు చేర్చాల్సిన ఆర్టీసీ సీఎం జగన్ సేవలో తరిస్తోంది. ముఖ్యమంత్రి సభ అంటే చాలు ఆర్టీసీ డిపోలు ఖాళీ అవుతుండగా.. ప్రయాణాలకు సామాన్యులు అల్లాడిపోతున్నారు. డిపోల్లో బస్సులన్నింటినీ సీఎం సభకు కేటాయించడం పరిపాటిగా మారింది. సీఎం సభ అంటే చాలు బస్సులన్నింటినీ కేటాయిస్తుండటంతో సామాన్య ప్రయాణికులకు ప్రయాణ కష్టాలు తప్పడంలేదు. దీనిపై ఎన్ని విమర్శలు వచ్చిన మా తీరు మారదు.. అన్నట్లుగా ఆర్టీసీ అధికారులు వ్యవహరిస్తున్నారు. గురువారం ఫిరంగిపురంలో వలంటీర్లకు అభినందన పేరుతో నిర్వహించిన సభకు ముఖ్యమంత్రి జగన్ హాజరయ్యారు. ఈ క్రమంలో సభను విజయవంతం చేసేందుకు పెద్దసంఖ్యలో వలంటీర్లను తరలించారు. ఇందుకోసం సచివాలయాల వారీగా బస్సులను ఏర్పాటు చేశారు. దీంతో డిపోలన్నీ కూడా బస్సులు లేక వెలవెలపోయాయి. ప్రయాణాలకు సిద్ధమై వచ్చిన వారు డిపోల వద్ద గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఇంతకాలం సీఎం సభ అంటే ప్రయాణాలకు సామాన్యులు ఇబ్బంది పడగా గురువారం పలు రూట్లలో వాహనాల దారి మళ్లింపు కారణంగా దూరం పెరిగి ఆ మేర ఆర్టీసీ ప్రయాణికుల నుంచి అదనపు చార్జీలు వసూలు చేసి వారి జేబులకు చిల్లుపెట్టారు. సీఎం సభ కోసం ఉమ్మడి జిల్లా నుంచి 400 బస్సులను ఆర్టీసీ యాజమాన్యం ఏర్పాటు చేసింది. ఉమ్మడి జిల్లాతో పాటు కృష్ణా జిల్లా నుంచి కూడా మరో 60 నుంచి 70 సర్వీసులు రప్పించారు. ఆర్డినరీ బస్సులు లేక గుంటూరు-విజయవాడ, గుంటూరు-పర్చూరు, గుంటూరు-బాపట్ల ప్రాంతాల వరకు అనేక ఇబ్బందులు పడ్డారు. విజయవాడ రూట్‌లో అయితే ఆర్డినరీ సర్వీసులు లేక నాన్ స్టాప్ సర్వీసులు ఎక్కి మధ్యలో ఆపాలని ప్రయాణికులు కొందరు సిబ్బందితో వాగ్వాదాలు కూడా జరిగినట్లు సమాచారం. డిపోల నుంచి పెద్ద సంఖ్యలో బస్సులు సీఎం సభకు పెట్టడంతో రోజువారి ప్రయాణికులు బస్సుల కొరతతో ఇబ్బందులు పడ్డారు. కొంతమంది ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి అధిక చార్జీలు చెల్లించి ప్రయాణించాల్సి వచ్చింది. రేపల్లె డిపో నుంచి బస్సులతో పాటు విద్యా సంస్థల బస్సులు కూడా వలంటీర్ల సభకు తరలి వెళ్ళాయి. ఇక్కడ బస్సులే కాక కాకినాడ డిపోకు చెందిన బస్సులను కూడా తెప్పించి తీర ప్రాంత గ్రామాల నుంచి వైసీపీ నాయకులు, కార్యకర్తలను పెద్దఎత్తున సీఎం సభకు తరలించారు. సీఎం సభకు బాపట్ల డిపోలో 27 బస్సులు ఉండగా 20 బస్సులను కేటాయించారు. తెనాలి నుంచి మరో నాలుగు బస్సులు తెప్పించారు. దీంతో ఆర్టీసీ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. బస్సులు లేక ఆటోలు, ఇతర వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చింది.

నిలిచిన ట్రాఫిక్

తెనాలి రూరల్: ఫిరంగిపురం వద్ద ఏర్పాటు చేసిన సీఎం సభకు వలంటీర్లను తరలించే బస్సుల కారణంగా ఆయా మార్గాల్లో ఎక్కడికక్కడ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయంతో ప్రయాణికులకు నరకం కనిపించింది. తెనాలి మండలం అంగలకుదురు- సంగంజాగర్లమూడి మధ్యలో బస్సుల్లో వెళ్లే వారికి విందు ఏర్పాటు చేశారు. ఆయా వాహనాలను రద్దీగా ఉండే ప్రధాన రోడ్డుపై నిలిపివేశారు. దీంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు గంటల తరబడి తీవ్ర అంతరాయం ఏర్పడింది. దాదాపుగా రెండు కిలోమీటర్లకు పైగా వాహనాలు నిలిచిపోయాయి. ప్రధాన మార్గంలో వాహనాలను నిలిపి దర్జాగా విందు చేయడం ఏమిటో.. ఎప్పుడు చూడలేదని వాహనదారులు మండిపడ్డారు. గంటల తరబడి ట్రాఫిక్ నిలిచి పోవడంతో అంబులెన్స్‌లు సైతం వేచి ఉండక తప్పలేదు. తెనాలి రూరల్ ఎస్ఐ కోటేశ్వరరావు సిబ్బందితో వచ్చి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. పోలీసులు 30 నిమిషాలు ప్రయత్నిస్తే కానీ వాహనాలు ముందుకు కదలలేదు. పొలాల్లో భోజనాలు చేయడంతో పంటలు దెబ్బతింటాయని చెబుతున్నా పట్టించుకోలేదని కొందరు రైతులు వాపోయారు.



పల్నాడు జిల్లా దొండపాడు నుంచి సగం మంది వలంటీర్లే వెళ్లినట్టు ఉన్న హాజరు షీట్

దూరం.. భారం

గుంటూరు: సీఎం జగన్ సభ అంటే ఆర్టీసీ ప్రయాణికులకు మొన్నటి వరకు ప్రయాణ కష్టాలు ఉండేవి. తాజాగా ప్రయాణంతో పాటు జేబులకు చిల్లు పడింది. సీఎం సభ పేరుతో ఆర్టీసీ బస్సులను దారి మళ్లించి ఆ పెరిగిన దూరం మేర ప్రయాణికుల నుంచి అదనపు చార్జీలు వసూలు చేశారు. ఫిరంగిపురంలో గురువారం జరిగిన జగన్‌సభ కారణంగా గుంటూరు నుంచి నరసరావుపేట, వినుకొండ వైపు నకు వెళ్లే వాహనాలను పేరేచర్ల, సత్తెనపల్లి, ముప్పాళ్ల మీదగా నరసరావుపేటకు, అలానే గుంటూరు నుంచి యడ్లపాడు, చిలకలూరిపేట, నరసరావుపేట మీదగా వినుకొండకు దారి మళ్లించారు. ఈ క్రమంలో ఆర్టీసీ బస్సులను కూడా ఆయా రూట్లలో తిప్పారు. ఇదే అదునుగా పెరిగిన దూరం భారాన్ని ప్రయాణికుల నెత్తిన వేసే పథకాన్ని ఆర్టీసీ అమలుచేసింది. సాధారణంగా నరసరావుపేట నుంచి గుంటూరు నాన్‌స్టాప్ సర్వీసుకు రూ.85 వసూలు చేస్తారు. గురువారం మారిన రూట్ ప్రకారం బస్సు ఎక్కిన వారినుంచి రూ.110 ఛార్జీ వసూలు చేశారు. అలానే ఆర్డినరీ సర్వీసు సాధారణ రోజుల్లో రూ.55 వసూలు చేస్తుండగా గురువారం రూ.60 వసూలుచేశారు. ఇక వినుకొండ నుంచి గుంటూరుకు సాధారణ రోజుల్లో ఎక్స్‌ప్రెస్ రూ.125 ఉండగా గురువారం రూ.140 వసూలు చేశారు. సీఎం సభ కోసం బస్సులను దారి మళ్లించి ప్రయాణ సమయాన్ని పెంచడమే కాక అదనపు బాదుడుతో జేబులకు చిల్లు పెట్టడంపై ప్రయాణికులు గగ్గోలు పెట్టారు. ఇదేం బాదుడని సిబ్బందిని ప్రశ్నించడంతో చిన్నపాటి వాగ్వాదాలు కూడా చోటు చేసుకున్నాయి.

దూరం పెరగటంతో తప్పలేదు..

సీఎం సభ కోసం రూట్ మళ్లింపుతో 15 నుంచి 16 కిలోమీటర్ల వరకు దూరం పెరిగింది. దానికి అనుగుణంగా కిలోమీటర్ల వార ఛార్జీ పెంచాల్సి వచ్చింది. ఒకటి, రెండు కిలోమీటర్లు ఉంటే పెద్ద పట్టించుకునే వాళ్లం కాదు. దూరం ఎక్కువగా పెరగడంతోనే టిక్కెట్ రేటు పెంచాల్సి వచ్చింది.

- పల్నాడు డీపీటీవో శ్రీనివాస్



రేపల్లె: బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

టీడీపీలోకి బాచిన

- బెడిసికొట్టిన వైవీ సుబ్బారెడ్డి వ్యూహం
- చంద్రబాబును కలిసిన వైసీపీ నేత చైతన్య
- పసుపు కండువా కప్పుకున్న సంతమాగులూరు నేతలు

అద్దంకి, బాపట్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పాలకపార్టీ విధానాలపై రగిలిపోతున్న అద్దంకి వైసీపీ నేత, శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య ఆయన తండ్రి మాజీ ఎమ్మెల్యే గరటయ్యలు గురువారం టీడీపీ అధినేత చంద్రబాబుతో భేటీ అయ్యారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో వీరి కలియక జరిగింది. ఈ సమయంలో సంతమాగులూరు మండలం మాజీ ఎంపీపీ, వైసీపీ రాష్ట్ర కార్యదర్శిగా ఇటీవల వరకు ఉన్న అట్ల చినవెంకటరెడ్డితో పాటు ప్రస్తుత ఎంపీపీ యలమంద ఆ మండల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

అభిప్రాయం చెప్పినందుకు వేధింపులు

అద్దంకి వైసీపీ ఇన్‌చార్జిగా దాదాపు నాలుగేళ్ల పాటు శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య వ్యవహరించారు. ఇటీవల అధిష్ఠానం చేపట్టిన మార్పుల్లో భాగంగా పల్నాడు జిల్లాకు చెందిన హనిమిరెడ్డిని ఇన్‌చార్జిగా నియమించడాన్ని చైతన్య తీవ్రంగా వ్యతిరేకించారు. ఆ తర్వాత పార్టీ పెద్దలను పలుమార్లు కలిసి తాను పార్టీ కోసం కష్టపడ్డానని, తననే కొనసాగించాలని అభ్యర్థించారు. అయినా అటు వైపు నుంచి కదలిక లేకపోగా పార్టీ నిర్ణయాన్ని ధిక్కరిస్తే చర్యలు తప్పవని సంకేతాలు పంపారు. ఈ క్రమంలోనే ఆయనకు చెందిన గ్రానైట్ ఫ్యాక్టరీపై అధికారులను దాడులకు వైసీపీ ఉసిగొల్పింది. ఈ పరిణామాల నేపథ్యంలోనే కృష్ణ చైతన్యతో పాటు ఆయన తండ్రి, గరటయ్య చంద్రబాబుతో భేటీ అవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

అంతా బాలినేని వర్గమే...

అట్ల చినవెంకటరెడ్డితో పాటు ఆయన వర్గం తొలి నుంచి ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన మాజీ మంత్రి బాలినేని మద్దతుదారులుగా ఉంటూ వస్తున్నారు. అద్దంకిలో ఇటీవల జరుగుతున్న పరిణామాలపై వారు ఉక్కపోత ఎదుర్కొంటున్నారు. దీంతో ఆయన పార్టీ మారడానికి కొన్ని రోజుల క్రితమే అద్దంకి ఎమ్మెల్యే రవికుమార్‌ను కలిసి మద్దతు ప్రకటించారు. చేరికలను ఆపడానికి తాడేపల్లి పెద్దలు మాజీ మంత్రి బాలినేని సాయాన్ని కూడా అభ్యర్థించారనే ప్రచారం అప్పట్లో వచ్చింది. ఈ ప్రయత్నం కూడా బెడిసికొట్టడంతో వారిపై కూడా కక్షసాధింపులకు దిగారు. అంతిమంగా తన అనుచరులతో కలిసి చిన వెంకటరెడ్డి చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. జగన్ చిన్నాన్న వైవీ సుబ్బారెడ్డి సిఫారసుతోనే అద్దంకి వైసీపీ ఇన్‌చార్జిగా హనిమిరెడ్డిని అధిష్ఠానం నియమించిందనేది బహిరంగ రహస్యం. ఈనిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన మాజీ మంత్రి బాలినేని చైతన్యకు మద్దతుగా ఒకట్రెండు సార్లు పార్టీ పెద్దలను కూడా కలిశారు. అద్దంకిలోని క్షేత్రస్థాయి పరిస్థితుల పై సీఎం జగన్‌ను సుబ్బారెడ్డి పక్కదారి పట్టించడం ఇన్‌చార్జి మార్పు నిర్ణయం జరిగిందనే అంచనాకు సైతం చైతన్య వచ్చారు. అప్పటి నుంచి పరోక్షంగా ఆయన తన అసంతృప్తిని వెళ్లగక్కుతూనే వస్తున్నారు. ప్రస్తుతం చైతన్య చంద్రబాబును కలవడంతో ఆయన టీడీపీలో చేరడం ఇక లాంఛనమేనని తెలుస్తోంది. సంతమాగులూరు మండలానికి చెందిన కీలక నేతలు పెద్ద సంఖ్యలో వైసీపీని వీడి టీడీపీలో చేరడంతో వైసీపీ రాజకీయ వ్యూహం వికటించినట్లైంది.

దర్శి సీటు పైనే చర్చ..

కృష్ణచైతన్య మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అవడంతో రాజకీయ సమీకరణాలు మారనున్నాయి. ఆయన ప్రకాశం జిల్లాలోని దర్శి సీటు ఆశిస్తున్నారని, అదే విషయాన్ని టీడీపీ అధినేత ముందుంచారని తెలుస్తోంది. గురువారం మర్యాదపూర్వకంగా భేటీ అయినప్పటికీ త్వరలోనే తన అనుచరులతో కలిసి టీడీపీలో చేరనున్నారని సమాచారం.



చంద్రబాబుతో శాప్‌నెట్ చైర్మన్ చైతన్య, ఆయన తండ్రి, మాజీ ఎమ్మెల్యే గరటయ్య



చంద్రబాబుతో అట్ల చినవెంకటరెడ్డి వర్గీయులు

రేపే.. రా.. కదలిరా

- ఇంకొల్లులో భారీగా ఏర్పాట్లు
- 25 ఎకరాల విస్తీర్ణంలో బహిరంగసభ
- ప్రాంగణానికి తారకరామ విజయభేరిగా నామకరణం
- నియోజకవర్గ నేతలతో ఏలూరి సన్నాహక సమావేశం
- పోలీసులను ప్రయోగించి అవాంతరాలకు ప్రభుత్వం కుట్ర

ఇంకొల్లు/బాపట్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా రా.. కదలి రా అంటూ టీడీపీ శ్రేణులు సిద్ధమవుతున్నారు. రా.. కదలిరా అంటూ టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లోక్‌సభ స్థానాల వారీగా బహిరంగ సభలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా బాపట్ల లోక్‌సభ స్థానంలోని పర్చూరు నియోజకవర్గ పరిధి ఇంకొల్లులో శనివారం సభ నిర్వహించనున్నారు. దాదాపు 25 ఎకరాల స్థలంలో ఏర్పాట్లను భారీఎత్తున చేస్తున్నారు. సభా ప్రాంగణానికి తారకరామ విజయ భేరిగా నామకరణం చేశారు. ఈ ఇప్పటికే భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. హెలిపాడ్ స్థలం, పవర్‌రోలర్‌తో ప్రాంగణం అంతా గట్టి చేసే పనులు జరుగుతున్నాయి. 40 అడుగుల వెడల్పు, 60 అడుగుల పొడవుతో సభా స్టేజి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. వాహనాలను పార్కింగ్‌కు ఆరెకరాల భూమిని చదును చేశారు. స్థానిక నాయకులు పాలేరు రామకృష్ణ, డాక్టర్ శ్యాం, బత్తుల శ్రీనివాసరావు, కరి శ్రీను, వడ్లమూడి సాంబయ్య, శ్రీహరి, రంగయ్య, పొద వీరయ్య, ఫారూక్, చైతన్య, బోడావుల శివయ్య ప్రాంగణంలో పనులు పర్యవేక్షిస్తున్నారు.

అడ్డంకులపై నేతల ఆగ్రహం

బాపట్ల లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నేతలతో పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సన్నాహక సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. శ్రేణులను సభకు సమాయత్తం చేయడంలో ఆయా నియోజకవర్గాలలో కూడా నాయకులు సమావేశాలు నిర్వహిస్తున్నారు. మరోవైపు సభాస్థలికి అనుమతులు లేవని ప్రభు త్వం పోలీసులను ప్రయోగించి ఏదోవిధంగా అవాంతరాలు సృష్టించే కార్యక్రమం చేస్తూనే ఉంది. రా.. కదలిరా సభకు తరలివచ్చేవారిని అడ్డుకునేందుకు ప్రభుత్వం కుట్రలు చేస్తున్నట్లు ఆరోపణలు న్నాయి. అయినా ఎట్టి పరిస్థితుల్లో తగ్గేదేలే అన్నట్లుగా టీడీపీ శ్రేణులు ప్రణాళికలు రూపొందించుకుంటున్నాయి. బుధవారం రాత్రి సభా ప్రాంగణానికి వచ్చి అనుమతులు లేవని హడావిడి చేసిన పోలీసులు దానిని గురువారం ఉదయం కూడా కొనసాగిం చారు. సభ నిర్వహిస్తున్న స్థలం దేవదాయశాఖదని, సదరు విభాగం అనుమతులు తీసుకోలేదని తమకు ఫిర్యాదు చేసిందని పోలీసులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో గురువారం ప్రాంగణానికి చేరుకున్న పర్చూరు, అద్దంకి ఎమ్మెల్యేలు సాంబశివరావు, గొట్టిపాటి రవి కుమార్ ప్రభుత్వ పెద్దల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భూమి దేవదాయశాఖదే అయినా దానిని సాగుచేసే రైతులు స్వచ్ఛందంగా ఇచ్చారని ఎమ్మెల్యే ఏలూరి తెలిపా రు. ఆ భూమికి మరో ఏడాది వరకు లీజు అగ్రిమెంట్లు ఉన్న సమ యంలో పోలీసులు ఎలా అడ్డుకుంటారని నిలదీశారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా శనివారం చంద్రబాబు హాజర య్యే రా.. కదలిరా సభను విజయవంతం చేసి తీరుతామని ఎమ్మెల్యేలు గొట్టిపాటి రవి, అనగాని సత్యప్రసాద్ తెలిపారు. అధికారం అండతో సభను అడ్డుకోలేరని, కుట్రలు మానుకోకుంటే ప్రజాక్షేత్రంలో తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. వచ్చే లక్షల మందికి ఎటువంటి అసౌకర్యాలు లేకుండా ఏర్పాటుచేసే పనిలో ఉన్నామని, ఎటువంటి అవాంతరాలు లేకుండా యంత్రాంగం, అధికారులు సహకరించి సభ విజయవంతం చేయడానికి సహకరించాలన్నారు.



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు సాంబశివరావు, రవికుమార్



ప్రాంగణం పక్కనే హెలిప్యాడ్ కోసం ఏర్పాట్లు

కేసు పెడతారంట



రా.. కదిలిరా సభకు ఇష్టపూర్వకంగానే పొలం ఇచ్చాను. దానికి అంగీకార పత్రం ఇచ్చాను. దేవదాయశాఖ అధికారులు ఫోన్ చేసి కేసు పెడతామని బెదిరించారు. ఎవరు నన్ను భయపెట్టి ఇవ్వద్దని చెప్పినా నిర్ణయం మారదు. ప్రజల కోసం చంద్రబాబు వస్తుంటే అడ్డంకులు పెట్టడం సరికాదు.

- కరి వీరనారాయణ, రైతు



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఉద్యోగుల ఆందోళన బాట

- జేఏసీ ఇచ్చిన పిలుపుమేరకు జిల్లావ్యాప్తంగా నిరసనలు
- కలెక్టరేట్ ఎదుట డిమాండ్లు పరిష్కరించాలంటూ నినాదాలు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 15: తమ ఆర్థిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయులు జిల్లావ్యాప్తంగా ఆందోళనలు చేపట్టారు. ఏపీ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లావ్యాప్తంగా గురువారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనలు తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు ఒక చోటకు చేరి ప్రధాన డిమాండ్లను పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. జేఏసీ జిల్లా చైర్మన్ కూచిపూడి శరత్‌బాబు నాయకత్వంలో కలెక్టరేట్ ఎదుట వందలాది మంది ఉద్యోగులు నిరసన తెలిపారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత డీఏలు, సరెండర్ లీవ్‌లు, ఏపీజీఎల్ఐ, జీపీఎఫ్ రుణాలు రాక ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వం ఇదే విధానాలను అవలంబిస్తే రానున్న రోజుల్లో ఉద్యమాన్ని ఉధృతం చేయాల్సి వస్తోందని హెచ్చరించారు. కాగా ఆయా ఉద్యోగ సంఘాల నాయకులు తమ తమ కార్యాలయాల నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు తరలివచ్చారు. కార్యక్రమంలో కొత్తపల్లి మంజేష్, శివకుమార్, ఏడుకొండలు, కిషోర్, షరీఫ్, మాధవి, కోటేశ్వరమ్మ, విజయ్. సునీల్, లక్ష్మీనారాయణ , అమ్మయ్య, సాగర్‌రెడ్డి, పెన్షనర్ల సంఘం నాయకుడు అంకిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా డాక్టర్ పద్మజ

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 15 : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఇన్‌చార్జీ అధికారిగా డీఐఓ డాక్టర్ పద్మజను నియమించారు. ఇక్కడ డీఎంహెచ్‌ఓగా పనిచేస్తున్న డాక్టర్ రాజ్యలక్ష్మీ అనారోగ్య సమస్యలతో ఈనెల 26వతేదీ వరకు సెలవు పెట్టారు. దీంతో ఇన్‌చార్జీ డీఎంహెచ్‌ఓగా డాక్టర్ పద్మజను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈనెల 27న డాక్టర్ రాజ్యలక్ష్మీ తిరిగి విధుల్లో చేరనున్నారు.

నేడు గ్రామీణ భారత్ బంద్

వామపక్షాల మద్దతు, ఒంగోలులో భారీ ర్యాలీ

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 15: కేంద్రంలోని ప్రధానమంత్రి మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జిల్లావ్యాప్తంగా శుక్రవారం గ్రామీణ భారత్‌బంద్, పారిశ్రామిక సమ్మె నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా, కార్మికసంఘాల ఐక్యవేదికల ఆధ్వర్యంలో ఒంగోలులో భారీ ప్రదర్శనను నిర్వహించనున్నారు. రైతుల పట్ల కేంద్రం అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ చేపట్టిన గ్రామీణ బంద్‌కు వామపక్షాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. దీంతో జిల్లావ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించేందుకు ఆయా సంఘాల నాయకులు ఏర్పాట్లు చేశారు. ఒంగోలులో స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద నుంచి భారీ ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శన ఆర్టీసీ బస్టాండు, అద్దంకి బస్టాండు, బాపూజీ కాంప్లెక్స్, ట్రంకురోడ్డు మీదుగా కలెక్టరేట్ వరకు నిర్వహించనున్నారు. అనంతరం అక్కడ సభ నిర్వహించనున్నారు. ఈ గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెలో అన్నివర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు చుండూరి రంగారావు కోరారు.

సమష్టిగా కృషితో సత్ఫలితాలు

వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్



మద్దతు తెలిపినవారితో మాట్లాడుతున్న వెంకటేష్

చీరాల, ఫిబ్రవరి 15: నియోజకవర్గంలో ఎక్కడ ఏ సమస్య వచ్చినా ఆ సమస్యను పరిష్కరించకుందాం. భవిష్యత్‌పై ఆశలు పెంచుకుందాం. అందుకు అనుగణంగా అడుగులు వేద్దామని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. గురువారం నియోజకవర్గ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. అ క్రమంలో కరణం వెంకటేష్ భవిష్యత్ కార్యాచరణపై తన సందేశాన్ని వినిపించారు. అందుకు అనుగుణంగా ప్రతి ఒక్కరం అడుగులు వేస్తామని హాజరైన వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

చీరాల, ఫిబ్రవరి 15 : వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని డీటీవో సురేష్ అన్నారు. స్థానిక లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయం వద్ద గురువారం జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమానికి స్థానిక ఎంవీఐ రామకృష్ణారెడ్డితో కలసి ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మ కంటి వైద్యశాల నిర్వాహకులు డాక్టర్ వరికూటి అమృతపాణి పర్యవేక్షణలో ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. అసోసియేషన్‌లోని సభ్యులకు నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీవో సురేష్, ఎంవీఐ రామకృష్ణారెడ్డిలు మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. అతి వేగం ప్రమాదకరమన్నారు. అంతిమంగా వాహనచోదకులు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నరేంద్ర, డాక్టర్ శ్వేత, లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైసీపీ పర్చూరు ఎపిసోడ్‌కు తెరపడేనా..?

- అమెరికా నుంచి ఇండియా వచ్చిన యడం బాలాజీ
- నేడు సీఎం జగన్‌తో అపాయింట్‌మెంట్
- గురువారం ఎమ్మెల్యే బలరాంతో సుదీర్ఘ మంతనాలు

చీరాల,ఫిబ్రవరి 15 : పర్చూరు వైసీపీలో అనిశ్చితికి నేడు తెరపడే అవకాశం కనిపిస్తోంది. గత కొద్దిరోజులుగా ప్రస్తుత వైసీపీ పర్చూరు నియోజవకర్గ ఇన్‌చార్జి ఆమంచి ఆడుతున్న దాగుడు మూతలకు బ్రేక్ పడనుందని శ్రేణులు అంటున్నారు. వైసీపీ పాత కాపు యడం బాలాజీ గురువారం ఇండియా వచ్చారు. అనంతరం కొందరు ముఖ్యులను కలిశారు. అందులో భాగంగా చీరాల నియోజకవర్గ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తిని కూడా కలిశారు. ఆ క్రమంలో వారి మధ్య ప్రస్తుత, భవిష్యత్ రాజకీయాలపై చర్చ జరిగినట్లు సమాచారం. పర్చూరు, చీరాల నియోజకవర్గాల్లో ఆమంచి అనుసరిస్తున్న వైఖరిపై అధిష్టానం ఒక అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. ఆమంచి చీరాల నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానని ఎప్పుడైతే ప్రకటించారో జగన్‌రెడ్డి దృష్టి సారించారు. అందులో భాగంగా ఒకటికి నలుగురి పేర్లను పరిశీలించారు. మొదటి నుంచి జగన్ పర్చూరు నియోజకవర్గంలో కాపు సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని బరిలో దింపాలన్న ఆలోచనలో ఉన్నారు. ఈ క్రమంలో ఆమంచిని పర్చూరు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. ఇటీవల ఆమంచి తాను చీరాల నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానని చెప్పిన క్రమంలో అధిపలుమార్లు ఆమంచితో మాట్లాడినా ఎలాంటి మార్పు లేదు. అంతిమంగా గతంలో వైసీపీ అభ్యర్థిగా చీరాల నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ఎన్ఆర్ఐ యడం బాలాజీ పేరును తుదిగా పరిశీలనలోకి తీసుకుంది. అందుకు అనుగుణంగా అమెరికాలో ఉన్న బాలాజీకి వైసీపీ నుంచి ఆహ్వానం వెళ్లింది. శుక్రవారం సీఎం జగన్‌ను కలవాలనేది ఆ ఆహ్వాన సారంశం. ఈ క్రమంలో బాలాజీ గురువారం ఇండియా వచ్చారు. ముందస్తుగా పలువరు పార్టీ పెద్దలను కలిశారు. అనంతరం చీరాల నియోజకవర్గ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తిని బాలాజీ కలిశారు. వారిద్దరి మధ్య సుదర్ఘీ మంతనాలు జరిగాయి. చీరాల, పర్చూరు నియోజకవర్గాల్లో అనుసరించాల్సిన విధి, విధానాలపై వారిద్దరి మధ్య చర్చ సాగినట్లు తెలిసింది. మొత్తం మీద సీఎం జగన్‌తో జరగనున్న బాలాజీ భేటీలో పర్చూరు ఎపిసోడ్‌కు తెరపడుతుందని శ్రేణులు భావిస్తున్నాయి.

పశ్చిమ పల్లెల్లో దాహం కేకలు..!

- ట్యాంకర్లను నిలిపేసిన ఉన్నతాధికారులు
- వైసీపీ నేతల ట్రిప్పుల కక్కుర్తే కారణం
- నీరు దొరక్క గగ్గోలు పెడుతున్న జనం
- బోర్లలో అడుగంటిన భూగర్భ జలాలు
- నిత్యం రోడ్డెక్కి మహిళల ఆందోళన
- సమస్యను పట్టించుకోని ప్రభుత్వ పెద్దలు
- పలుచోట్ల నీటిని సరఫరా చేస్తున్న టీడీపీ నేతలు



గుండంచర్లలో టీడీపీ సర్పంచ్ సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన నీటి ట్యాంకర్ వద్ద నీళ్లు పట్టుకుంటున్న గ్రామస్థులు



పొదిలి నుంచి మోటార్ బైకులపై నీటిని తీసుకెళ్తున్న ప్రజలు

ఒంగోలు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమ పల్లెల్లో దాహం కేకలు మిన్నంటుతున్నాయి గుక్కెడు నీటి కోసం వందలాది గ్రామాల్లో ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. తాగునీటికే కాక ఇతర అవసరాలకు కూడా నీరు దొరక్క, తల్లడిల్లిపోతున్నారు. నీటి సరఫరా చేయాలంటూ నిత్యం పలు చోట్ల పెద్దఎత్తున ఆందోళనలకు దిగుతున్నారు. నీటి సరఫరాలో స్థానిక వైసీపీ నేతల కక్కుర్తి, ఉన్నతాధికారుల బాధ్యతారహిత్యం ప్రస్తుతం ఈ పరిస్థితికి కారణం. కాగా ప్రభుత్వంలోని పెద్దలు తమకేమి తెలియన్నట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో అనేక గ్రామాల్లో నీటి సమస్య తీవ్ర రూపం దాల్చగా కొన్నిచోట్ల స్థానిక టీడీపీ నేతల చొరవ చూపి సొంత డబ్బులతో నీటి సరఫరా చేస్తున్నారు. మరికొన్నిచోట్ల ప్రజల నుంచి వస్తున్న వత్తిడిని తట్టుకోలేక స్థానిక ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకుంటున్నారు. ఇలాంటి చర్యలు పరిమిత గ్రామాల్లో మాత్రమే కనిపిస్తుండగా తీవ్ర రూపం దాల్చిన నీటి సమస్యపై జిల్లా స్థాయిలోని బాధ్యతగల ప్రజాప్రతినిధులు కానీ, జిల్లా అధికారులు కానీ దృష్టిసారించిన పాపాన పోలేదు. ఫలితంగా రోజురోజుకు సమస్య మరింత తీవ్రరూపం దాల్చుతుండగా ఇలాగే కొనసాగితే రానున్న వేసవిలో తమ పరిస్థితి ఏమిటన్న ఆందోళన పశ్చిమ ప్రాంత ప్రజల్లో వ్యక్తమవుతోంది.

నిత్యం తాగునీటికి సమస్యే

జిల్లాలోని అత్యధిక ప్రాంతాల్లో తాగునీటి వనరులు అంతంతమాత్రం. సాధారణ వాడకం చేసే నీరు కూడా చాలా ప్రాంతాల్లో దొరకని దుస్థితి. ప్రత్యేకించి పశ్చిమ ప్రాంతంలో నీటి ఇక్కట్లు ఏడాది పొడవునా ఉంటాయి. మార్కాపురం, వైపాలెం నియోజకవర్గాలతోపాటు దర్శి, కనిగిరి, గిద్దలూరు నియోజకవర్గాల్లో కొన్నిగ్రామాల్లో భూగర్భజలాలే ఆధారం. వెయ్యి అడుగుల లోతు వరకు బోర్లు వేసి మోటార్లు (డీప్ బోర్లు) పెట్టి వాటి ద్వారా సరఫరా చేస్తుంటారు. వర్షాలు లేకపోతే అవికూడా పనిచేయవు. పొలాలలో ఉండే లేదా ఇతర ప్రాంతాల నుంచి ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలి. వేసవిలో అయితే సమస్య తీవ్రం. పశ్చిమప్రాంతంలోని దాదాపు 400 అవాసాలలో ఇలా ట్యాంకర్లతో నీటి సరఫరా చేయాలి. ఒక్కొక్క ఏడాది ఇందుకోసం రూ.50 కోట్లు కూడా వెచ్చించాల్సి వస్తోంది. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చాక నిధులు ఇవ్వకుండా నీటిని సరఫరా చేసిన వారిని ఇబ్బందులకు గురిచేసింది. అలా 2019 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు సుమారు రూ.137 కోట్ల మేర బకాయిలు పేరుకపోయాయి.

వైసీపీ నేతల కక్కుర్తి

ఈక్రమంలో కొన్నిచోట్ల నీటిని సరఫరా చేసిన కాంట్రాక్టర్లు (వైసీపీ నేతలు) కొంతమేర అవినీతికి పాల్పడ్డారు. ట్రిప్పుల లెక్కలలో తేడాలు చేశారు. సకాలంలో బిల్లులు ప్రభుత్వం నుంచి రాకపోతుండటం, నీటిని తోలే వారంతా వైసీపీ వారే కావడంతో స్థానిక అధికారులు ఏమి అనలేక ఉదాసీనంగా వ్యవహరించారు. చివరకు బిల్లుల కోసం కాంట్రాక్టర్లు రోడ్డెక్కి ఆందోళనలు చేయడం, వైపాలెం నుంచి ప్రాతినిధ్యం వహించిన మంత్రి ఆదిమూలపు సురేష్ పలుమార్లు సీఎంను కలవడం, కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రభుత్వానికి లేఖలు రాయడంతో దాదాపు రూ.70 కోట్లు విడుదలయ్యాయి. ఇంకా రూ.60 కోట్లు పెండింగ్ ఉన్నాయి. కాగా జనవరి ఆఖరు నాటికి కూడా జిల్లాలోని పశ్చిమప్రాంతంలోని 12 మండలాల్లో 82 ఆవాసాలలో ట్యాంకర్లతో నీటి సరఫరా కొనసాగింది. అందులో 43 అవాసాలు వైపాలెం సెగ్మెంట్‌లో, 23 అవాసాలు మార్కాపురం సెగ్మెంట్లో ఉండగా దొనకొండ మండలంలో 11 గ్రామాలు ఉన్నాయి. వేసవి ప్రారంభం అవుతుండగా సమస్య మరిన్ని గ్రామాలకు విస్తరించింది. తదనుగుణంగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలపై ప్రణాళికలు రూపొందించాల్సి ఉంది.

ఉన్నతాధికారుల అనాలోచిత చర్య

ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ స్థాయి ఉన్నతాధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారు. వారి అతి నిర్ణయంతో కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిన చందంతి పరిస్థితి తయారైంది. నీటి సరఫరాలో అవకతవకలు జరిగినట్లు గుర్తించామని, కనుక గ్రామాల్లో నీటి సరఫరా నిలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారి ఆదేశించారు. తదనుగుణంగా ఈనెల 1 నుంచి 82 ఆవాసాలలో ట్యాంకర్లతో నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలకు నీటి ఇక్కట్లు ప్రారంభమయ్యాయి. నీటి ట్యాంకర్ల తోలకంలో అక్రమాలు వాస్తవమే. క్షేత్రస్థాయి అధికారులు, నీటిని తోలే వైసీపీ నేతలు కూడబలుక్కోని చేశారన్నది బహిరంగ సత్యం. దానికి ఏళ్ల తరబడి ప్రభుత్వం బిల్లులు ఇవ్వకపోవడం, ఎప్పుడో నిర్ణయించిన ధరలు వంటి అనేక కారణాలు ఉన్నాయి. ఉన్నతాధికారులు వాస్తవ కారణాలు గుర్తించి అవినీతి, అక్రమాలు నివారించాల్సింది పోయి ఆ పేరుతో అసలు నీటి సరఫరా నిలిపివేతకు ఆదేశించడంతో ప్రస్తుతం పశ్చిమప్రాంత ప్రజలు నీటి కోసం గగ్గోలు పెడుతున్నారు. వైపాలెం, మార్కాపురం, దోర్నాల, పెద్దారవీడు, పుల్లలచెరువు, పొదిలి. కేకేమిట్ల, త్రిపురాంతకం, దొనకొండ మండలాల్లో సమస్య తీవ్రంగా ఉంది. పలు గ్రామాల ప్రజలు నీటి కోసం ఇబ్బందిపడుతూ రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేస్తున్నారు.

టీడీపీ ప్రజాప్రతినిధుల చొరవ

వైపాలెం నుంచి రెండుసార్లు గెలుపొంది, తాగునీటి సమస్య తీవ్రత తెలిసిన మంత్రి సురేష్ ఈసారి కొండపి రాజకీయంలో బిజీగా మారిపోయారు. ఇతర ప్రజాప్రతినిధులు అలాగే ఉన్నారు. కాగా ప్రజల్లో వస్తున్న అలజడి, ఒత్తిడిని తట్టుకోలేక పలు గ్రామాల్లో సర్పంచ్‌లు సొంతఖర్చులతో ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారు. కొందరైతే స్వచ్ఛందంగానే నీరిస్తున్నారు. వైపాలెం మండలంలోని అమనిగుడిపాడులో టీడీపీ సర్పంచ్ రోజుకు 15 ట్యాంకర్లతో సరఫరా చేస్తుండగా పెద్దారవీడు మండలంలోని గుండంచర్లలో సర్పంచ్ రజని తండ్రి రామకృష్ణారెడ్డి చొరవ చూపి ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారు. వైపాలెం మండలంలో మురారిపల్లి, వాదంపల్లి, అయ్యంబోట్లపల్లి గ్రామాల్లో సర్పంచ్‌లు నీరు తోలుతున్నారు. త్రిపురాంతకం మండలం రామసముద్రంలో సర్పంచ్ ఏసోబు చొరవ చూపి బోరు తవ్విస్తుండగా పలు ఇతర గ్రామాల్లో టీడీపీ నేతలు నీటిని సరఫరా చేస్తున్నారు కొన్ని చోట్ల పొలాల్లోని బోర్లకు విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసి స్థానిక ప్రజాప్రజాప్రతినిధులు నీటిని ఇచ్చే ప్రయత్నం చేస్తుండగా ప్రభుత్వ పెద్దలు, జిల్లా అధికారులు మాత్రం స్పందించకపోతుంటడంతో నీటి కోసం పశ్చిమ ప్రజానీకం అల్లాడిపోతున్నారు.

మూడేళ్లుగా ట్యాంకర్లకు బిల్లులు ఇవ్వలేదు

గుండంచర్ల గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైనప్పటి నుంచి గ్రామంలో నీటి సరఫరా కోసం రెండు ట్రాక్టర్ల ద్వారా రోజుకు 15 ట్రిప్పులతో తాగునీటిని సరఫరా చేస్తున్నాం. మూడేళ్ల నుంచి ట్యాంకర్లకు రూపాయి బిల్లు చెల్లించలేదు. ప్రభుత్వం ఇచ్చినా ఇవ్వకపోయినా ప్రజల తాగునీటి ఇబ్బందులను గుర్తించి సొంత నిధులతో ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నాను. కనీసం సమస్య ఉన్న గ్రామాలలో తాగునీటి కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయపోవడం దారుణం.

- ఇండ్ల రామకృష్ణారెడ్డి, గ్రామ సర్పంచ్ తండ్రి

స్థానిక సంస్థలపైనే తాగునీటి సరఫరా భారం

ట్యాంకర్లతో నీటి సరఫరాను ప్రభుత్వం నిలిపివేయడంతో గగ్గోలుపెడుతున్న పశ్చిమప్రాంత ప్రజల సమస్యపై జిల్లా యంత్రాంగం దృష్టిసారించింది. అందుకు అవసరమైన చర్యలను మం డల, గ్రామ పంచాయతీల్లోని 15వ ఆర్థిక సం ఘం నిధుల ద్వారా తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ నిర్ణయంతో అసలే అరకొర నిధుల తో అల్లాడుతున్న స్థానిక సంస్థలకు పెనుభారం కానుంది. ప్రభుత్వం నుంచి ఇప్పుడు నీటి సరఫరాపై స్పష్టత వచ్చే అవకాశం లేకపోవడం, జ నం నీటి కోసం నిత్యం రోడ్డెక్కుతుండటతో జిల్లా యంత్రాంగం ఆ మేరకు చర్యలకు నిర్ణయించినట్లు సమాచారం. అవసరమైన చోట్ల ట్యాంకర్లతోనే సరఫరా చేయాలా లేక ఇతర సౌకర్యాలు ఏమైనా ఉన్నాయా అన్నది పరిశీలించి ని వేదించాలని జేసీ నేతృత్వంలో ప్రత్యేక కమిటీని కలెక్టర్ నియమించారు. కమిటీ పర్యవేక్షణలో ఆ ప్రాంతాల్లో పరిశీలన సాగగా 82 అవాసాలలో 72చోట్ల రవాణా తప్ప మరో మార్గం లేదని నిర్ధారించి నివేదించారు. 70చోట్ల తక్షణం సరఫ రా పునరుద్ధరించడం అవసరంగా ఆర్‌డబ్ల్యూఎ స్ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వానికి ఆ విషయం తెలియజేసి, అక్కడి నుంచి అనుమతులు పొంది నీటి సరఫరా చేయడం అంటే చాలా సమయం పడుతుంది. దీంతో మండల, గ్రామపంచాయతీల్లోని 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. అయితే స్థానిక సంస్థలకు ఇది భారం కానుండగా ఏ మేరకు అమలుచేస్తారో చూడాల్సి ఉంది.

టీడీపీ ప్రభంజనం ఖాయం

- మాజీ ఎమ్మెల్యే, ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర
- పార్టీలోకి వలసల వెల్లువ
- వారం రోజుల్లో 250 కుటుంబాల చేరిక
- వైసీపీని వీడిన పాపిరెడ్డిపల్లి వాసులు



ఉగ్ర సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరిన పాపిరెడ్డిపల్లి గ్రామస్థులు

కనిగిరి, ఫిబ్రవరి 15: కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి రోజు రోజుకు తెలుగు దేశం పార్టీలో చేరికలు వెల్లువలా కొనసాగుతున్నాయి. ఇటీవల వారం రోజులుగా వైసీపీని వీడిన 250 కుటుంబాలు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరారు. గురువారం హనుమంతునిపాడు మండలంలోని పాపిరెడ్డిపల్లి గ్రామంలోని వైసీపీకి చెందిన 35 కుటుంబాలు మండల పార్టీ అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. ఉగ్ర కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో జరిగిన చేరికల కార్యక్రమంలో ఉగ్ర మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో 1983 నాటి ప్రభంజనాన్ని తలదన్నేలా తెలుగుదేశం పార్టీ వి జయం ఉంటుందన్నారు. వైసీపీ పాలనలో ప్రజలు అన్ని విధాలా ఇబ్బందుల పడ్డారన్నారు. పథకాలంటూ బటన్ నొక్కుతూ రవాణా, నిత్యావసర వస్తువులు, ఆయిల్, కరెంట్ చార్జీలు, ఇంటి, చెత్త పన్నుల పేరుతో పేదలను బాదేస్తున్నారన్నారు. ఐదేళ్లు కావస్తున్నా ఏ ప్రాంతంలోనూ అభివృద్ధి చేయని వ్యక్తి జగన్ ఒక్కరే అన్నారు. ఇలాంటి వ్యక్తికి మళ్లీ ఓటేస్తే ఆంధ్రా పరిస్థితి దయనీయంగా మారుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు పాలనలో అభివృద్ధి ఫలాలు ప్రజలు అందుకున్నారన్నారు. మళ్లీ ఆయన సీఎంగా వస్తేనే రాష్ట్రం బాగుపడుతుందని, మా బతుకులు చక్కబడతాయని ప్రజలు గట్టిగా నమ్ముతున్నారన్నారు. వైసీపీ పాలనతో విసిగిపోయిన ఎంతో మంది చంద్రబాబును నమ్మి తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారన్నారు. అందుకు కనిగిరి నియోజకవర్గంలో చేరికలే నిదర్శనమన్నారు. తన గెలుపునకు మీరంతా కష్టపడి పనిచేయాలని ఉగ్ర విజ్ఞప్తి చేశారు. టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలతోపాటు, కనిగిరి అభివృద్ధికి తాను రూపొందించిన ప్రణాళికే ప్రజలకు వివరించాలని ఉగ్ర కోరారు. కార్యక్రమంలో హనుమంతునిపాడు మండల నాయకులు గాయం తిరుపతిరెడ్డి, గాయం రామిరెడ్డి, చీకటి వెంకటసుబ్బయ్య సానికొమ్ము బ్రహ్మారెడ్డి, బూచి రామకోటిరెడ్డి, ఉడుముల వెంకటసుబ్బారెడ్డి, పాపిరెడ్డిపల్లి టీడీపీ నాయకులు కావేటి నారాయణ, పెంచికల రామకృష్ణ, ఆకుపాటి శ్రీనివాసులు, మురహరి శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైసీపీకి షాక్

- బాబును కలిసిన గరటయ్య, కృష్ణచైతన్య
- దర్శి నుంచి పోటీకి అవకాశం ఇవ్వమని విజ్ఞప్తి
- కష్టపడి పనిచేసినా జగన్ మోసం చేశారని ఆవేదన
- మంచి జరుగుతుంది ధైర్యంగా ఉండండి : చంద్రబాబు



చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న బాచిన (ఇన్‌సెట్లో) ఎమ్మెల్యే రవితో మాట్లాడుతున్న చైతన్య, గరటయ్య

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే డాక్టరు బాచిన చెంచుగరటయ్య, ఆయన కుమారుడు శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్యలు గురువారం రాత్రి టీడీపీ అధినేత చంద్రబాబును కలిశారు. వైసీపీ అధినేత, సీఎం జగన్ తమను మోసం చేశాడని తీవ్ర అసంతృప్తితో ఉన్న వారు టీడీపీ అధినేతను కలవటం విశేషం. గురువారం సాయంత్రం ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుతో కలిసి వెళ్లి వారు భేటీ అయ్యారు. గతం నుంచి ఉన్న పరిచయంతో చంద్రబాబు వారిని సాదరంగా ఆహ్వానించారు. ఆ వెంటనే గరటయ్య వైసీపీలో చాలా కష్టపడి పనిచేశామని, గత నాలుగున్నరేళ్లుగా తన కుమారుడు చైతన్య నియోజకవర్గంలో విస్తృతంగా తిరుగుతూ పార్టీకోసం ప్రజల కోసం పనిచేయగా చివరికి జగన్ మోసం చేశాడని వాపోయినట్లు తె లిసింది. కష్టపడిన వారిని కాదు పొమ్మన్నారని చెప్పి చైతన్యను పరిచయం చేశారు. మీరు అ వకాశం ఇస్తే పార్టీలో చేరి దర్శి నుంచి పోటీ చే యటానికి సిద్ధంగా ఉన్నమని చెప్పినట్లు సమాచారం. చంద్రబాబు కూడా సానుకూలంగా స్పందించి మీకు వైసీపీలో జరిగిన మోసం తెలిసింది, టీడీపీలో చేరమని చెప్పినట్లు తెలిసింది. చైతన్యకు న్యాయం జరుగుతుందని అభయమిచ్చి జనసేనతో పొత్తును ప్రస్తావిస్తూ దర్శిని జనసేనకు కేటాయించే అవకాశం ఉందని, అ న్ని విషయాలను పరిగణనలోకి తీసుకుని తగురీతిలో సహకారం అందిస్తానని చెప్పినట్లు సమాచారం. ప్రజాసేవ చేయాలంటే టీడీపీ, జనసేన కూటమి వల్లే సాధ్యమని, మీరు ఈ కూటమిలోకి రావాలని కోరినట్లుగా చెబుతున్నారు. ఆ తర్వాత వారు ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌ను కూడా కలిసి మాట్లాడినట్లు సమాచారం. తొలుత నియోజకవర్గంలోని సంతమాగులూరు మండలానికి చెందిన వైసీపీ రాష్ట్ర నాయకుడు అట్ల చినవెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. తర్వాత తన గదిలో అచ్చెన్నాయుడు సమక్షంలో గరటయ్య, చైతన్యలతో చంద్రబాబు చర్చించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు వా రి గురించి చెప్పబోగా తనకు సుపరిచితులేనని బాబు చెప్పినట్లు తె లిసింది. అయితే కూటమిలో ఏ పక్షం నుంచి వీరు తెరపైకి రానున్నారనేది చర్చనీయాంశమైంది. కాగా చంద్రబాబును కలిసిన వెంటనే గరిటయ్య, కృష్ణచైతన్యను సస్పెండ్ చేస్తూ వైసీపీ అధిష్ఠానం ఉత్తర్వులు ఇచ్చింది.

టీడీపీలో చేరిన వలంటీర్

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 15 : కంభం మండలం లింగాపురం గ్రామంలో వలంటీర్‌గా పనిచేస్తున్న మిట్టా విద్యాసాగర్ వైసీపీ ప్రభుత్వం అవ లంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా గురువారం తన ఉ ద్యోగానికి రాజీనామా చేసి టీడీపీ ఇన్‌చార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. విద్యాసాగర్‌కు అశోక్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. గిద్దలూరు టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మి ట్టా ప్రసాద్, దూదేకుల ఖాశింసాహెబ్, జె.కేశవులు, ఎ.శేఖర్ పాల్గొన్నారు.



ఎస్ఎస్‌పీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఏపీఎన్‌జీవో అసోసియేషన్ సభ్యులు

సమస్యలను పరిష్కరించాలని నిరసన

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 15: సీపీఎస్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం ఏళ్లతరబడి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, వెంటనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఏపీఎన్‌జీవో అద్దంకి తాలుకా యూనిట్ జాయింట్ యాక్షన్‌కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. గురువారం అద్దంకిలోని ఎస్ఎస్‌పీ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ అద్దంకి తాలుకా యూనిట్ జాయింట్ యక్షన్ కమిటీ ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో సభ్యులు, సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, పాత బకాయిలు వెంటనే చెల్లించి 12వ పీఆర్సీకి అనుగుణంగా ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. జీపీఎఫ్ రుణాలు, ఏపీజీఎల్ఐ రుణాల కోసం పెట్టుకున్న వాటిని వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అద్దంకి తాలుకా జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు గద్దల కిరణ్‌కుమార్, కార్యదర్శి తాళ్ళూరి రమేషబాబుతో పాటు వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘ నాయకులు, సభ్యులు నిరసన వ్యక్తం చేశారు.



పర్చూరులో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేఏసీ ప్రతినిధులు

చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

● జేఏసీ తాలూకా అధ్యక్షులు సత్యన్నారాయణ

పర్చూరు, ఫిబ్రవరి 15: ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షన్‌దారుల న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని జేఏసీ ఆధ్వర్యంలో తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జేఏసీ తాలూకా అధ్యక్షులు ఎం.సత్యన్నారాయణ కోరారు. ఈనెల 27న తలపెట్టిన కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేఏసీ ప్రతినిధులు మాట్లాడుతుతూ అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సీపీఎస్‌ను రద్దు చేస్తామన్న ప్రభుత్వం వాగ్దానం నెరవేర్చకపోగా సీపీఎస్‌ను తలదన్నే మరో జీపీఎస్‌ను తీసుకురావటం విచారకరం అన్నారు. పీఆర్‌సీని అములు చేయటంతోపాటు, ఐఆర్‌ను కూడా ప్రకటించాలన్నారు. ఉద్యోగులపై పనివత్తిడి తగ్గించాలని, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణను వెంటనే పూర్తిచేయాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు పనికి తగ్గ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సకాలంలో ఉద్యోగులకు జీతాలు కూడా చెల్లించకపోవటం ప్రభుత్వ మొండివైఖరికి నిదర్శనం అన్నారు. కొవిడ్- 19 కారణంగా మరణించిన ఉద్యోగ, ఉపాధ్యాయులపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల గురించి పట్టించుకోవాలన్నారు. ఇప్పటికైనా ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటే సంక్షేమ పథకాలను అములు చేస్తున్న ఉద్యోగుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యు.సుబ్బారావు, ప్రకాష్, చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచేలా ఇంకొల్లులో 'రా కదిలిరా'

అధినేత చంద్రబాబు సభకు భారీ ఏర్పాట్లు

సభా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యేలు ఏలూరి, గొట్టిపాటి

ఎన్ని కుట్రలు చేసినా సభ నిర్వహించి తీరుతాం

టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, ఫిబ్రవరి 15: అధికార వైసీపీ ప్రభుత్వం ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు తలపెట్టిన రా కదలిరా సభను నిర్వహించి తీరుతామని ఆపార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి ధీమా వ్యక్తం చేశారు. పర్చూరు నియోజకవర్గం ఇంకొల్లులో ఈనెల 17న నిర్వహించనున్న రా కదిలిరా సభ చరిత్రలో నిలిచేలా భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం ఎమ్మెల్యే ఏలూరి సభా ప్రాంగణాన్ని అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవితోపాటు పార్టీ శ్రేణులతో కలసి ఏలూరి పరిశీలించారు. వైసీపీ సర్కార్ అవినీతి, దౌర్జన్యాలపై తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఇంకొల్లులోని తారక రామా విజయభేరీ ప్రాంగణ వేదికగా శంఖారావం పూరించనున్నారు. తెలుగుదేశం మేనిఫెస్టోలో ప్రకటించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించనున్నారు. 2024లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు ఈవేదిక ద్వారా శంఖం పూరిస్తారన్నారు. బాపట్ల పార్లమెంట్ చరిత్రలో నిలిచిపోయేలా కనీవినీ ఎరుగని రీతిలో ఏర్పాట్లు చేస్తున్నారు. 20 ఎకరాల్లో బహిరంగ సభను తీర్చిదిద్దుతున్నారు. ఈసభకు దాదాపు లక్షమందికి పైగా హాజరయ్యే అవకాశం ఉందని నాయకులు భావిస్తున్నారు. సభను విజయవంతం చేసేందుకు నియోజకవర్గంలోని ఆరు మండలాలకు ఆరుగురు ఇన్‌చార్జిలను కూడా నియమించారు.



సభ ఏర్పాట్లను అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవి కుమార్‌తో కలసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

సభ నిర్వహించి తీరుతాం..

ఎమ్మెల్యే ఏలూరి

ఈనెల 17న ఇంకొల్లులో తలపెట్టిన రా కదిలిరా సభను నిర్వహించి తీరుతామని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. కావాలని రాజకీయంగా సభను అడ్డుకునే ప్రయత్నం చేయటం సరికాదన్నారు. సభను అడ్డుకోవాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అన్నీ అనుమతులతో దరఖాస్తు చేసినా అధినేత చంద్రబాబు పర్యటనను ప్రభుత్వం అడ్డుకోవాలని ప్రయత్నిస్తుందన్నారు. గతంలో నారా లోకేష్ యువగళం పాదయాత్రను కూడా అడ్డుకున్నారని గుర్తుచేశారు. చట్ట ప్రకారం ప్రతిపక్ష నేత సభకు అనుమతి ఇవ్వాల్సిన ప్రభుత్వం అడ్డంకులు సృష్టించటంపై ఆయన విస్మయం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ప్రతిపక్షం లేకుండా చేయాలని చూస్తుందని, దీన్ని ప్రజలు గుర్తిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.

కుట్రపూరితంగా సభను అడ్డుకోవాలని ప్రయత్నిస్తున్నారు

● విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరు, ఫిబ్రవరి 15: ఇంకొల్లులో ఈ నెల 17 న రా కదలిరా చంద్రబాబు సభను కుట్రపూరితంగా అడ్డుకోవాలని సైకో ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నదని టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆరోపించారు. ఇంకొల్లులో చంద్రబాబు పాల్గొనే బహిరంగ సభా ప్రాంగణంలో పార్టీ కార్యకర్తలు చేస్తున్న సభా పనులను బుధవారం రాత్రి పోలీసులు అడ్డగించారు. ఈ నేపథ్యంలో గురువారం మండలంలోని ఇసుక దర్శి ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇంకొల్లులో వెంకట నారాయణ అనే రైతు కౌలుకు తీసుకున్న దేవాలయ భూమి 376-1 సర్వేనంబరు లోని 18 ఎకరాలలో చంద్రబాబు సభను నిర్వహించడానికి ఆయన దగ్గర అనుమతి తీసుకున్నామన్నారు. ఈ విషయమై ఈ నెల 13 వతేదీన కలెక్టర్, ఎస్పీ, డీఎస్పీలకు అనుమతి కోసం దరఖాస్తు చేశామన్నారు. శాంతి యుతంగా సభను నిర్వహించడానికి వారి అనుమతి కోరామన్నారు. కాని వారు ఈ విషయాన్ని తేల్చకపోగా, సభా ప్రాంగణం వద్ద జరుగుతున్న పనులను పోలీసులు అడ్డ గించడానికి ప్రయత్నించడం దారుణ మన్నారు. దేవదాయ శాఖకు చెందిన అధికారితో బుధవారం ఇంకొల్లు స్టేషన్‌లో ఫిర్యాదు చేయించి, ఈ నెపంతో సభను నిర్వహించకుండా పోలీసులు ఆపే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పోలీసులను, వ్యవస్థలను నీరుగారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేసే రాజకీయ క్రీడలో పోలీసులు పావులుగా మారవద్దన్నారు. చంద్ర బాబు సభ ముగిసిన తర్వాత యథావిధిగా పొలాన్ని బాగు చేసి ఇస్తామని రైతు అనుమతితో ఈ స్థలంలో సభ నిర్వహణ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. చట్టాన్ని ఉల్లంఘించకుండా, ప్రజాస్వామ్య పద్ధతులతో పార్లమెంట్ పరిధిలోని ప్రజానీకం, పార్టీ కార్యకర్తలు, నాయకులతో 17 వతేదీన చంద్ర బాబు సభను నిర్వహిస్తామని ఏలూరి స్పష్టం చేశారు.



టీడీపీలో చేరిన పంగులూరు వైసీపీ నేతలతో మండల నాయకులు

రా కదలి రా సభను విజయవంతం చేయాలి

చినగంజాం, ఫిబ్రవరి 15 : ఇంకొల్లులో శనివారం జరిగే రా కదలి రా సభను విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని టీడీపీ మండల పరిశీలకులు టి.జయప్రకాశ్‌నారాయణ, మండల అధ్యక్షులు పొద వీరయ్యలు పిలుపునిచ్చారు. స్థానిక టీడీపీ కార్యాలయ ఆవరణలో మండల పార్టీ ప్రధానకార్యదర్శి అబ్దుల్‌కలాంఅజాద్ అధ్యక్షతన జరిగిన పార్టీ సమావేశంలో వారు మాట్లాడారు. ఇంకొల్లులోని తారకరామా విజయభేరి ప్రాంగణంలో జరిగే రా కదలి రా సభలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పాల్గొంటారని, జనసేన నాయకుల సమన్వయంతో ప్రతి గ్రామం నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చేలా చర్యలు తీసుకోవాలని వారు అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ పరిశీలకులు జయప్రకాశ్‌నారాయణ

సభకు వైసీపీ ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా శనివారం జరిగే సభలో చంద్రబాబు పాల్గొంటారని అన్నారు. రెండు నెలలు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కష్టపడితే జగన్‌మోహన్‌రెడ్డిని ఇంటికి పంపిస్తామని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆసోది సుబ్బారెడ్డి, యార్లగడ్డ లక్ష్మి, టీ.జయరావు, బత్తుల శ్రీనివాసరావు, రాయని ఆత్మారావు, నరహరి శ్రీనివాసరావు, నక్కల వీరరాఘవులు, మోటుమర్రి రామసుబ్బారావు, తాటి రాజశేఖర్, పీ. పార్థసారిథి, టి,చిన్నా, షేక్.జిలాని, బి. రమేష్‌బాబు, కోకి భాస్కర రెడ్డి, రాజు వెంకటేశ్వరరెడ్డి, బడుగు సామేలు, ఎం.లక్ష్మయ్య సలాం తదితరులు పాల్గొన్నారు.

రా కదలి రా సభకు భారీగా తరలి రావాలి

పంగులూరు, ఫిబ్రవరి 15 : ఇంకొల్లు కేంద్రంగా ఈ నెల 17న జరిగే రా కదలి రా మహాసభకు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి రావాలని టీడీపీ మండల అధ్యక్షులు రావూరి రమేష్ కోరారు. పంగులూరు మండలానికి అతి చేరువలో జరుగుతున్న మహాసభలో టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబుతో పాటు పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ మహాసభకు అన్ని గ్రామాల నుంచి వందల సంఖ్యలో పార్టీ శ్రేణులు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు కుక్కపల్లి ఏడుకొండలు, చింతల సహదేవుడు, వరపర్ల సుబ్బారావు, తాటి సుబ్బారావు, గరిమిడి జగన్, అల్లంనేని స్వామి, కోమటి ప్రసాద్, శివరాజు, గొట్టిపాటి కాజా, బోరెడ్డి ఓబుల్‌రెడ్డి, చిలుకూరి వెంకటేశ్వర్లు, జాగర్లమూడి పూర్ణ పలువురు స్థానిక నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నేతలు

మండల కేంద్రమైన పంగులూరుకు చెందిన వైసీపీ నేతలు ముప్పవరం పార్టీ కార్యాలయంలో టీడీపీలో చేరారు. గతంలో టీడీపీ మండలాధ్యక్షులుగా పనిచేసి వైసీపీలో కొనసాగుతున్న చిలుకూరి వీరరాఘవయ్య, బీసీ నాయకులు అద్దంకి ఉమ్మయ్యలు గురువారం టీడీపీలో చేరారు. మండల అధ్యక్షులు రావూరి రమేష్ వీరికి పార్టీ కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నారు.

రెండు మాత్రలతో సరిపెట్టారు - వైద్యం కూడా చేయలేదు

ఆసుపత్రిలో ఎమ్మెల్యే రవికుమార్ ఎదుట క్షతగాత్రుల గగ్గోలు

అద్దంకి, ఫిబ్రవరి 15 : వైసీపీ పాలనలో వైద్యం పేదల ప్రాణాలకు సంకటంగా మారిందని అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. సంతమాగులూరు మండలం ఏల్చూరు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి నర్సరావుపేట ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఎమ్మెల్యే రవికుమార్ గురువారం ఉదయం పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ ముందు కన్నీటి పర్యంతం అయ్యారు. బుధవారం సాయంత్రం ప్రభుత్వ వైద్యశాలకు వస్తే 12 గంటల సమయం గడిచినా నొప్పులకు రెండు మాత్రలు మా త్రమే ఇచ్చి సరిపెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రవికుమార్ వెంటనే వైద్యులను పిలిపించి మాట్లాడారు. వైద్యశాలలో చేరి 12 గంటలు గడిచినా కనీసం వైద్యులు రాకపోవటం, కనీసం ప్రథమ చికిత్స కూడా చేయకుండా చిన్న గాయాలు కూడా అదే విధంగా ఉండటం ఏమిటని ప్రశ్నించారు. రెండు బిళ్లలు ఇచ్చి సరిపెడతారా అని ప్రశ్నించారు. క్షత గాత్రులకు వెంటనే వైద్యం అందించాలని, అవసరమైతే ప్రయివేట్ వైద్యశాలకు పంపి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. మార్చురీ వద్ద ఉన్న మృతదేహాల వద్ద నివాళులు అర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు.

క్షతగాత్రులకు ఎమ్మెల్యే గొట్టిపాటి పరామర్శ

సంతమాగులూరు : మండలంలోని ఏల్చూరు గ్రామం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా గురువారం మరొకరు మృతి చెందారు. నరసరావుపేట ప్రయివేటు, ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పరామర్శించారు. ఆయా వైద్యశాలల వైద్యులతో మాట్లాడి క్షతగాత్రులను మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.



నర్సరావుపేట ప్రభుత్వ వైద్యశాలలో క్షతగాత్రులను పరామర్శించి అనంతరం వైద్యులతో మాట్లాడుతున్న అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

మృతదేహాలను పరిశీలించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతు కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 50 వేలు, క్షతగాత్రులకు రూ. 25 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అట్లా చినవెంకటరెడ్డి, తేలప్రోలు రమేష్, దుద్దేల గాలియ్య, గొట్టిపాటి చౌదరిబాబు, తాత్కాలికం దేశింగరాజు తదితరులు పాల్గొన్నారు.



నామ్ రోడ్డులో ఉదయం 9 గంటల సమయంలో దట్టంగా ఉన్న పొగమంచు



పొగమంచుతో లైట్లు వేసుకొని ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సు, ఆటోలు

ఒక వైపు పెరిగిన ఎండలు... మరో వైపు దట్టమైన పొగమంచు

అద్దంకి, ఫిబ్రవరి 15 : ఒక వైపు పెరిగిన ఎండలు... మరో వైపు దట్టమైన పొగమంచుతో అద్దంకి ప్రాంతంలో భిన్నమైన వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఎండల తీవ్రత ఈనెల మధ్య నుంచే ప్రారంభమయ్యాయి. అదే సమయంలో సంక్రాంతి నెలలో ఉండే పొగమంచు ఫిబ్రవరి నెల మధ్య లో కూడా ఉంది. దీంతో రా త్రి సమయంలో చలిగాలులు, ఉదయం సమయంలో దట్టమైన పొగమంచు, పగటి సమయంలో ఎండ వేడిమి ఎక్కువగా ఉంటోంది. గురువారం ఉదయం పొగమంచు మరింత దట్టంగా ఏర్పడింది. దీంతో ఉదయం 9 గంటల సమయం వరకు కూడా వాహనచోదకులు లైట్లు వేసుకొని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రెండు రకాల వాతావరణ పరిస్థితులు ఆరోగ్య సమస్యలపై ప్రభావం చూపే అవకాశం ఉందని పలువురు ఆందోళన చెందుతున్నారు.

ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా పనిచేయాలి

- డీఎస్పీ ప్రసాదరావు



గుర్తింపు కార్డును అందజేస్తున్న డీఎస్పీ ప్రసాదరావు

చీరాల,ఫిబ్రవరి 15 : నిర్దీత వ్యక్తులు లేదా వ్యవస్థలకు సంబంధించిన బాధ్యులు ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా పనిచేయాలని డీఎస్పీ ప్రసాదరావు అన్నారు. ఆర్టీఐ రక్షణ్ చీరాల నియోజకవర్గ అధ్యక్షురాలిగా నియమితులైన కారంపూడి పద్మినికి గురువారం డీఎస్పీ ప్రసాదరావు గుర్తింపు కార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేవిధంగా బాధ్యులు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల ఏర్పాట్లు పరిశీలన



విప్పర్లవారిపాలెంలో పోలింగ్ బూత్‌వద్ద వసతులను పరిశీలిస్తున్న సునిల్‌కుమార్

అద్దంకి, ఫిబ్రవరి 15: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఆయా గ్రామాలలో ఏర్పాటు చేసే పోలింగ్ బూత్‌లను, వసతులను నియోజకవర్గ ప్రత్యేకాధికారి, గుండ్లకమ్మ ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సునీల్‌కుమార్ గురువారం పరిశీలించారు. అద్దంకి పట్టణం, మండల పరిధిలో మొత్తం 56 పోలింగ్ కేంద్రాలు ఉండగా వెంపరాల, ఉప్పలపాడు, మైలవరం మినహా మిగిలిన అన్ని గ్రామాలలో 50 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అదనంగా ఏర్పాటు చేయాల్సిన వసతులను కూడా అడిగి తెలుసుకున్నారు. ఎంఆర్ఐ శంకర్, సర్వేయర్ శ్రీలక్ష్మి, వీఆర్‌వోలు ఉన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాలు అందజేత



గ్రంథాలయానికి పుస్తకాలను అందజేస్తున్న దాతలు

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 15: మండలంలోని బొమ్మనంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గురువారం విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన గ్రంథాలయానికి పుస్తకాలను దాతలు అందజేశారు. గుండ్లకమ్మ రాజకీయ మాసపత్రిక ఆధ్వర్యంలో ఎడిటర్ సందిరెడ్డి కొండలరావు పాఠశాల గ్రంథాలయానికి వివిధ రకాల పుస్తకాలను ఇన్‌చార్జి హెచ్‌ఎం కోవి శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ పుస్తకాల ద్వారా ప్రముఖుల జీవిత విశేషాలను తెలుసుకుని వారి ఆశయాలను అందిపుచ్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, శంకరరావు, శ్రీనివాసరావు, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తీరు గర్హనీయం



సమావేశంలో మాట్లాడుతున్న సాధనసమితి కార్యకర్తలు

చీరాలటౌన్, ఫిబ్రవరి 15 : చీరాల పరిధిలోని అధికారుల తీరు గర్హణీయమని చీరాల సాధనసమితి సామాజిక కార్యకర్తలు అన్నారు. గురువారం పట్టణంలోని ఎన్‌జీవో హోంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ చీరాల నియోజకవర్గ పరిధిలో పలుచోట్ల ఆక్రమణలు జరిగినట్లు తెలిపారు. అలాగే దళితవాడల్లో అభివృద్ధి శూన్యమని చెప్పారు. అంతేకాకుండా ప్రజా సమస్యలు పరిష్కారానికి భిన్నంగా నెలకొన్న కార్యక్రమాలకు మాత్రమే ప్రాధాన్యత కల్పించేందుకు అధికారులు పోటీపడుతున్నారని ఆరోపించారు. పారదర్శకంగా పనిచేయకుంటే పోరాటాలు ఉధృతం చేస్తామని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గుమ్మడి ఏసురత్నం, శీలం రవికుమార్, బత్తుల శామ్యేల్, అచ్యుతుని బాబూరావు, గూడూరి శివరామకృష్ణ, పాలవలస శ్రీను, పుష్పరాజు, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించండి

వేటపాలెం(చీరాల),ఫిబ్రవరి 15 : రోగులకు మెరుగైన సేవలు అందించాలని పలువురు పేర్కొన్నారు. మండల పరిధిలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ క్లినిక్‌ను గురువారం ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అకస్మికంగా సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను ఆరా తీశారు. భవిష్యత్ అవసరాలపై చర్చించారు. వారికి అవసరమైన సేవలు అందించాలని సూచించారు కార్యక్రమంలో పీఆర్ డీఈ శేషయ్య, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలరాం

ఓటు విలువను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 15: అర్హులైన విద్యార్థులందరూ తమ ఓటు విలువను తెలుసుని ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలని ఈఆర్‌వో పీఈ సునీల్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటరు నమోదు అవగాహన కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. మోహనరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఓటు హక్కు పొందిన ప్రతి ఒక్కరు తమ ఓటును వినియోగించుకోవాలన్నారు. అర్హత ఉన్నవారిని ఓటు నమోదు చేయించుకునేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, ఎస్‌వీఈఈపీ సమన్వయకర్త డి. గంగయ్య, డాక్టర్ ఎస్. దాసు, జి. శి వకోటి, కె. వేణుబాబు, సిబ్బంది పాల్గొన్నారు

కో ఆప్షన్ మాజీ సభ్యుడు బుడేకు ఘన నివాళులు

మార్టూరు, ఫిబ్రవరి 15: ఇటీవల అనారోగ్య కారణంగా మృతి చెందిన కో ఆప్షన్ మాజీ సభ్యులు, శ్రీ విఘ్నేశ్వర కూరగాయల వర్తక సంఘం మాజీ అధ్యక్షులు షేక్ మహమ్మద్ బుడేకు కూరగాయల మార్కెట్‌లో కమిటీ సభ్యులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కూరగాయల మార్కెట్ అభివృద్ధికి బుడే చేసిన కృషిని పలువురు వివరించారు. అనంతరం బుడే కుమారుడు రషీద్‌మార్కెట్ లోని ముఠా కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ అధ్యక్షులు కన్నె గంటి శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ జాష్టి వెంకట నారాయణ, కాకోలు రామారావు, పఠాన్ కాలేషావలి, కారసాల సులేమాన్, తదితరులు పాల్గొన్నారు.

నేటి భారత్ బంద్‌కు సహకరించండి


మార్టూరు, ఫిబ్రవరి 15 : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని కోరుతూ శుక్రవారం ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారత్ బంద్‌కు అందరూ సహకరించాలని మార్టూరులో కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బంద్ నిర్వహిస్తారని మార్టూరు పట్టణంలోని వ్యాపారులు అందరూ తమ దుకాణాలను మూసివేసి సహకరించాలని వారు ఆ ప్రకటనలో కోరారు.

సమ్మెకు అందరూ సహకరించాలి

ఇంకొల్లు : కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం చేయనున్న సమ్మెను ఇంకొల్లు మండల వ్యాపారులు సహకరించాలని బాపట్ల జిల్లా రైతుసంఘం ఉపాధ్యక్షులు కందిమళ్ళ రామకోటేశ్వరరావు కోరారు. మధ్యాహ్నం 12 గంటల వరకు స్వచ్ఛందంగా దుకాణాలు మూసి సమ్మెను విజయవంతం చేయాలని కోరారు.

పేకాట శిబిరంపై దాడులు - ఏడుగురు అరెస్టు

పర్చూరు, ఫిబ్రవరి 15: పేకాట శిబిరంపై పర్చూరు పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. పర్చూరు - దేవరపల్లి శివారు ప్రాంతంలో పేకాడుతున్న ఏడుగురును అరెస్టు చేసి వారి వద్దనుంచి రూ.10,100 నగదును స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పర్చనున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు. ఈదాడుల్లో స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.





వీఆర్సీ మైదానంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న పురందేశ్వరి

22న ప్రజాపోరు

- నెల్లూరు వీఆర్సీ మైదానంలో నిర్వహణ
- పాల్గొననున్న మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్
- ఏర్పాట్లను పరిశీలించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

నెల్లూరు (క్రైం), ఫిబ్రవరి 15 : రాష్ట్రంలో జరుగుతున్న అరాచక, అవినీతి, నిరంకుశ పాలనను ప్రజలకు తెలియజేసేలా కేంద్రం అందిస్తున్న నిధులను వైసీపీ సర్కారు దారి మళ్లించి దుర్వినియోగానికి పాల్పడుతున్న అంశాలను ప్రజలకు తెలిపేందుకు ఈ నెల 22న నెల్లూరులో ప్రజాపోరు నిర్వహిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి తెలిపారు. నగరంలోని వీఆర్సీ మైదానంలో ప్రజాపోరు కార్యక్రమ ఏర్పాట్లను బీజేపీ ముఖ్యనాయకులతో కలిసి గురువారం ఆమె పరిశీలించారు. అనంతరం పురందేశ్వరి మాట్లాడుతూ ప్రజాపోరు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రానున్నారని చెప్పారు. ఈ ప్రజాపోరు ద్వారా రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై కమలదళం గళం విప్పుతుందని అన్నారు. ఇసుక, మైనింగ్ అక్రమాలపై ఇప్పటికే సమర్థవంతంగా బహిర్గతం చేశామన్న ఆమె అవినీతి మైనింగ్ జరగడం వాస్తవమని నిర్ధారణ అయిందన్నారు. రాష్ట్రంలో ఏ ప్రాంతానికి వెళ్లినా కేంద్రం వేసిన రోడ్లు బాగున్నాయని, గ్రామీణ ప్రాంత రోడ్లు అధ్వానంగా ఉన్నాయని పలువురు తమ దృష్టికి తీసుకొచ్చారని అన్నారు. సొంతింటి నిర్మాణం కోసం అర్హులైన పేదలకు కేంద్రం రూ.1.8 లక్షలు ఇస్తుంటే ఈ ప్రభుత్వం నాశిరకంగా నిర్మాణాలు చేపడుతోందని ఆరోపించారు. ప్రభుత్వమే బీమా చెల్లిస్తుందని ప్రకటించిన వైసీపీ సర్కారు ఇటీవల మిచౌంగ్ తుఫాను విషయంలో నష్టపోయిన రైతులకు ఎలాంటి బీమా వర్తించకుండా మోసం చేసిందని మండిపడ్డారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా వైసీపీని ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, ప్రకాశం, రాజంపేట పార్లమెంటు నియోజకవర్గాలకు సంబంధించిన క్లస్టర్ సమావేశంలో పురందేశ్వరి పాల్గొని పలు అంతర్గత అంశాలపై నాయకులతో చర్చించి, దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, తిరుపతి నియోజకవర్గ ఇన్చార్జి భానుప్రకాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వాకాటి నారాయణరెడ్డి, నాయకులు సురేంద్రరెడ్డి, భరత్‌కుమార్ యాదవ్, వంశీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్ల సాధన కోసం పట్టు

- 2వ రోజూ ఉద్యోగ, ఉపాధ్యాయ ఉద్యమం



నెల్లూరు : నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 15 : తమ డిమాండ్ల సాధన కోసం ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఉద్యమం గురువారం రెండవ రోజుకు చేరుకుంది. నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. మెడికల్ రీయింబర్స్‌మెంటు బకాయిలు చెల్లించాలని, 12వ పీఆర్సీలో మధ్యంతర భృతి 30 శాతం ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న రెండు డీఏల డబ్బుతోపాటు పీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణాలు, క్లైయిములు చెల్లించాలని, సీపీఎస్ ఉద్యోగులకు చెల్లించాల్సిన డీఏలను 90 శాతం నగదు రూపంలో ఇవ్వాలని, 11వ పీఆర్సీలో చెల్లించాల్సిన సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంటు చెల్లించాలని, 2004 సెప్టెంబరు 1వ తేదీకి ముందు నోటిఫై అయిన తరువాత నియామకపు ఉత్తర్వులు పొందిన ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. నెల్లూరులో ఏపీజేఏసీ నగర శాఖ ఆధ్వర్యంలో సోమశిల, తెలుగుగంగ కార్యాలయాల ఎదుట నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీజేఏసీ అమరావతి కన్వీనర్ నాయుడు వెంకటస్వామి, నగర శాఖ జేఏసీ చైర్మన్ చిలకా రామకృష్ణారెడ్డి, కన్వీనర్ డేగల మార్కెండేయులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో బర్డ్‌ఫ్లూ లక్షణాలు

- నిర్ధారించిన రాష్ట్ర ప్రభుత్వం
- నివారణ చర్యలపై అధికారులతో కలెక్టర్ సమీక్ష
- ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశాలు



నెల్లూరు (వ్యవసాయం), ఫిబ్రవరి 15 : జిల్లాలో బర్డ్‌ఫ్లూ వైరస్ లక్షణాలు ఉన్నట్టు నిర్ధారణ అయింది. ఇటీవల పొదలకూరు, కోవూరు ప్రాంతాల్లో వేల సంఖ్యలో చనిపోయిన కోళ్ల కళేబరాల నుంచి సేకరించిన శాంపిల్స్‌ను భోపాల్‌లోని ల్యాబ్‌కు పంపగా పరిశీలించి బర్డ్‌ఫ్లూగా నిర్ధారించారు. దీంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. వైరస్ ప్రబలకుండా గ్రామసభలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు ఆయా ప్రాంతాల్లో శానిటైజేషన్ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

● ప్రబలకుండా చర్యలు : కలెక్టర్

బర్డ్ ఫ్లూ వ్యాధి ప్రబలకుండా అధికారులంతా సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ హరినారాయణన్ సూచించారు. గురువారం కలెక్టరేట్ క్యాంపు కార్యాలయంలో బర్డ్ ఫ్లూ నివారణపై జిల్లా కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. పొదలకూరు మండలం చాటగుట్ల, కోవూరు మండలం గుమళ్లదిబ్బ గ్రామాల్లో భారీగా కోళ్లు చనిపోవడంతో పశుసంవర్ధక శాఖ అధికారులు భోపాల్‌లోని టెస్టింగ్ కేంద్రానికి శాంపిల్స్ పంపారని, బర్డ్‌ఫ్లూగా నిర్ధారణ అయినట్లు తెలిపారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

ఈ వ్యాధి ప్రబలకుండా అదుపు చేయడానికి అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. నిబంధనల ప్రకారం కోళ్లు మృతి చెందిన ప్రాంతానికి పది కిలో మీటర్ల పరిధిలో 3రోజులపాటు చికెన్ షాపులు మూసివేయాలని, కిలోమీటరు పరిధిలో 3 నెలలు షాపులు తెరవకూడదని వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యాధి సోకిన ప్రాంతం నుంచి 15 రోజుల వరకు కోళ్లు బయటకు వెళ్లకూడదని మరో ప్రాంతం నుంచి కోళ్లను తీసుకురాకూడదని చెప్పారు. చనిపోయిన కోళ్లను భూమిలో పాతిపెట్టాలన్నారు. కోళ్ల ఫారాలు, ఆయా కోళ్ల వద్ద పనిచేసే వ్యక్తులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. జిల్లా పంచాయతీ అధికారి, సీఈవో ఇతర అధికారులతో కలిసి శుక్రవారం ఉదయం ఆ రెండు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజలు, కోళ్ల పెంపకందారులు, దుకాణ నిర్వాహకులకు అవగాహన తీసుకురావాలని సూచించారు. ఆయా గ్రామాల్లో శానిటైజేషన్ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పశుసంవర్ధక శాఖ జేడీ మహేశ్వరుడు, డీపీవో సుస్మిత, సీఈవో కన్నమనాయుడు, ఆర్డీఓ మలోల, డీఎఫ్ఓ చంద్రశేఖర్, డీఎంహెచ్ఓ పెంచలయ్య పాల్గొన్నారు.



రోడ్డుపై కంపు

మండల కేంద్రమైన సంగంలో ప్రధాన రహదారి ఇది. ఇళ్లలోని మురుగు నీరు రోడ్డుపైకి ప్రవహిస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నామని గడపకు గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. గడప గడపకు నిధులతో కాలువ ఎత్తు పెంచుతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఇప్పటికి ఆరు నెలలైంది. కానీ పనులు చేయలేదు. మురుగు మాత్రం ఇదిగో ఇలా రోడ్డుపై చేరిపోతోంది.

- సంగం



వాగు దాటితేనే గమ్యానికి..

కలిగిరి మండలంలోని గంగిరెడ్డిపాలెం పంచాయతీ, భట్టువారిపాలెం వాసులు బయట ప్రపంచాన్ని చూడాలంటే ఇదిగో ఇలా వాగు దాటాల్సిందే. ప్రతి ఏడాది వర్షాలు ప్రారంభమైతే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఈ వాగు దాటి బయటకు వస్తున్నారు. ఈ వాగుపై వంతెన నిర్మించాలని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డిని ఆయా గ్రామస్థులు వేడుకున్నారు. అయితే, రోజులు గడుస్తున్నాయి కానీ వంతెన మాత్రం నిర్మించలేకపోయారు.

- కలిగిరి

'గడప' దాటని ప్రగతి

'ఇంటింటికీ వస్తున్నాం.. మీ సమస్యలు తెలుసుకుంటాం.. వాటన్నింటినీ పరిష్కరిస్తాం..' అంటూ ఓ వైపు ఎమ్మెల్యేలు ప్రచారం చేసుకోగా, మరో వైపు 'ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నాం.. అవసరమైతే ఇంకా ఇస్తాం.. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యలను పరిష్కరించాలి..' అంటూ మరోవైపు ప్రభుత్వం ఆర్భాటపు ఆదేశాలు జారీ చేసింది. కానీ చివరకు ఏం జరిగిందయ్యా అంటే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం (జీజీఎంపీ) వైసీపీ ప్రచారానికి ఉపయోగపడింది తప్ప ప్రజల సమస్యలు మాత్రం అలానే ఉండిపోయాయి. ఇప్పటివరకు చేసిన పనులకే డబ్బులు ఇవ్వలేదు.. ఇక ఇప్పుడు కొత్తగా పనులు చేస్తారా!? అంటూ మొదట్లో ప్రజలు అనుమాన పడిందే చివరకు నిజమైంది.

- వైసీపీ ప్రచారానికే పరిమితమైన జీజీఎంపీ
- ప్రజలు చెప్పిన సమస్యలకు పరిష్కారమేది..?
- ప్రచారార్భాటాలు తప్ప పనులకు నిధులేవి..?
- గుర్తించినవి 5235.. పూర్తి చేసినవి 2444..!
- బిల్లుల సమస్యతో ఆగిపోయిన పనులు



సీతారామపురంలోని తోటకాలనీ, రజక కాలనీ, బెస్తకాలనీల్లో సీసీ రోడ్లు వేస్తామన్న పాలకుల మాటలు నేటికీ నెరవేరలేదు.

నెల్లూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : 2022, మే నెలలో జీజీఎంపీ ప్రారంభమైంది. నెలలో కనీసం 20 సచివాలయాలను ఎమ్మెల్యేలు సందర్శించేలా ప్రణాళిక రూపొందించారు. దాదాపు ఏడాదిపాటు ఈ కార్యక్రమం కొనసాగింది. అయితే అప్పట్లోనే ప్రజల నుంచి నిరసన వ్యక్తమైంది. ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఘటనలు అనేకం వెలుగుచూశాయి. దీంతో కొంత మంది ఎమ్మెల్యేలు తమకు అనుకూల మైన ప్రాంతాల్లోని తిరగగా, కొంతమం దైతే అసలు తిరగకుండానే మమ అనిపించారు. వీరు తిరిగిన ప్రాంతాల్లో మౌలిక వసతులు, ఇతర సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని చెప్పడంతో ప్రతి గ్రామం, వార్డులో వందల సంఖ్యలో అర్జీలు అందాయి. ఒకరు రోడ్డు వేయాలని, మరొకరు కాలువ నిర్మించాలని, ఇంకొకరు లైట్లు బాగు చేయాలంటూ వినతులు ఇచ్చారు. అధికారుల నివేదిక ప్రకారం జీజీఎంపీ కింద జిల్లాలో 5235 వర్కులను రూ.225 కోట్ల అంచనాతో ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పటి వరకు 2444 వర్కులను రూ.100 కోట్లతో పూర్తి చేసినట్లు చూపిస్తున్నారు. అంటే 40 శాతం కూడా సమస్యలు పరిష్కరించలేదు. పూర్తి చేసిన వర్కుల్లో కూడా వీధిలైట్లు బాగు చేయడం, కాలువల్లో పూడిక తీయడం, చిన్న చిన్న ప్యాచ్‌లు వేయడం మినహా శాశ్వతంగా సమస్యలను పరిష్కరించలేదని క్షేత్ర స్థాయిలో పరిస్థితులను బట్టి అర్థమవుతోంది. మరోవైపు చేసిన పనులకు కూడా బిల్లులు రాకపోవడంతో మిగిలిన వర్కులను చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. ఎమ్మెల్యేలు, అధికారులు జీజీఎంపీ కార్యక్రమంలో తిరుగుతూ ప్రచార బుక్‌లెట్లను పంపిణీ చేసేందుకు పెట్టిన ఖర్చు కూడా ప్రజల సమస్యల పరిష్కారానికి వెచ్చించలేదు.



బుచ్చిరెడ్డిపాళెం : పాత మినగల్లు గ్రామంలో సదరన్ చానల్‌పై నిర్మాణానికి నోచుకోని వంతెన

నెల్లూరు రూరల్లో ఇంటెలిజెన్స్ నిఘా

వైసీపీని వీడుతున్న వారిపై ఆరా



నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 15 : నెల్లూరురూరల్ నియోజకవర్గంపై రాష్ట్ర ప్రభుత్వ నిఘా సంస్థలు డేగకన్ను వేశాయి. వైసీపీని వీడుతున్న వారు, టీడీపీలోకి వెళ్లాలని కసరత్తు చేసుకుంటున్న వారి వివరాలను సేకరిస్తోంది. ఇటీవల అధికార పార్టీని వీడి టీడీపీలో చేరుతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉండటంతో పార్టీ బలహీనపడుతుందని గ్రహించిన నేతలు దిద్దుబాటు చర్యలకు దిగారు. ప్రభుత్వ పెద్దల నుంచి జిల్లా నిఘా విభాగానికి ఆదేశాలు తెప్పించుకుని అటువంటి వారి వివరాలు సేకరిస్తున్నారు. నిఘా సంస్థలకు చెందిన అధికారులు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులకు ఫోన్లు చేసి ఆరా తీస్తున్నట్లు సమాచారం. అటువంటి వారి ఆదాయ వనరులను గుర్తించి ఆ దిశగా బెదిరింపులకు పాల్పడేలా అధికార పార్టీ సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు నియోజకవర్గంలో వర్గపోరును తట్టుకోలేక ఇబ్బందులు పడుతున్న నాయకులను అధికార పార్టీ నేతలు పసిగట్టి బుజ్జగింపులకు దిగుతున్నారు. తిరిగి అధికారంలోకి వస్తే నామినేటెడ్ పదవులు వస్తామని ఎర వేస్తున్నారు.

ఇక నియామకాలన్నీ విజయవాడలోనే

- వైద్య ఆరోగ్య శాఖ ప్రక్షాళన దిశగా అడుగులు
- డీఎంహెచ్‌వో కార్యాలయంపై అవినీతి ఆరోపణలు

నెల్లూరు (వైద్యం) ఫిబ్రవరి 15 : వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో జరిగే ఉద్యోగ నియామకాలన్నీ ఇకపై విజయ వాడలోనే జరగనున్నాయి. ఇందుకు సంబంధించి వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ డాక్టర్ నివాస్ ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటివరకు జిల్లాస్థాయిలోనే జరిగే కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ నియామకాలపై కమిషనరేట్ దృష్టి సారించింది. గతంలో జరిగిన నియమకాలలో పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఆయా ఉద్యోగ నియామకాలకు భారీస్థాయిలో ముడుపులు వసూలు చేసే వారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. డీఎంహెచ్‌వో కార్యాలయంలో కొందరు అధికారులే ఈ అవినీతికి పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో కొందరు అధికారుల వాహన డ్రైవర్లు కూడా ఉన్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. వైద్యులు, నర్సులతోపాటు ల్యాబ్ టెక్నీషియన్ ఆఖరికి ఆశాల నియామకా ల్లోనూ ముడుపులు తీసుకుని భర్తీ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేగాక ఉద్యోగ నియామకాల్లోనూ నకిలీ ధ్రువీకరణ పత్రాలు ఉన్నట్లు తెలుస్తుంది. వైద్య ఆరోగ్యశాఖలోనే కాకుండా వైద్య విధాన పరిషత్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోనూ ఉద్యోగుల నియామకాల్లో కొందరు అధికారులు ఈ అక్రమాలకు తెరతీశారు. దీంతో వైద్య ఆరోగ్యశాఖలో ప్రక్షాళన చేయాలని రాష్ట్రస్థాయి అధికారులు భావించారు. జిల్లాస్థాయిలో జరిగే నియామకాలన్నీ ఇక నుంచి విజయవాడలోనే జరిగేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.



జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం

పాఠశాలల్లో విద్యాహక్కు చట్టం అమలు


నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 15 : ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం అనుసరించి అన్ని ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతిలో ఉచిత ప్రవేశాలు అమలు చేస్తున్నట్లు డీఈఓ పీజీవీ రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. అనాథ పిల్లలు, హెచ్ఐవీ బాధిత పిల్లలు, దివ్యాంగుల కోసం 5శాతం, ఎస్సీలకు 10, ఎస్టీలకు 4, బీసీ, మైనార్టీ, ఓసీలకు కలిపి 6శాతం సీట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. రానున్న విద్యా సంవత్సరానికి అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో 1వ తరగతిలో చేరేందుకు 25శాతం సీట్లు కేటాయిస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు విద్యాశాఖ వెబ్‌సైట్ www.cse.ap.gov.inలో ఈ నెల 23 నుంచి మార్చి 14వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు సమీపంలోని ఎంఈఓ కార్యాలయాలు, టోల్ ఫ్రీ 14417, 18004258599 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

వలంటీర్లకూ హ్యాండిచ్చారు!

- రేషన్ సరుకులు పంపిణీ చేయించి, ప్రోత్సాహక నగదు మరిచారు!
- రూ.95.87 లక్షల బకాయిలు

వలంటీర్లకు రాష్ట్ర ప్రభుత్వం హ్యాండిచ్చింది. ఇంటింటా రేషన్ సరుకులు పంపిణీ చేసినందుకుగాను ఒక్కో వలంటీర్లకు పారితోషకంతోపాటు రూ.750 ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దీంతో సంబరపడిన వలంటీర్లు జనవరిలో పౌరసరఫరా ల శాఖ నిర్దేశించిన ప్రాంతంలో సరుకులు అందజేశారు. అయితే, రెండువారాలు గడుస్తున్నా ఇప్పటి దాకా నగదు మాత్రం వారి చేతికి అందలేదు.

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 15 : జిల్లాలో ఇంటింటికీ రేషన్ పేరుతో ఎండీయూ వాహనాల ద్వారా లబ్ధిదారులకు సరుకులు అందజేస్తున్నారు. అయితే, ఆ వాహనాలను ప్రవేశపెట్టిన నాటి నుంచి నేటిదాకా ఒక్కసారి కూడా ఇంటింటికీ సరుకులు పంపిణీ చేసిన దాఖలాలు లేవు. వీధుల్లో ఏదో ఒకచోట వాహనం ఆపి లబ్ధిదారులను అక్కడికి రమ్మని సరుకులు ఇస్తున్నారు. దీంతో వలంటీర్లను భాగస్వామ్యులను చేసి రేషన్ పంపిణీ చేయాలని ప్రభుత్వం భావించింది. గతేడాది విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం ఒక్కో వలంటీరు పనిచేసే ప్రాంతంలో 5 పాయింట్లను పౌరసరఫరాల శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. ఆ పాయింట్ల వద్ద ఎండీయూ వాహన ఆపరేటర్, స్థానిక వలంటీరు పర్యవేక్షలో కార్డుదారులకు సరుకులు పంపిణీ చేయాలి. ఇందుకు కోసం వలంటీర్లకు నెలకు ప్రోత్సాహక నగదు రూ.750 చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. జిల్లాలో 1,513 రేషన్ షాపులు ఉండగా, 12,783 మంది వలంటీర్లు ఉన్నారు. జనవరి నుంచి 7.37 లక్షల కార్డుదారులకు రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్నారు. ఆ నెలకు గాను వలంటీర్లకు సుమారు రూ.95.87 లక్షలు చెల్లించాల్సి ఉండగా, ఇంతవరకు విడుదల చేయలేదు. దీంతో వలంటీర్లు రేషన్ పంపిణీకి ఆసక్తి చూపడం లేదు.



రియల్టర్లకు డబుల్ ధమాకా!

- ప్రభుత్వ సొమ్ముతో ప్రైవేటు వెంచర్, వైసీపీ నేతల భూములకు బీటీ రోడ్డు
- కావలిలో అధికారులు, పాలకుల బరితెగింపు!

కావలి, ఫిబ్రవరి 15 : కావలిలో ప్రభుత్వ ఆస్తులే కాదండోయ్.. ప్రభుత్వ సొమ్మునూ రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అధికారులు, పాలకులు ధారాదత్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు పట్టించుకోరనే లేదా వాటాలు ఇస్తే సరిపోతాయనే ధీమా అధికారపార్టీ అండ ఉందని అధికారులు బరితెగిస్తున్నారు. పట్టణంలో పన్నుల రూపంలో ప్రజల నుంచి వసూలు చేసిన సొమ్మును రియల్టర్ల అవసరాలకు వినియోగిస్తున్నారు. అసలే ఆర్థిక కష్టాల్లో ఉన్న కావలి మున్సిపాలిటీ 1వ వార్డులోని మద్దూరుపాడులో ఓ ప్రైవేటు రియల్‌ఎస్టేట్ వెంచర్‌కు నిబంధనలకు విరుద్ధంగా మున్సిపల్ జనరల్ ఫండ్స్ నుంచి బీటీ డబుల్ రోడ్డు వేశారు. జాతీయ రహదారి నుంచి ఆ వెంచర్ చివరి వరకు రోడ్డు వేసేందుకు సుమారు రూ.54 లక్షలు వెచ్చించారు. ఓ బినామీ కాంట్రాక్టర్ పేరుతో అధికార వైసీపీకి చెందిన నాయకులే ఈ రోడ్డు పనులు చేయించారు. అయితే, ఇందులోనూ నాయకులు కక్కుర్తి పడ్డారు. రోడ్డు నిర్మానానికి సగం నిధులే ఖర్చు చేశారని అధికారులు చెబుతున్నారు. అంతే గాక ఆ వెంచర్‌లో ఒక ప్రజాప్రతినిధికి కూడా వాటా ఉందనే ప్రచారం జోరుగా ఉంది. అంతేకాదండోయ్.. మద్దూరుపాడుకు చెందిన వైసీపీ నేత బంధువుకు అక్కడ పొలం కూడా ఉంది. ఆ పొలం ధర పెంచుకోవడానికి, ప్రైవేటు వెంచర్‌లో ప్లాట్ల ధరలు పెంచుకునేందుకే ఈ రోడ్డు వేశారనే విమర్శలు గుప్పుమంటున్నాయి. ప్రధాన రహదారులకు దీటుగా ఈ డబుల్ రోడ్డు వేయడంతో దానిని చూసిన ప్రజలంతా అధికారం ఉందని ప్రభుత్వ సొమ్ము ఇలా దుర్వినియోగం చేస్తారా అని ముక్కున వేలు వేసుకుంటున్నారు. అయితే, అధికారులు మాత్రం ఆ మార్గంలో ఉన్న దళిత కాలనీ పేరుతో రికార్డులో నమోదు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై మున్సిపల్ ప్రత్యేకాధికారి, ఆర్డీవో శీనానాయక్ మాట్లాడుతూ మద్దూరుపాడులో వేసిన బీటీ డబుల్ రోడ్డు ప్రైవేట్ వెంచర్ కోసం వేసినట్లయితే విచారించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.



మద్దూరుపాడులో రియల్టర్ల కోసం వేసిన బీటీ డబుల్ రోడ్డు

గుక్కెడు నీటి కోసం పల్లెవాసుల పాట్లు

ముందుకు సాగని తాగునీటి పథకాలు

వరికుంటపాడు, ఫిబ్రవరి 15: మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో ఏళ్ల తరబడి తాగునీటి సమస్యలు వెంటాడుతున్నప్పటికీ పట్టించుకునే నాథుడే లేడని, గుక్కెడు నీటి కోసం పడరాని పాట్లు పడాల్సివస్తోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వం శుద్ధి నీటిని అందించేందుకు తీసుకొచ్చిన పథకాలు అందని ద్రాక్షాగానే ఊరిస్తున్నాయి. సురక్షిత తాగునీటిని అందించే సంగతి అటుంచితే కనీసం పనులు సైతం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా నిలిచి వెక్కిరిస్తున్నాయి. 80శాతం వరకు పూర్తయిన పథకాలను అందుబాటులోకి తీసుకురాకపోవడం ఒకవంతైతే మరమ్మతులకు గురైన పథకాలను కూడా వినియోగంలోకి తీసుకొచ్చేందుకు అధికారులు ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం వేసవి ప్రభావం అధికమవుతుండడంతో క్రమేణా భూగర్భ జలాలు అడుగంటిపోయే పరిస్థితులు నెలకొన్నాయని గ్రామస్థులు వాపోతున్నారు.

పేరు మార్చినా ఫలితం శూన్యం

గత తెలుగుదేశం ప్రభుత్వం 2018లో ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం ద్వారా నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు తాగునీరు అందించేందుకు గాను రూ. 15 కోట్ల నిధులను మంజూరు చేసింది. 2019 మార్చి నాటికి పనులు పూర్తి చేయాల్సి ఉండగా అప్పట్లో జోరుగా సాగిన పనులు అనంతరం జరిగిన ఎన్నికల పుణ్యమాని నిలిచిపోయాయి. ఆపై అధికారం చేపట్టిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 2021లో హడావిడిగా ఆ పథకానికి వైఎస్ఆర్ సుజల స్రవంతిగా పేరు మార్చి పునరుద్ధరించినా ఫలితం లేకుండా పోయింది. పేరు మార్చినప్పటికీ సకాలంలో నిధులు మంజూరు చేయకపోవడంతో అధికశాతం మంది కాంట్రాక్టర్లు తమ పనులను ఎక్కడికక్కడే నిలిపివేసి వెనుతిరిగి


కొండ్రాజుపల్లి వద్ద మరమ్మతులకు గురైన చేతిపంపు


గువ్వాడిలో నిరుపయోగంగా ఉన్న మినీ వాటర్ ట్యాంకు

వెళ్లిపోయారు. దీంతో ఆ పథకం పల్లె ప్రజలకు అందని ద్రాక్షాగానే మారింది.

శిథిలావస్థలో చేతిపంపులు

పలు గ్రామాల్లో లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన తాగునీటి పథకాలు ఏళ్ల తరబడి మరమ్మతులకు గురై తలుపులు తెరుచుకోకపోవడం చూస్తుంటే పరిస్థితి ఏవిధంగా ఉందో తేటతెల్లమవుతుంది. అలాగే కొండ్రాజుపల్లి, తూర్పుబోయమడగల బస్టాండ్ సెంటర్లతో పాటు పలు గ్రామాల్లోని చేతిపంపులు శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా దర్శనమిస్తుండడంతో ప్రజలతో పాటు ప్రయాణికులు గుక్కెడు నీటి కోసం గంటల తరబడి కుస్తీలు చేసి విసుగెత్తిపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి పథకాలను వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతి పూజ


సరస్వతి పూజలో పాల్గొన్న బాలికలు

సంగం, ఫిబ్రవరి 15: స్థానిక బీసీ బాలికల వసతిగృహంలో గురువారం సరస్వతీ పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థినులు పరీక్షలు బాగా రాయాలని సరస్వతిదేవికి మొక్కుకున్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేట్రిన్ మల్లీశ్వరి, విద్యార్థినులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

చేజర్ల, ఫిబ్రవరి 15: మండలంలోని ఆదురుపల్లి గ్రామంలో గురువారం ఆత్మకూరు శాసనసభ్యుడు మేకపాటి విక్రమ్‌రెడ్డి పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశాలలో ఇప్పటివరకు గ్రామాలలో చేసిన అభివృద్ధి, చేపట్టబోవు కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి, జడ్పీటీసీ పీర్ల పార్థసారధి, వీరరాఘవరెడ్డి, సిద్దులనాయుడు, రవీంద్ర, కోటయ్య, రాంబాబు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వీవీ ప్యాడ్‌లపై ఓటర్లకు అవగాహన


వీవీ ప్యాడ్‌లపై అవగాహన కల్పిస్తున్న వీఆర్వో

సంగం, ఫిబ్రవరి 15: మండలంలోని జండాదిబ్బ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగంపై గురువారం ఓటర్లకు అవగాహన కల్పించారు. వీఆర్వో సుధాకర్ ఈవిఎం, వివి ప్యాడ్స్‌పై ఓటు వినియోగం, అవి పనిచేసే విధానం ఓటర్లకు వివరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

వరికుంటపాడు, ఫిబ్రవరి 15: మండలంలోని తిమ్మారెడ్డిపల్లిలో ఇటీవల మృతిచెందిన షేక్ సుబహానీ కుటుంబానికి గురువారం మానవతా సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు. సంస్థ అధ్యక్ష, కన్వీనర్లు పోలక తిరుపతిరెడ్డి, వెండిదండి వెంకటేశ్వర్‌రెడ్డి మృతుని నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి తమవంతు చేయూతగా రూ. 27,500 నగదు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బాషామొహిద్దీన్, డైరెక్టర్ కాకు నాగేశ్వరరావు, సభ్యులు పీ మాల్యాచలం, ఎం నారాయణ, షేక్ హుస్సేన్, షేక్ చాంద్‌బాష, ఎం తిరుపతిరెడ్డి, వై వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐకి ఘన సన్మానం


ఎస్ఐను సన్మానిస్తున్న సర్పంచులు, నాయకులు

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 15: విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనపరిచి జిల్లా ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్న ఉదయగిరి ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డిని గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సర్పంచులు, నాయకులు ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. అలాగే విధి నిర్వహణలో ప్రతిభ కనపరిచి ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్న కోర్టు కానిస్టేబుల్ సుబ్బయ్యను సైతం సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ జీ ఓబులరెడ్డి, సర్పంచులు కల్లూరి వెంకటేశ్వర్‌రెడ్డి, సయ్యద్ గౌస్‌మొహిద్దీన్, నాయకులు దారపనేని చెన్నయ్య, దర్వేష్, గురవయ్య, బాషా తదితరులు పాల్గొన్నారు.

గృహాల రిజిస్ట్రేషన్ త్వరగా పూర్తి చేయాలి


సచివాలయ సిబ్బందికి సూచనలు ఇస్తున్న తహసీల్దారు, ఎంపీడీవో

ఏఎస్ పేట, ఫిబ్రవరి 15: స్థానిక సచివాలయాన్ని గురువారం తహసీల్దారు రవికుమార్ ఎంపీడీవో వెంకటేశ్వర్లుతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. జగనన్న గృహల రిజిస్ట్రేషన్ త్వరగా పూర్తిచేయాలన్నారు. సచివాలయ అధికారులు సమయ పాలన పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ప్రాణప్రతిష్ఠ మహోత్సవాలు


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వరికుంటపాడు, ఫిబ్రవరి 15: స్థానిక జాతీయ రహదారి సమీపంలో నూతనంగా నిర్మించిన శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ బింబ ప్రాణ ప్రతిష్ఠా మహోత్సవాలు గురువారం వ్యవస్థాపకులు పెండ్యాల సూర్యనారాయణ, అమ్మాజీ దంపతుల ఆధ్వర్యంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. తితిదేకు చెందిన పురోహితులు శాస్త్రోక్తంగా గోపూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, వాస్తుపూజ, హోమాలు, పారాయణం, త్యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, ధాన్యాదివాసం తదితర పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అల్పాహారంతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ మొక్కులు తీర్చుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

మౌలిక వసతుల కల్పనకు కృషి

ఉదయగిరి, ఫిబ్రవరి 15: ఉదయగిరి పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక బీసీ కాలనీ, స్టేట్‌పేట తదితర ప్రాంతాల్లో రచ్చబండ కార్యక్రమం నిర్వహించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అధికారులతో చర్చించి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అలాగే అప్పసముద్రం, గుడినరవ గ్రామాల్లో ప్రజా సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మోడి రామాంజనేయులు, మండల వైసీపీ కన్వీనర్ జీ ఓబులరెడ్డి, మాజీ ఎంపీపీ చేజర్ల సుబ్బారెడ్డి, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, నాయకులు అక్కి భాస్కర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, గొల్లపల్లి తిరుపతి, మట్ల శాంతి, షంషీర్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడి మృతికి సంతాపం

స్థానిక దేవలాలగడ్డ ప్రాంతానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు షేక్ హుస్సేన్ గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి వెళ్లి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ జీ ఓబులరెడ్డి, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, ఎంపీటీసీ గొల్లపల్లి తిరుపతి, నాయకులు ఎస్ఖాన్, ముర్తుజాహుస్సేన్, ఉప్పుటూరి శ్రీనివాసులు, నజీముద్దీన్, సర్ఫుద్దీన్, శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓపీఎస్‌ను అమలుచేసే వారికే మా ఓట్లు

● యూటీఎఫ్ ఆధ్వర్యంలో పోస్టుకార్డుల ఉద్యమం


పోస్టుకార్డులను ప్రదర్శిస్తున్న యూటీఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 15 : ఎవరైతే సీపీఎస్, జీపీఎస్ రద్దుచేసి ఓపీఎస్ (ఓల్డ్ పెన్షన్ స్కీం)ను అమలుచేస్తారో వారికే మా ఓట్లు వేస్తామని యూటీఎఫ్ నాయకులు తెలిపారు. ఈమేర మండలంలోని కరటంపాడు, ఆత్మకూరు, మురగళ్ల తదితర పాఠశాలల ఉపాధ్యాయులు గురువారం పోస్ట్‌కార్డు ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని వివిధ రాజకీయ పార్టీలకు పోస్టుకార్డు ద్వారా తమ వినతులను అందజేస్తామని, అన్ని రాజకీయ పార్టీల జిల్లా, మండల నాయకులందరికీ మెమోరాండాలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటిఎఫ్ జిల్లా కార్యదర్శి గంగాధర్, శివప్రసాద్‌రావు, మాజీ జిల్లా కార్యదర్శి ఎం గంగాధర్, ఆత్మకూరు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ రామ్మోహనరావు, షేక్ ఖాదర్‌బాష, ఈశ్వర్‌రెడ్డి, సుధాకర్‌రావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భారత్ బంద్‌ను విజయవంతం చేయండి

ఆత్మకూరు, ఫిబ్రవరి 15: కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా శుక్రవారం చేపట్టనున్న దేశవ్యాప్త గ్రామీణ భారత్ బంద్, పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలని సంయుక్త కిసాన్‌మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆత్మకూరు మండల కమిటీ నేతలు పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద నుంచి మున్సిపల్ బస్టాండ్ సెంటర్ వరకు చేపట్టే నిరసన ప్రదర్శనలో పాల్గొనాలని కోరారు.

జీవవైవిధ్యంపై అవగాహన సదస్సు


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 15: స్థానిక స్త్రీశక్తి భవనంలో ఫడ్స్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో గురువారం జీవవైవిధ్యం సంరక్షణపై సర్పంచులు, కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఎంపీడీవో ఈశ్వరమ్మ మాట్లాడుతూ అన్ని గ్రామ పంచాయతీల్లో జీవవైవిధ్య సదస్సులు నిర్వహించాలన్నారు. జీవవైవిధ్య కార్యాలయాలకు బోర్డులు, అవసరమైన సామాగ్రి సమకూర్చుకోవాలన్నారు. జీవవైవిధ్య సంరక్షణ పుస్తకాలను ఆవిష్కరించి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫడ్స్ డైరెక్టర్ పీవీ రమణయ్య, సర్పంచ్‌లు నెల్లూరు వెంకటస్వామినాయుడు, మొండ్రు తిరుపతి, నాయకులు కల్లూరి కృష్ణారెడ్డి, సత్తెనపల్లి శ్రీరాములు, పంచాయతీ కార్యదర్శులు కరీముల్లా, చంద్రశేఖర్, చినబాబు పాల్గొన్నారు.

ప్రసన్నుడి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి

బిట్రగుంట, ఫిబ్రవరి 15: కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అందరూ కలసి సమన్వయంతో పనిచేయాలని కావలి ఆర్డీవో శీనానాయక్ అన్నారు. బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై గురువారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో సమావేశం జరిగింది. కావలి డివిజనల్ పరిధిలోని అన్ని శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో శాఖలవారీగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏర్పాట్లపై చర్చించారు. ముఖ్యంగా పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉండేలా చూడాలని, దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఆరోగ్యపరంగా తగు చర్యలు తీసుకోవాలని ఆర్డీవో ఆదేశించారు. భద్రత విషయంలో పోలీసు, అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రాధాకృష్ణ, ఆలయ సిబ్బంది, పాలక మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీగా అభివృద్ధి చేసేందుకు కృషి

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 15: స్థానిక మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలను యూనివర్సిటీగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి తెలిపారు. ఈనెల 21వ తేదీన దివంగత మంత్రి మేకపాటి గౌతంరెడ్డి రెండో వర్ధంతి సందర్భంగా గురువారం ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డితో కలిసి కళాశాలలో చేయాల్సిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ గౌతంరెడ్డి వర్ధంతి రోజునే వ్యవసాయ కళాశాల ఆవరణలో సుమారు రూ.7 కోట్ల వ్యయంతో స్మృతివనం, కాంస్య విగ్రహం ఏర్పాటు పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ టీ గోపికృష్ణ, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, నాయకులు కల్లూరి కృష్ణారెడ్డి, సర్ఫుద్దీన్ పాల్గొన్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

గెలుపే లక్ష్యంగా పని చేద్దాం !

● కావలి టీడీపీ సమన్వయ కమిటీ సమావేశంలో నేతలు


నెల్లూరులో జరిగిన సమావేశంలో పాల్గొన్న సోమిరెడ్డి, నారాయణ, బీద రవిచంద్ర తదితరులు

కావలి, ఫిబ్రవరి 15 : కావలి నియోజకవర్గంలో గెలుపే లక్ష్యంగా అందరం సమష్టిగా పని చేద్దామని టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం నెల్లూరులోని టీడీపీ నేత మాలేపాటి సుబ్బానాయుడు నివాసంలో మాజీ మంత్రులు పొంగూరు నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, కావలి ఇన్‌చార్జి కావ్య కృష్ణారెడ్డి, మాలేపాటి సుబ్బానాయుడు, మాలేపాటి రవీంద్ర నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జులతో సమావేశం జరిగింది. త్వరలో జరగాల్సిన టీడీపీ సమావేశాలపై వారు చర్చించారు. ఎలాంటి అశ్రద్ధ లేకుండా ఏ చిన్న అవకాశాన్ని వదులుకోకుండా కార్యకర్తలు, నాయకులు శ్రమించాలని అన్నారు. పార్టీలో ఎలాంటి విభేదాలు, గ్రూపులు లేకుండా కలిసి కట్టుగా పనిచేసి కృష్ణారెడ్డిని గెలిపించి రాష్ట్రంలో చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు.

● తుమ్మలపెంట రోడ్డు అభివృద్ధికి కృషి : కావ్య

కావలి : టీడీపీ అధికారంలోకి రాగానే తుమ్మలపెంట రోడ్డుకు మోక్షం కల్పిస్తామని కావలి టీడీపీ ఇన్‌చార్జి కావ్య క్రిష్ణారెడ్డి చెప్పారు. కావలి రూరల్ మండలం తుమ్మలపెంట, అన్నగారిపాలెం పంచాయతీలకు చెందిన పలు గ్రామాల ప్రజలు గురువారం మునునూరులోని టీడీపీ కార్యాలయంలో కావ్యను కలిశారు. ఈ సందర్భంగా వారు తుమ్మలపెంట రోడ్డు పరిస్థితిని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే ప్రభుత్వ నిధులు ఆలస్యమైనా, సొంత నిధులు వెచ్చించి రోడ్డు బాగుచేయిస్తానన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే పాత పథకాలతోపాటు భవిష్యత్తుకు గ్యారెంటీ పథకాలను కూడా అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఆవుల రామకృష్ణ, సోమయ్యగారి రమణ, శ్రీనుబాబు, వాయిల శ్రీను, చంచంగారి శ్రీనివాసులు, పులి సుధాకర్, మస్తాన్, తాతా శివ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుల చేరిక

కాగా కావలి రూరల్ మండలం చినపట్టపుపాలెంకు చెందిన వైసీపీ నాయకులు, సానుభూతిపరులు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. నాగన్నగారి రాంబాబు, ఆవుల నరసింహం, నాగన్నగారి బాబు, వాయిల గోవింద్, నాగన్నగారి ప్రసాద్, ప్రళయకావేరి అంజిబాబు, కాటంగారి పెంచల్, ప్రళయకావేరి పోలిరెడ్డి తదితరులకు కావ్య క్రిష్ణారెడ్డి కండువాలు వేసి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● దుష్టపాలనకు చరమగీతం : బొల్లినేని

కలిగిరి : వైసీపీ దుష్ట పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఉదయగిరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బొల్లినేని వెంకటరామారావు పేర్కొన్నారు. కలిగిరి మండలంలో గురువారం ఆయన ప్రజాదీవెన యాత్రను పారంభించారు. ముందుగా గ్రామ దేవత కలిగిరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రచారం మొదలుపెట్టారు. దుకాణదారుల వద్దకు వెళ్లి సైకిల్ గుర్తుకి ఓటువేసి తనను గెలిపించాలని కోరారు. మాజీ ఎంపీటీసీ కొండపల్లి వెంకట్రావు, నిశ్శంకర సురేష్‌ల ఆధ్వర్యంలో పాతూరు వాసులు రహదారిపై బీవీఆర్ వెల్‌కం.. అంటూ పూలతో స్వాగతం పలికారు. చిన్నారులు సైతం జెండాలు చేతపట్టి బొల్లినేని వెంట కదిలారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పీ చెంచలబాబు యాదవ్, బీవీ రామారావు, వెంకటసుబ్బయ్య, బిజ్జం కృష్ణారెడ్డి, వెంకటసుబ్బయ్య, ఊసా మాల్యాద్రి, కాకు మహేష్ తదితరులు పాల్గొన్నారు.


కావలి : టీడీపీ శ్రేణులతో కలిసి విక్టరీ సింబల్ చూపుతున్న కావ్య


కలిగిరి : కలిగిరమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న బొల్లినేని తదితరులు

వేళకు రాని వైద్యులు

● రోగులకందని సేవలు


డాక్టర్ లేక ఖాళీగా ఉన్న కుర్చీ

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 15: స్థానిక పీహెచ్‌సీలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించడంలేదు. ఉదయం 10 గంటలు దాటినా ఒక్కరూ కూడా విధులకు హాజరు కాలేదు. పది దాటాక ఒక్కొక్కరుగా విధులకు హాజరవుతున్నారు. ఈ పీహెచ్‌సీలో ముగ్గురు వైద్యులు, సీహెచ్‌వో, పీహెచ్ఎన్, మహిళ ఎంపీహెచ్ఎన్, పురుష ఎంపీహెచ్ఎన్, ముగ్గురు స్టాఫ్‌నర్సులు, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్, ల్యాబ్‌టెక్నీషియన్, ఫార్మసిస్ట్, ఎఫ్ఎన్‌వో, అటెండర్ తదితరులు ఉన్నారు. అయితే ఏ ఒక్కరూ కూడా సమయ పాలన పాటించడంలేదు. దీంతో రోగులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తున్నది. అయినా సంబంధిత ఉన్నతాధికారులు పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా వారు స్పందించి వైద్యులు, సిబ్బంది సకాలంలో విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మాలకొండలో నేడు వేలం పాటలు

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 15 మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని కల్యాణ మండపంలో ఈనెల 1న జరగాల్సిన దుకాణాల వేలం పాటలు వివిధ కారణాలతో వాయిదా పడ్డాయని, వీటి వేలం ఈనెల 16వతేదీ మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ డీసీ కే.బీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

ఆ ప్రతిపాదనలు సిగ్గుచేటు !

కందుకూరు, ఫిబ్రవరి 15: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్‌ను మరో రెండేళ్ల పొడిగించాలని, వైసీపీ నేతలు చేస్తున్న ప్రతిపాదనలు వారి చేతకానితనానికి నిదర్శనమని టీడీపీ నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి గోచిపాతల మోషే గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. అమరావతిలో అప్పటి సీఎం చంద్రబాబు అవసరమైన సదుపాయాలన్నీ ఏర్పాటుచేయటంతోపాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో పరిశ్రమల ఏర్పాటు ద్వారా అన్నిప్రాంతాల అభివృద్ధికి శ్రీకారం చుట్టారని ఆయన గుర్తుచేశారు. జగన్మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక అమరావతి అభివృద్ధిని గాలికొదిలేశారని పేర్కొన్నారు. పాలకులు మరో రెండేళ్ల హైదరాబాద్‌నే ఉమ్మడి రాజధానిగా కొనసాగించాలని కోరుతుండటం సిగ్గుచేటని ఆయన పేర్కొన్నారు.

ఇస్కపల్లిలో ఈవీఎంపై అవగాహన

అల్లూరు, ఫిబ్రవరి 15: మండలంలోని ఇస్కపల్లిలో గురువారం ఈవీఎంపై ప్రజలకు అధికారులు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయంలో ఈవీఎంను ఏర్పాటు చేసి దాన్ని ఎలా వినియోగించుకోవాలో వివరించారు. అనంతరం ప్రజల అడిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచి పాటి రంజిత్‌కుమార్, నాయకులు బీద రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు బోర్డులో ఉద్యోగావకాశాలు

కలిగిరి, ఫిబ్రవరి 15: స్థానిక పొగాకు బోర్డు కార్యాలయంలో 2024 వేలం సీజన్‌కు సంబంధించి సీజనల్ క్లర్క్ ఉద్యోగానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వేలం నిర్వహణాధికారి వీ మహేష్‌కుమార్ తెలిపారు. డిగ్రీ విద్యార్హత ఉన్న అభ్యర్థులు తమ దరఖాస్తులను పూర్తిచేసి పొగాకు బోర్డులో ఈ నెల28లోగా అందించాలని కోరారు.

ఫ్రిజ్‌ల బహూకరణ

కావలిటౌన్, ఫిబ్రవరి15: కావలి జంగాలకాలనీలో నూతన వధూవరులైన రెండు పేద జంటలకు శానం కృష్ణ, ప్రణీత దంపతులు గురువారంఫ్రిజ్‌లను బహూకరించారు. ఈ సందర్భంగా శానం కృష్ణ మాట్లాడుతూ 20 ఏళ్ల నుంచి పేదల వివాహాలకు విలువైన గృహోపకరణాలు, బంగారు తాళిబొట్లు, బంగారు కమ్మలు బహూకరిస్తున్నామని తెలిపారు. ఇకపై కూడా ఇదే ఆనవాయితీని కొనసాగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆదిలక్ష్మి, కరిష్మా, గౌస్‌బాష, ఆలీ, ఖలీల్, షాహుల, వలీ తదితరులు పాల్గొన్నారు.

ఓపీఎస్‌పై పోస్టు కార్డుల ఉద్యమం


పోస్టుకార్డులు ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

లింగసముద్రం, ఫిబ్రవరి 15: ఓట్ ఫర్ ఓపీఎస్ ఉద్యమంలో భాగంగా రాష్ట్రంలోని రాజకీయ పార్టీల అధ్యక్షులకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో పోస్టు కార్డులు రాశారు. గురువారం స్థానిక హైస్కూల్‌లో జిల్లా కార్యదర్శి కిలారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని పార్టీ అధ్యక్షులు సీపీఎస్‌పై వారి వైఖరిని స్పష్టంగా ప్రకటించాలని, అలా ప్రకటించిన వారికే తమ మద్దతు ప్రకటిస్తామన్నారు. ఈ సందర్భంగా వారు పోస్టుకార్డులను ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎం యూ మాధవరావు, యూటీఎఫ్ నాయకులు కే ప్రభాకర్, ఎం కొండయ్య, ఎం సుధాకర్‌రావు, షేక్ మస్తాన్‌వలి, డి మాధవరావు, సతీష్ పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయం వద్ద ఉద్యోగుల నిరసన


ఆర్డీవో శీనానాయక్‌కు వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగులు

కావలిటౌన్, ఫిబ్రవరి15: కావలి డివిజన్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ ఎన్ శివకుమార్ ఆధ్వర్యంలో గురువా రం ఉద్యోగులు ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపి ఆర్డీవోకు వినతిపత్రం అందించారు.అనంతరం శివకుమార్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ఇప్పటికైనా ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలన్నారు. 12వ పీఆర్సీపై దాటవేత వైఖరి విడనాడి వెంటనే తగిన నిర్ణయం తీసుకోవాలన్నారు. ఉద్యోగులందరికీ హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, రేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు మధుసూదన్‌రావు, దీక్షితులు, బ్రహ్మయ్య, ఉమాశంఖర్, ఆకుల రమణయ్య, రాజు, షాహుల్ హమీద్ తదితరులు పాల్గొన్నారు.

● మత్తుపదార్థాల విక్రేతలపై కఠిన చర్యలు తీసుకోవాలి

కావలి : మత్తు పదార్థాలు అమ్మేవారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్. మల్లి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేపట్టి ఆర్డీవో శీనానాయక్‌కు వినతిపత్రం అందచేశారు. అనంతరం మాట్లాడుతూ కావలి ప్రాంతంలో కొందరు గంజాయి, ఇతర మత్తు పదార్థాలను యథేచ్ఛగా విక్రయిస్తున్నా రన్నారు. బెల్టు షాపులు కూడా విచ్చలవిడిగా ఉన్నాయని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో చౌటూరి వెంకటరత్నం, జరుగుమల్లి విజయరత్నం, జనార్దనరావు, గోళ్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రథసప్తమి పూజలు ఎంతో శ్రేష్టం

బిట్రగుంట, ఫిబ్రవరి 15: రథసప్తమి పూజలు ఎంతో శ్రేష్టమని ప్రసన్న ఆలయ ప్రధాన అర్చకులు సత్యనారాయణాచార్యులు అన్నారు. బోగోలు మండలం కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంలోని ఆలయ ప్రాంగణంలో ఈవో రాధాకృష్ణ ఆధ్వర్యంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం రథసప్తమిని పురస్కరించుకుని ఆలయంలో తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజాభిషేకాలు జరుగుతాయన్నారు. ఉదయం 6.30 గంటలకు స్వామివారు సూర్యప్రభ వాహనంపై ఊరేగుతారని, అనంతరం అన్నదానం, రాత్రికి చంద్రప్రభ వాహనోత్సవం జరుగుతుందని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ అర్చక బృందం, పాలక మండలి సభ్యులు సిబ్బంది పాల్గొన్నారు.

వారబందీ పద్ధతిలో సాగునీరివ్వాలి

బిట్రగుంట, ఫిబ్రవరి 15: వారబందీ పద్ధతిలో సోమశిల నీటిని విడుదల చేస్తే రైతులంతా పంటలు పడించుకుంటారని సీపీఎం జిల్లా నాయకుడు పీ శ్రీరాములు అన్నారు. బోగోలులో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు వేసిన రైతులకు సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సోమశిల నీటిని వారబందీ పద్ధతిలో విడుదల చేస్తే సాగునీటి సమస్య పరిష్కరించుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మల వెంకయ్య చల్లా నరహరి తదితరులు పాల్గొన్నారు.

ప్లేస్‌మెంట్స్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

కందుకూరు : ప్లేస్‌మెంట్స్ కోసం ఇచ్చే క్యాంపస్ రిక్రూట్‌మెంట్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య పేర్కొన్నారు. కళాశాలలో రెండువారాలుగా మాక్స్ సంస్థ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ విద్యార్థులకు ఏర్పాటుచేసిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్ శిక్షణ ముగింపు కార్యక్రమం గురువారం జరిగింది. ఆయన మాట్లాడుతూ రెండేళ్లుగా కార్పొరేట్‌రంగంలో ఉద్యోగ నియామకాల సంక్షోభం నెలకొని ఉన్నా మెజారిటీ విద్యార్థులను ఉద్యోగపత్రాలతో పంపటంలో టెక్నికల్ డైరెక్టర్ కె. విజయ్ శ్రీనివాస్ విజయం సాధించాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శిక్షణలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదును అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టరు సీహెచ్ రవికుమార్, కళాశాల టెక్నికల్ డైరెక్టర్ కె. విజయ్‌శ్రీనివాస్, మాక్స్ సంస్థ ప్రతినిధి కోటిరెడ్డి, ప్లేస్‌మెంట్స్ కో ఆర్డినేటర్స్ బాలకృష్ణ, కే కోటయ్య, ఎన్. మాధవరావు, సురేష్, వీ శ్రీనివాసరెడ్డి, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కోటిరెడ్డి